సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 169

సోమవారం 4-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఢిల్లీ 'హ్యాట్రిక్'..

ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్‌పై 25 పరుగుల తేడాతో గెలుపు - 12లో



తీవ్ర వ్యాధుల్లో ఆదుకునే అస్త్రం

క్రిటికల్ ఇల్‌నెస్ ఇన్సూరెన్స్.. మారిన జీవనశైలితో వ్యాధుల ముప్పు - 13లో



10 రోజులు.. 29 కార్యక్రమాలు

ప్రధాని నరేంద్ర మోదీ రాబోయే 10 రోజుల్లో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 29 కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వివరాలు 6లో ▸



ఇండియా కూటమి ఎన్నికల భేరి

ఇండియా కూటమి ఎన్నికల భేరి మోగించింది. కేంద్రం ధనికుల కోసమే రైల్వే విధానాలను రూపొందిస్తోందని రాహుల్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



ట్రంప్‌కు వరుస విజయాలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న ట్రంప్ మరో మూడు రాష్ట్రాల ప్రైమరీల్లో గెలిచారు.

వివరాలు 6లో ▸



హిమగిరులకు పెనుముప్పు!

2100 నాటికి హిమాలయాల్లోని 75 శాతం మంచు కరిగిపోయే ప్రమాదం ఉందని ఇండియా పర్యావరణ నివేదిక తెలిపింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

గ'లీజు' గురివింద!

- అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి టీడీఆర్‌లు కొట్టేసిన రామోజీ.. అద్దె స్థలాన్ని ఆక్రమించి అడ్డగోలుగా పరిహారం వసూలు
- నిన్నటిదాకా రుషికొండ.. ఇవాళ తీరానికి తూట్లంటూ బురద రాతలు
- కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో టీడీపీ కార్యాలయాల ఏర్పాటు
- అనుమతులతోనే అరబిందో సంస్థ పనులు ప్రారంభం

2 లో

ఆస్తుల కోసం సునీత... అధికారం కోసం చంద్రబాబు



వైఎస్ వివేకాను చంపిందెవరు?

- తండ్రి రెండో వివాహంపై సునీత, ఆమె భర్త ఆగ్రహం
- రెండో భార్య షమీమ్‌ను బెదిరించిన సునీత భర్త, బావ
- తండ్రి వీలునామా రాస్తానని చెప్పటంతో అడ్డు తొలగించే కుట్ర
- వివేకా మరణించాక ఆయన ఆస్తులన్నీ సునీతకు బదలాయింపు
- ఈ పరిణామాల క్రమం చూస్తే సూత్రధారులెవరో ఇట్టే తెలిసే ఛాన్స్
- నాడు అధికారంలో ఉండి దర్యాప్తును నీరుగార్చిన చంద్రబాబు
- ఆ ఆరు వారాలూ సాక్ష్యాధారాలు లేకుండా చేయటమే ఆయన పని
- తన భర్త, బావమరిదిని బయటపడేయటానికి సునీత ప్రయత్నం
- తన రాజకీయ ప్రత్యర్థుల్ని ఇరికించాలనేది చంద్రబాబు పన్నాగం
- అందుకే ఈ ఇద్దరి కలయిక... నాటి నుంచీ మరింత లోతులకు
- టీడీపీ సహా బాబు అనుకూల శక్తులంతా సునీత వెనకే
- ఇప్పుడు టీడీపీ తరఫున పోటీ చేయాల్సి రావచ్చనేది సునీత ఉద్దేశం
- అందుకే ముసుగు తీసేసి... ఎల్లో మీడియా అందరికీ ధన్యవాదాలు

సూత్రధారులు, పాత్రధారుల ముసుగులు తొలగించే కథనమిదిగో...



వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినపుడు ముఖ్యమంత్రి స్థానంలో అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడే ఇప్పుడు అమాయకంగా... హత్య చేసిందెవరు? అని ప్రశ్నిస్తున్నారు. ఇది వారం రోజుల్లో తేల్చాల్సిన కేసు అని చెబుతున్న వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత... హత్య జరిగాక రెండు నెలలపాటు అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడిని ప్రశ్నించటమే లేదు. అంతే కాదు. హత్య చేశానని, తన తల్లితో అక్రమ సంబంధం పెట్టుకున్నందుకు మరికొందరితో కలిసి వివేకాను తనే గొడ్డలితో నరికానని అంగీకరించిన దస్తగిరి ఇప్పుడు జైలు నుంచి విడుదలై దర్జాగా బయట తిరుగుతున్నాడు. సునీతకు, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఆత్మీయుడిగా మారాడు. చంద్రబాబు అనుకూల మీడియాకు వీఐపీ నాయకుడైపోయాడు. వివేకా గుండెపోటుతో చనిపోయారని సునీత బావగారు శివప్రకాశ్‌రెడ్డితో సహా పలువురికి ఫోన్లు చేసి చెప్పిన నాటి టీడీపీ మంత్రి ఆదినారాయణరెడ్డి.. తర్వాత ఓడిపోవటంతో బీజేపీలోకి ఫిరాయించారు. వీళ్లలో హత్య చేసిన వాళ్లు... చేయించిన వాళ్లు... దాన్ని కప్పిపుచ్చి రాజకీయ ప్రత్యర్థుల్ని ఇరికించడానికి ప్రయత్నిస్తున్న వారు... అంతా ఉన్నారు. అందరూ కలిసి లోతైన కుట్రతో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై, ఆయన కుటుంబంపై దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు ఈ కుట్రను మరింత లోతుకు తీసుకెళుతున్నారు.

10 లో

వివేకా హత్యతో లాభమెవరికి?

మాటమార్చి.. బాబు గూటిలోకి వెళ్లిందెవరు?



రూ.8 లక్షల విలువైన గంజాయి పట్టివేత

జేసీపీ స్పేర్ పార్టుల లోడుతో హరియాణా వెళ్తున్న కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని విశాఖపట్నంలోని ఆనందపురం పోలీసులు పట్టుకున్నారు. సినీ ఫక్కీలో వెంబడించి కంటెయినర్‌ను అడ్డుకొని.. అందులోని రూ.8 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

5 లో

పదో తరగతి హాల్‌టికెట్లు సిద్ధం

నేటి నుంచి డౌన్‌లోడ్ ప్రక్రియ ప్రారంభం


ఈ నెల 18 నుంచి 30 వరకు పరీక్షలు

హాజరుకానున్న 7.25 లక్షల మంది విద్యార్థులు

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 18 నుంచి 30 వరకు జరిగే పరీక్షలకు విద్యార్థుల హాల్‌టికెట్లను సిద్ధం చేసినట్లు పదో తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ కోడ్ నంబర్‌తోను, విద్యార్థులు తమ పుట్టిన తేదీని నమోదు చేసి సోమవారం మధ్యాహ్నం నుంచి www.bse.ap.gov.in నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 6,23,092 మంది రెగ్యులర్ విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలున్నారు. గతేడాది పదో తరగతి తప్పి తిరిగి ప్రవేశం పొందినవారు మరో 1,02,528 మంది కూడా రెగ్యులర్‌గా పరీక్షలు రాయనున్నారు. ఈ



ఏడాది మొత్తంగా 7,25,620 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వీరికోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,473 సెంటర్లను సిద్ధం చేశారు. ప్రధాన పరీక్షలు మార్చి 28వ తేదీతో ముగుస్తుండగా, మరో రెండు రోజులు ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలుంటాయి. విద్యాశాఖ 156 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 682 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను సిద్ధం చేసింది. 130కి పైగా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



పాక్ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్

పాకిస్తాన్ ప్రధానమంత్రిగా పీఎంఎల్-ఎన్ నేత షెహబాజ్ షరీఫ్ ఎన్నికయ్యారు. నూతన ప్రధాని ఎన్నిక కోసం పాకిస్తాన్ పార్లమెంట్‌లో ఓటింగ్ నిర్వహించగా.. 336 ఓట్లకు గాను షెహబాజ్‌కు 201 ఓట్లు దక్కాయి. ఇమ్రాన్ ఖాన్ అభ్యర్థి ఒమర్‌కు 92 ఓట్లు దక్కాయి. షెహబాజ్ నేడు ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కశ్మీరీల, పాలస్తీనియన్ల స్వేచ్ఛను కోరుతూ పార్లమెంట్‌లో తీర్మానం చేయాలని షెహబాజ్ వ్యాఖ్యానించారు.

6 లో

రేపు విశాఖలో సీఎం జగన్ పర్యటన

పారిశ్రామికవేత్తలతో సమావేశం

ఉపాధి పొందిన యువతతో మాటామంతి

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఉదయం 9.10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటారు. అక్కడి రాడిసన్ బ్లూ రిసార్ట్స్‌లో జరిగే విజన్ విశాఖ సదస్సులో వివిధ రంగాల వాణిజ్య, పారిశ్రామిక వేత్తలతో సమావేశమవుతారు. అనంతరం పీఎంపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి పొందిన యువతతో సమావేశమవుతారు.



రాష్ట్ర యువతకు నైపుణ్య 'భవిత'

రాష్ట్ర యువత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్య శిక్షణ ఇచ్చేలా 'భవిత' పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. భావి అవసరాలకు తగిన విధంగా నైపుణ్య శిక్షణ ఇచ్చేలా రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ స్కిల్ క్యాస్కేడింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్టు నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి బి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా 'భవిత'ను తీర్చిదిద్దినట్టు తెలిపారు. దీనికి సంబంధించి

మిగతా 2వ పేజీలో ▶

విద్యుత్ దీపాలంకరణలో శ్రీశైల ఆలయం



హంస వాహనంపై ఆదిదంపతులు

శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు హంస వాహన సేవ నిర్వహించారు. హంసవాహనాధీశులైన స్వామి అమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు.

5 లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venco... CHICKEN | సూచించిన నేటి గుడ్లు & చికెన్ అనంతపురం జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 72

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 134 | బ్రాయిలర్ లైవ్ బర్డ్ 156 | డ్రెస్డ్ స్కిన్‌తో 226 | స్కిన్‌లెస్ 257

Conditions Apply

ఇదండీ సంగతి



తన పేరు ఫస్ట్‌లిస్ట్‌లో రాలేదట! సెకండ్ లిస్ట్‌లో కూడా రాకుంటే పక్క పార్టీ ఫస్ట్ లిస్ట్‌లో వచ్చేట్లు చేసుకుంటాడట!

చిన్న పరిశ్రమల వికాసంపై ఫోకస్

ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆరు సూత్రాల ప్రణాళిక అమలు

- 'ఉద్యమ్' పోర్టల్‌లో నమోదు చేయించి కేంద్ర, రాష్ట్ర పథకాలతో పాటు మార్కెటింగ్ అవకాశాల కల్పనకు చర్యలు
- రాష్ట్రంలో ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు కాని 45 లక్షల ఎంఎస్‌ఎంఈలు ఉన్నట్టు అంచనా
- 25 శాతం పరికరాలు, ఇతర ఉత్పత్తులను ఎంఎస్‌ఎంఈల నుంచే కొనుగోలుకు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: అత్యధికులకు ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ)లను చేయి పట్టి నడిపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు సూత్రాల ప్రణాళికతో ముందుకు వెళుతోంది. రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలన్నింటినీ గుర్తించి 'ఉద్యమ్' పోర్టల్‌లో నమోదు చేయించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో పాటు మార్కెటింగ్ అవకాశాలు, బ్యాంకుల నుంచి రుణాలందించడం, అవకాశాలను అంది పుచ్చుకుంటూ విస్తరించే విధంగా అవకాశాలు కల్పించడం, ఇతర రాష్ట్రాలతో పోటీపడుతూ తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేయించడం,ఎస్సీలు, ఎస్టీలు, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే విధంగా పటిష్టమైన ప్రణాళికను రూపొందించింది.

'ఉద్యమ్' పోర్టల్‌లో నమోదుకు చర్యలు

ఇప్పటికీ ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు కాని ఎంఎస్‌ఎంఈలు 45 లక్షలకు పైగా ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. వీటిని త్వరతగతిన గుర్తించి ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేయించే విధంగా కసరత్తు చేస్తోంది. ఇందుకోసం మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఎంఎస్‌ఎంఈ సర్వేను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతానికి ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన

మిగతా 2వ పేజీలో ▶

ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్ సదస్సులో మాట్లాడుతున్న సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లాం



ఇదే కదా సుపరిపాలన

ఐదేళ్లలో 2.18 లక్షల శాశ్వత ఉద్యోగాల కల్పన

సచివాలయ వ్యవస్థలో గ్రామ స్వరాజ్యం

- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ఏపీని ఆదర్శంగా తీసుకుంటున్న పలు రాష్ట్రాలు
- ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్ సదస్సులో సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లాం

14 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

చిన్నపాటి వ్యాపారంతో చింత తీరింది



మాది నిరుపేద కుటుంబం. విజయనగరం గజపతినగరం మండలం కొణిశ గ్రామ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాం. కుటుంబంలో అందరం రోజు కూలీలమే. ప్రతి రోజూ కూలి లభించేది కాదు. దీంతో రోజు గడవడం కష్టంగా మారింది. మా ఆయన చేసిన కూలీకి వచ్చే డబ్బులు దుబారా చేసేవాడు. ఇంటికి సక్రమంగా ఇచ్చేవాడు కాదు. పిల్లలను పెంచడానికి ఇబ్బంది పడేదాన్ని. ఆ సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. జగనన్న తోడు పథకానికి దరఖాస్తు చేసుకోగానే ఏడాదికి రూ.పది వేలు వంతున వచ్చింది. దీనికి తోడు వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన రూ.12,500 కలిపి ఆ మొత్తంతో ఇంట్లోనే చిన్నపాటి పాన్ షాపు పెట్టుకున్నా. మా అబ్బాయి వినయ్ ఇప్పుడు ఏడో తరగతి చదువుతున్నాడు. అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు వంతున మూడేళ్లుగా అందుతోంది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా మామ గారికి పింఛన్ కూడా అందుతోంది. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. మమ్మల్ని ఆదుకున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– సాంబారిక మంగ, కొణిశ
(పొండ్రంకి అప్పలనాయుడు, విలేకరి, గజపతినగరం రూరల్)

అద్దె ఇంటి బాధ తప్పింది



మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. నాకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు. విజయనగరం జిల్లా జి.సిగడాం మండలం, పెనసాం గ్రామంలో నివాసం. కుటుంబ పోషణ కోసం భార్యా, పిల్లలతో గుంటూరు వలస వెళ్లాను. అక్కడ రోజు వారీ వేతనదారుగా మిర్చి గోదాంలో పనికి చేరాను. రాబడి అంతంత మాత్రమే. అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడ్డాం. ఆ తర్వాత పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ చేరుకున్నాం. ఇక్కడ కూడా అద్దె ఇళ్లలోనే నివాసం. కష్టపడిన సొమ్ము అద్దెకే సరిపోయేది. నా భార్య బొంతలు కుడుతూ ఆర్థికంగా సహకరించినా.. ఎదుగుతున్న పిల్లలు, పెరుగుతున్న వారి అవసరాలు.. నిత్యం ఆందోళనగా ఉండేది. గత ప్రభుత్వాల నుంచి ఎలాంటి పథకాలు అందలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జగనన్న ప్రభుత్వం అండగా నిలిచింది. అమ్మఒడి ఆదుకోవడంతో పిల్లలు బడిబాట పట్టారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందాల్సిన అన్ని సౌకర్యాలు సమకూరాయి. జగనన్న అర్బన్ కాలనీలో సెంటు స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం అందింది. ఇక్కడ సొంత గృహాన్ని కట్టుకున్నాం. ఇటీవలే గృహ ప్రవేశం చేశాం. మమ్మల్ని చూసి నిట్టూర్చిన వారే.. నేడు భుజం తడుతున్నారు.

– పిల్లల జగదీశ్వరావు, పాలకొండ
(మారోజు కళ్యాణ్‌కుమార్, విలేకరి, పాలకొండ)

ధైర్యంగా జీవిస్తున్నాం



మాది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించుకునేందుకు నానా పాట్లు పడ్డాను. చివరకు బతుకు తెరువుకోసం కువైట్ వెళ్లాను. 2018లో పక్షవాతం రావడంతో సొంత ఊరైన వైఎస్సార్ జిల్లా చాపాడు గ్రామానికి తిరిగొచ్చేశా. ఉన్న కాస్త డబ్బులూ వైద్యానికే ఖర్చయిపోయాయి. జీవనోపాధి లేక, కుటుంబ పోషణకు ఎన్ని నిద్రలేని రాత్రుళ్లు గడిపానో భగవంతుడికే తెలుసు. 2019లో జగనన్న అధికారంలోకి వచ్చాక మా బాధలు తీరాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా కుటుంబానికి ఆసరాగా నిలిచాయి. పెరాలసిస్ రోగిని కావడంతో ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.5 వేలు పింఛన్ అందుతోంది. రైతు భరోసా పథకంలో ఏటా రూ.13,500 మా బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. నా భార్య మాబుఖాన్‌కు వైఎస్సార్ చేయూత పథకంలో ఏటా రూ.18,750 చొప్పున అందింది. ఆసరా పథకంలో ఏటా రూ.7,200 బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. నా కుమార్తె కౌసర్‌భాను గ్రామ వలంటీర్‌గా చేస్తోంది. మరో కుమార్తె ముబారక్ ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తోంది. ఉన్న కాస్త పొలంలో ఓపిక ఉన్నంత మేరకు వ్యవసాయం చేసుకుంటూ, ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలతో కుటుంబాన్ని ధైర్యంగా పోషించుకోగలుగుతున్నా. మాలాంటి కుటుంబాలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– కొత్రపాటి అబ్దుల్ రసూల్, చాపాడు గ్రామం
(శ్రీపతి సుబ్బయ్య, విలేకరి, చాపాడు)

గ'లీజు' గురివింద!

సాక్షి, విశాఖపట్నం :

పచ్చకామెర్ల బాధితులకు లోకమంతా పచ్చగా కనిపిస్తుంది!

అద్దె స్థలానికి ఎసరు పెట్టిన గురివిందకు.. అనుమతులున్న స్థలాలు అక్రమమే అనిపిస్తాయి!

బంధువుల భూమినే కాజేసిన భూ రాబందుకు.. సొంత భూమిలో ఎవరు నిర్మాణాలు చేపడుతున్నా గిట్టదు!



రామోజీ కాజేయాలనుకున్న ఈనాడు కార్యాలయాన్ని నిర్మించిన స్థలం



దసపల్లా భూముల్లో కొంత భాగాన్ని ఆక్రమించి నిర్మించిన టీడీపీ కార్యాలయం

అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేసినట్లుగా.. తనను అక్కున చేర్చుకొని ఆదరించిన విశాఖపై బురద చల్లుతున్న ఈనాడు రామోజీ నగరానికి ముఖ్యమంత్రి వస్తున్నారంటే చాలు ఉలిక్కిపడి విషం చిమ్ముతున్నారు. ఇన్నాళ్లూ రుషికొండపై నానాయాగీ చేసిన ఈనాడు ఇప్పుడు అక్కడ భవనాలు ప్రారంభం కావడంతో మరో బురద జల్లుడు కార్యక్రమానికి తెగబడింది. అన్ని అనుమతులూ తీసుకుని ఓ దిగ్గజ సంస్థ సొంత భూమిలో నిర్మాణాలు చేపడుతుంటే అదేదో నేరమన్నట్లుగా దిగజారుడు కథనాలను ప్రచురించింది. విశాఖ తీరానికి తూట్లు పొడుస్తున్నారంటూ రామోజీ శోకాలు పెట్టారు. విశాఖలో లక్షల ఎకరాల భూ రికార్డులను మాయం చేసిన చరిత్ర టీడీపీదే. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద భూముల్లో పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకున్న ఘనత చంద్రబాబుదే. వాస్తవానికి భీమిలిలో కొంత భూమిని కొనుగోలు చేసిన దిగ్గజ సంస్థ అరబిందో సీఆర్‌జెడ్ నిబంధనలకు లోబడి అన్ని అనుమతులూ తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈనాడుకు మాత్రం అది దేశద్రోహంలా కనిపిస్తోంది.

సంతకాలు ఫోర్జరీ..

పచ్చళ్లు అమ్ముకుంటూ వచ్చిన రామోజీని విశాఖ నగరం అక్కున చేర్చుకుంది. అయితే ఆయన తన వ్యాపార విస్తరణకు సహకరించిన నగరాన్నే మింగేసే వైట్ కాలర్ క్రిమినల్‌గా మారిపోయారు! కుటుంబ సభ్యుల్ని మోసగించిన వ్యక్తిగా... బంధువుల్ని కోర్టుల చుట్టూ తిప్పి వారి భూముల్ని కొల్లగొట్టిన వ్యాపారిగా.. పత్రికను అడ్డం పెట్టుకొని కుళ్లు రాజకీయాలకు మూలపురుషుడుగా రామోజీ మిగిలిపోయారు. విశాఖలో కబ్జాలకు, గలీజు దందాలకు ఆద్యుడిగా నిలిచారు.

1974లో విశాఖలోని సీతమ్మధారలో 2.78 ఎకరాల భూమిని, 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 10 భవనాలను నెలకు రూ.3 వేలు అద్దె చొప్పున 33 ఏళ్ల లీజుకు మంతెన ఆదిత్యవర్మ నుంచి లీజుకు తీసుకున్న రామోజీ గడువు ముగిసినా ఖాళీ చేయకుండా తిరిగి కోర్టులో కేసు వేశారు. స్థలం యజమానికి తెలియకుండా కొంత భూమిని రోడ్డు విస్తరణకు అప్పగించి ప్రతిఫలంగా ప్రభుత్వం నుంచి కొంత స్థలాన్ని పొందారు. రామోజీ దాన్ని తన కుమారుడి పేరిట రిజిస్టర్ చేయించుకున్నారు. లీజు స్థలాన్ని తన సొంతమని పేర్కొంటూ ప్రభుత్వానికి అప్పగించటం.. ప్రతిఫలంగా పొందిన స్థలాన్ని రామోజీ రిజిస్టర్ చేసుకుని మోసపూరితంగా వ్యవహరించడంతో యజమాని మంతెన ఆదిత్యవర్మ క్రిమినల్ కేసు దాఖలు చేశారు. దీన్నుంచి తప్పించుకునేందుకు రామోజీ ఏకంగా విశాఖ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఫోర్జరీ చేయడం గమనార్హం. ఫోర్జరీకి సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నట్లు తేలడంతో న్యాయస్థానం రామోజీపై కేసు నమోదుకు ఆదేశించగా స్టే తెచ్చుకున్నారు. దిగువ కోర్టు నుంచి అత్యున్నత న్యాయస్థానం వరకూ ఫోర్జరీకి సంబంధించి రామోజీకి చీవాట్లు పెట్టడంతో బిల్డింగ్ కొట్టేద్దామన్న ప్రయత్నాలు విఫలమై గత్యంతరం లేక ఆ స్థలాన్ని యజమానికి అప్పగించారు.

కబ్జా 'కార్యాలయం' కనిపించలేదా?

దసపల్లా భూముల వ్యవహారం కోర్టులో ఉండగానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అందులో కొంత భాగాన్ని టీడీపీ కార్యాలయం నిర్మించేందుకు కేటాయించుకున్నారు. నగరం నడిబొడ్డున సర్వే నం 1196లో 2 వేల గజాల్ని కారుచౌకగా అప్పగించేశారు. ఇది చాలదన్నట్లుగా పక్కన ఉన్న కొండని సైతం తొలిచేసి 100 నుంచి 300 గజాల్ని ఆక్రమించేసి భవనాన్ని నిర్మించుకుంటే రామోజీ కళ్లు మూసుకున్నారు. మరోవైపు ఇల్లు నిర్మించుకునేందుకు ఓ వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించిన నాటి మంత్రి గంటా శ్రీనివాసరావు అక్కడ తన కలల సౌధాన్ని కట్టుకున్నారు. ఆ కబ్జా కాండ బయటకు రాకుండా రామోజీ అడ్డుపడ్డారు. దీన్ని సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో టీడీపీ నేతలు ఉలిక్కిపడి భూ యజమానితో బేరసారాలకు దిగారు.



గీతం ఆక్రమిత భూమిల్ని స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

విద్యాలయం పేరుతో విధ్వంసం..

టీడీపీ నేత, మాజీ ఎంపీ దివంగత ఎంవీవీఎస్ మూర్తి రుషికొండ ప్రాంతంలో 42.51 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. గీతం యూనివర్సిటీకి సమీపంలో ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించుకొని రెండు ఎకరాల్లో భవన నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మించారు. సుమారు రూ.500 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని దశాబ్దాల పాటు కబ్జా చేసినా టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గీతం యూనివర్శిటీ కాంపౌండ్ వాల్‌ను తొలగించి కబ్జాలో ఉన్న 40.51 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. విలువైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తుంటే విశ్వవిద్యాలయాన్ని నాశనం చేస్తున్నారంటూ నాడు రామోజీ బురద చల్లేందుకు ప్రయత్నించారు.

చిన్న పరిశ్రమల వికాసంపై ఫోకస్

▶ మొదటి పేజీ తరువాయి

ఎంఎస్ఎంఈల సంఖ్య 7.52 లక్షలు కాగా.. వీటిలో 1.6 లక్షల పరిశ్రమలు తయారీ రంగానికి చెందినవి కాగా 5.7 లక్షల యూనిట్లు సేవా రంగానికి చెందినవి. వీటిలో 96 శాతం యూనిట్లు అత్యధికంగా సూక్ష్మ రంగానికి చెందినవే కావడం గమనార్హం.

ఎంఎస్ఎంఈల నుంచి కొనుగోళ్లు తప్పనిసరి

రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ విభాగాలు ఏటా చేసే కొనుగోళ్లలో 25 శాతం తప్పనిసరిగా ఎంఎస్ఎంఈ యూనిట్ల నుంచే ఉండాలంటూ జీవోను జారీ చేసింది. కోవిడ్ సమయంలో ఎంఎస్ఎంఈలు మూతపడకుండా చేయూతనిచ్చే విధంగా ఈ జీవోను తీసుకొచ్చింది. అయినా.. కొన్ని ప్రభుత్వ విభాగాలు రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల నుంచి కాకుండా వేరే రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు చేస్తున్నట్టు ప్రభుత్వ దృష్టికి రావడంతో రాష్ట్ర ఎంఎస్ఎంఈలను కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు చేస్తే అటువంటి బిల్లులకు ఆమోదం తెలపవద్దంటూ ఆర్థిక శాఖకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ఎంఎస్ఎంఈలకు చాలా ప్రోత్సాహం లభిస్తుందని ఎఫ్ఎస్ఎంఈ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఏపీకే రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రేపు విశాఖలో సీఎం జగన్ పర్యటన

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే 152 యూనిట్లతో ఒప్పందాలు చేసుకున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో నైపుణ్య శిక్షణకు సంబంధించి పలు సంస్థలతో ఒప్పందాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో రూ.90 కోట్లతో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను ముఖ్యమంత్రి వర్చువల్‌గా విశాఖ నుంచి ప్రారంభిస్తారు. అలాగే ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఒక్కోటి రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లనూ సీఎం ప్రారంభిస్తారు. 2023–24 సంవత్సరంలో నైపుణ్య శిక్షణను పూర్తి చేసుకుని ప్లేస్‌మెంట్స్ పొందిన 7,110 మంది విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెర్మనీని నిర్వహించనున్నారు.

7న సీఎం అనకాపల్లి రాక

సాక్షి, అనకాపల్లి : సీఎం జగన్ 7న అనకాపల్లి రానున్నారు. వైఎస్సార్ చేయూత చివరి విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆదివారం సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జేసీ జాహ్నవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు సభా స్థలిని పరిశీలించారు. అనకాపల్లి మండలం పిసినికాడలో బహిరంగ సభ జరుగుతుంది. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన చేశారు.

నలుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నలుగురు ఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ఇవీ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయినస్థానం
మల్లికా గర్గ్	ఎస్పీ, తిరుపతి	ఎస్పీ, సీఐడీ
కృష్ణకాంత్ పాటిల్	డీసీపీ, విజయవాడ	ఎస్పీ, తిరుపతి
అధిరాజ్ సింగ్ రాణా	ఏపీఎస్పీ కమాండెంట్, విజయనగరం	డీసీపీ, విజయవాడ
గౌతమి శాలి	ఏపీఎస్పీ కమాండెంట్, విశాఖపట్నం	ఏపీఎస్పీ కమాండెంట్, విజయనగరం (అదనపు బాధ్యతలు)

ఆక్రమణలు నిరూపిస్తే... ప్రజలకే రాసిస్తా

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



క్రోసూరు: '400 ఎకరాలు కాదుకదా... ఎకరమైనా నా పేరు మీద గానీ, నా కుటుంబీకుల పేరగానీ ఉన్నట్లు నిరూపిస్తే ప్రజలకే పంచేస్తా' అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్పష్టం చేశారు. శనివారం గురజాలలో చంద్రబాబు.. ఎమ్మెల్యే శంకరరావు అటవీ భూములు ఆక్రమించారంటూ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆదివారం క్రోసూరులో శంకరరావు విలేకరులతో మాట్లాడారు. ఇసుక పాలసీ ప్రభుత్వానిదనీ, రూ.750 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోందని, దాంట్లో తన పాత్ర ఏముంటుందని నిలదీశారు. 2014 నుంచి 2019 వరకు ఇసుక దోచుకున్నదీ, ఇందుకోసం తీసిన గోతుల్లో 23మంది మృత్యువాత పడిందీ మీ పాలనలోనేనని ప్రజలు మరచిపోలేదని దుయ్యబట్టారు.

'పల్స్ పోలియో'ను ప్రారంభించిన గవర్నర్



పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ విజయవాడలోని రాజ్ భవన్‌లో ఆదివారం ప్రారంభించారు. సతీమణి సమీరా నజీర్‌తో కలసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా సున్నా నుంచి ఐదేళ్ల లోపు 53.35 లక్షల మంది పిల్లలకు పోలియో వ్యాక్సినేషన్ లక్ష్యం కాగా, తొలి రోజే 97.72 శాతం మందికి వ్యాక్సినేషన్ పూర్తయింది. సత్యసాయి, ఏలూరు జిల్లాల్లో 100 శాతం వ్యాక్సినేషన్ చేసినట్టు వైద్య శాఖ ప్రకటించింది. మిగిలిన పిల్లలకు టీకా వేయడం కోసం సోమ, మంగళ, బుధవారాల్లో మొబైల్ బృందాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తాయి.

సమష్టి కృషితోనే పోలియో రహిత సమాజం

గుంటూరులో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి రజిని



గుంటూరు మెడికల్: సమష్టి కృషి వల్లే మన దేశంలో పోలియో రహిత సమాజాన్ని స్థాపించుకోగలిగామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరు శ్రీనివాసరావుపేటలోని యూపీహెచ్‌సీలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి రజిని మాట్లాడుతూ 2008 తర్వాత మన రాష్ట్రంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదుకాలేదని, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం వల్లే ఈ ఘనత సాధించామని చెప్పారు. మిగిలిపోయిన చిన్నారులకు ఈ నెల 4, 5, 6 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని, ఇందుకోసం 74,930 బృందాలను నియమించినట్టు తెలిపారు. గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, స్టేట్ నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చల్లారని సర్దుబాటు మంటలు

- రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు నియోజకవర్గాల్లో తీవ్రస్థాయికి వర్గ విభేదాలు
- బల ప్రదర్శనకు దిగుతున్న జనసేన, టీడీపీ శ్రేణులు
- నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శేషారావుకు మద్దతుగా భారీగా వస్తున్న నేతలు
- రాజమహేంద్రవరం రూరల్‌లో గోరంట్ల, దుర్గేష్ వర్గాల ఆందోళనలు
- సీట్లపై తేల్చని బాబు, పవన్..
- మూకుమ్మడి రాజీనామాలు చేస్తామంటూ అల్టిమేటం





రాజమహేంద్రవరం రూరల్ సీటు దుర్గేష్‌కు కేటాయించాలంటూ జనసేన నేతల ర్యాలీ, నిడదవోలును బూరుగుపల్లికి కేటాయించాలని నినదిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ, జనసేన సీట్ల సర్దుబాటు మంటలు చల్లారడం లేదు. ఇరు పార్టీల అధినేతలు తీసుకున్న నిర్ణయాలు, వ్యవహార శైలి ఆయా పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. వెరసి వర్గ విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇరు పార్టీల నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి తలెత్తింది. సీట్లపై ఎటూ తేల్చకపోవడంతో ఇరు పార్టీల నేతలు వర్గాలుగా విడిపోయి బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. పార్టీ అధినాయకత్వంపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. తమ నేతకు సీటు కేటాయించని పక్షంలో మూకుమ్మడి రాజీనామాలకు దిగుతామని అల్టిమేటం ఇస్తున్నారు. నియోజకవర్గంలో ఎలా గెలుస్తారో చూస్తామంటూ శపథం చేస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిత్వం నిరాకరిస్తే తమ సత్తా ఏమిటో పార్టీల అధిష్టానాలకు చూపేందుకు సంసిద్ధమవుతున్నారు. ప్రజల్లో తమకున్న ఆదరణను చూపేందుకు కార్యకర్తలను భారీ స్థాయిలో సమీకరించుకుని మరీ బలప్రదర్శనలకు దిగుతున్నారు. కొవ్వొత్తుల ర్యాలీలు, మౌనపోరాటం వంటి కార్యక్రమాలతో వినూత్న నిరసనలకు నాంది పలకడం ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఎడతెగని ఉత్కంఠ

రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు ఉమ్మడి స్థానాలపై ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతోంది. సీటు తనదంటే తనదంటూ జనసేన, టీడీపీ నేతలు ప్రకటించుకుంటున్నారు. ఈ గందరగోళాన్ని చక్కదిద్దాల్సిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం ఇరు వర్గాల మధ్య విభేదాలకు మరింతగా ఆజ్యం పోస్తోంది.

నిడదవోలులో నిరసన గళం

నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు పట్టం కట్టకపోతే సహించేది లేదని టీడీపీ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. కచ్చితంగా తమ నేతకు కేటాయించాల్సిందేనన్న అల్టిమేటం జారీ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేకి మద్దతుగా ఉండ్రాజవరం మండలంలోని ఆయన స్వగ్రామం వేలివెన్నుకు పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు. శనివారం సైతం అధిక సంఖ్యలో కార్యకర్తలు ఆయన ఇంటి వద్దకు చేరుకుని శేషారావుకు మద్దతుగా నినాదాలు చేస్తూ బలప్రదర్శనకు దిగారు. ఆయనకు టికెట్ దక్కని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించుకుంటామని కుండ బద్దలుగొడుతున్నారు. జనసేన నేత కందుల దుర్గేష్ నిడదవోలు నుంచి పోటీ చేయాల్సిందిగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పినట్లు ప్రకటించుకోవడం పొత్తు ధర్మమా? అంటూ ప్రశ్నించారు. దుర్గేష్‌ను నిడదవోలుకు పంపితే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేస్తున్నారు. అదే జరిగితే ఇక్కడికి వచ్చి ఎలా గెలుస్తారో తామూ చూస్తామంటూ సవాల్ విసురుతున్నారు.

దుర్గేష్ దారెటు..?

రాజమహేంద్రవరం రూరల్ జనసేన నేత కందుల దుర్గేష్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, తనకే రూరల్ సీటు దక్కుతుందన్న ఆయన ఆశలకు రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి గండి కొట్టారు. బుచ్చయ్య ఒత్తిడికి తలొగ్గిన టీడీపీ, జనసేన అధిష్టానాలు దుర్గేష్‌ను నిడదవోలుకు సాగనంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. దుర్గేష్‌ను మంగళగిరి పిలిపించి మరీ హితబోధ చేశాయి. ఈ పరిణామం ఇటు రాజమహేంద్రవరం రూరల్ జనసేన, అటు నిడదవోలు టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు నింపాయి. ఇద్దరు నేతల మధ్య వైషమ్యాలకు ఆజ్యం పోశాయి. ఈ పరిస్థితుల్లో దుర్గేష్ ఎటు వెళ్లాలో తెలియక తికమకపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దుర్గేష్‌కు స్థానచలనంపై జనసేన నేతలు ఆందోళన చెందుతున్నారు. రూరల్‌లో బుచ్చయ్యకు సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు.

దుర్గేష్‌కు మద్దతుగా ఆందోళన

దుర్గేష్‌ను నిడదవోలుకు పంపాలని జనసేన అధినేత పవన్ తీసుకున్న నిర్ణయంపై జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ ఇచ్చిన మాటను సైతం కట్టుబడి ఉండలేరా అని ప్రశ్నిస్తున్నారు. దుర్గేష్‌కు రూరల్ కేటాయించాలని కోరుతూ కడియం నుంచి రాజమహేంద్రవరం నగరంలోకి కోటిపల్లి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన బలోపేతానికి దుర్గేష్ చేసిన కృషిని కూడా గుర్తించలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో అధిష్టానం ఉందా అని మండిపడ్డారు. దుర్గేష్‌కు సీటు కేటాయించకపోతే బుచ్చయ్యకు సహకరించేది లేదని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరులో దుర్గేష్‌కు మద్దతుగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

ప్రకటించే వరకూ చూస్తానంటున్న గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ సీటు తనకేనని సీనియర్ టీడీపీ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై ఇరు పార్టీల అధ్యక్షులూ ప్రకటించేంత వరకూ వేచి చూస్తానని అంటున్నారు.

క్లుప్తంగా...

సత్యప్రభకు టికెట్ ఇవ్వొద్దు



ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఏలేశ్వరం: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభకు అసెంబ్లీ టికెట్ ఇవ్వొద్దంటూ ఏలేశ్వరం పట్టణంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆందోళన చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యాన ఏలేశ్వరం మెయిన్ రోడ్డుపై 'చంద్రబాబు ముద్దు.. సత్యప్రభ వద్దు' అని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ పార్టీలో కొన్నేళ్లుగా కష్టపడి పని చేసిన వారిని కాదని, కొత్తగా వచ్చిన వారిని అందలమెక్కించడం దారుణమని అన్నారు. గతంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజాపై అక్రమ కేసులు బనాయించిన వారిని అక్కున చేర్చుకుని..ఆయన కోసం కష్టపడిన తమను దూరంగా పెట్టడం సత్యప్రభకు తగదని పేర్కొన్నారు. ఆమెకు తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా కన్వీనర్ ఏపూరి శ్రీను, పట్టణ అధ్యక్షుడు సతివాడ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పొత్తు వన్ మైనస్ వన్ జీరో

మంత్రి ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ (మర్రిపూడి): టీడీపీ, జనసేన పొత్తు వన్ ప్లస్ వన్ కాదు వన్ మైనస్ వన్ జీరో అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎద్దేవా చేశారు. సింగరాయకొండ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా పార్టీ పెడితే అధికారంలోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటారని, కానీ పవన్ లాగా చంద్రబాబు అధికారంలోకి రావటం కోసం పార్టీ పెట్టరని విమర్శించారు. 2014లో పార్టీ పెట్టిన పవన్‌కళ్యాణ్ తన ప్రస్థానంలో ఇప్పటికి 24 సీట్లలో పోటీ చేయటానికి ధైర్యం చేస్తున్నాడని, కానీ తాను ఎక్కడ పోటీ చేస్తున్నాడో ఇంతవరకు నిర్ణయం కాలేదని.. అతనికి ఏ సీటో చెప్పటానికి కూడా ధైర్యం లేదని అపహాస్యం చేశారు. పవన్‌కళ్యాణ్ కనుక ఎక్కడ పోటీ చేస్తాడో ప్రకటిస్తే సీఎం జగన్ అతనిపై బలమైన అభ్యర్థిని పెట్టి ఓడిస్తాడన్న భయంతో చెప్పలేక పోతున్నాడన్నారు. కానీ జనసేన పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేసినా చట్టసభల్లో అడుగుపెట్టే తలరాత వారికి లేదని జనసేన సైనికులు తెలుసుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన పొత్తును ఒప్పుకోవటం లేదని వీరి పొత్తు అస్తమించే సూర్యుడు తప్ప ఉదయించే సూర్యుడు కాదన్నారు. ఈ పొత్తు వలన సామాజిక వర్గం ఓట్లు బదిలీ అవుతాయనేది కేవలం వారి భ్రమేనన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసైనికులు



జనసేన నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జనసేనకు షాక్ తగిలింది. ఆ పార్టీకి కీలకంగా ఉన్న గునుపూడికి సంబంధించిన పలు వార్డులతో పాటుగా ఇతర వార్డుల నుంచి కూడా జనసేన కార్యకర్తలు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రంధి మాట్లాడుతూ.. భీమవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అండర్ టన్నెల్స్‌ను నిర్మించినట్లు చెప్పారు. పార్టీలో చేరినవారిలో అప్పన కొండలరావు, వాసన శ్రీనివాసరావు, మంచెం త్రిమూర్తులు, మద్దాల సత్యనారాయణ, పిండి ప్రసాద్, మద్దాల శ్రీనివాస్, కాశి సత్యనారాయణ, పాలూరి ఏడుకొండలు, మద్దాల ఏసు నాయుడు, భీమాల కృపావరం, భీమాల గోపాలకృష్ణమూర్తి, బాలం చిట్టిబాబు, చింతా లక్ష్మణరావు, నేదూరి సతీష్ తదితరులున్నారు. పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, కర్రెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం'కాని సైకిల్



ముందుకు కదలక మొండికేసే.. తెలుగుదేశంలో గందరగోళం

- సీట్లు తేలవు.. జనం పట్టించుకోరు
- రెండో జాబితాపై నోరు మెదపని చంద్రబాబు
- బీజేపీతో పొత్తు కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూపులు
- మరోవైపు బాబు సభలకు స్పందన కరువు
- 'రా కదలిరా' సభలన్నీ ఫ్లాప్
- జనసేన– టీడీపీ ఉమ్మడి అ'జెండా' ఫెయిల్
- ఏం చేయాలో పాలుపోక దుష్ప్రచారాన్నే నమ్ముకున్న బాబు

సాక్షి, అమరావతి: ఒకవైపు 'సిద్ధం' పేరుతో వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం జగన్ ఎన్నికల శంఖారావాన్ని పూరించి మొదటి దశను దిగ్విజయంగా పూర్తి చేసే దశలో ఉంటే టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం ఇంకా ఆ ఘట్టాన్ని ప్రారంభించలేక సతమతమవుతున్నారు. సీట్ల ఖరారు నుంచి, ఎన్నికల సన్నాహక సభల వరకు ఏ విషయంలోనూ ఆయన అధికార పార్టీకి కనీస పోటీ ఇవ్వలేక చతికిలపడుతున్నారు. వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేననే భయంతో ఇంకా పొత్తుల కోసం పాకులాడుతుండడం ఆయన బేలతనాన్ని స్పష్టం చేస్తోంది. ఎవరు ఏ స్థానాల్లో పోటీ చేస్తారో తెలియక, అసలు పోటీ చేసే స్థానాలు ఏవో అర్థంకాక టీడీపీ నేతలు క్షేత్ర స్థాయిలో తీవ్ర నిరుత్సాహంలో మునిగిపోయారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నా ఇంకా ఎన్నికలకు సిద్ధం కాలేకపోవడం కచ్చితంగా వెనుకబాటేనని, వైఫల్యానికి ఇది నాంది అని ఆ పార్టీ సీనియర్ నేతలు ఆందోళన చెందుతున్నారు.

అభ్యర్థులు దొరక్క సతమతం

అభ్యర్థుల ఎంపిక కోసం తాను ఇంతగా ఎప్పుడూ కష్టపడలేదని చంద్రబాబు చెబుతున్న విషయం తెలిసిందే. అభ్యర్థులు దొరక్క ఇతర పార్టీల నేతలు, ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తల వైపు ఆశగా చూస్తుండడం టీడీపీ దీన స్థితిని తెలియజేస్తోంది. వైఎస్సార్‌సీపీ వరుసగా అభ్యర్థుల జాబితాలు ప్రకటిస్తున్నా టీడీపీ అభ్యర్థుల జాబితాలపై చర్చ కూడా లేక క్యాడర్ నీరుగారిపోవడంతో అప్పటికప్పుడు జనసేనతో కలిసి తొలి జాబితా చంద్రబాబు విడుదల చేశారు. దానిపైనా తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమవుతుండడంతో టీడీపీ మరింత ఇరకాటంలో పడింది. పొత్తులో భాగంగా కొన్ని సీట్లు వదులుకోవడాన్ని టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక రోడ్డెక్కి రచ్చ చేస్తున్నారు. ఈ కారణంతోపాటు క్షేత్ర స్థాయిలో పట్టు కోల్పోవడంతో పలువురు సీనియర్లకు చంద్రబాబు మొండిచేయి చూపడంతో వారి నుంచి తిరుగుబాటు స్వరం వినిపిస్తోంది. దీంతో చంద్రబాబు వారిని బుజ్జగించలేక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన అభ్యర్థులను ఖరారు చేయడం చంద్రబాబుకు కత్తి మీద సాములా మారింది. బీజేపీతో పొత్తు కోసం ఎదురుచూస్తుండడం, ఆ పార్టీ ఏ విషయాన్ని ఇంకా తేల్చకపోవడంతో టీడీపీలో అసహనం రోజురోజుకీ పెరిగిపోతోంది. ఆ పొత్తు కోసం కీలకమైన ఎంపీ స్థానాలు, పలు ఎమ్మెల్సీ స్థానాలకు చంద్రబాబు అభ్యర్థులను ఖరారు చేయలేదు. ముక్కీమూలిగి ఎలాగోలా కొందరు ధనబలం ఉన్న అభ్యర్థులను పట్టుకున్నా బీజేపీతో పొత్తు తేలకపోవడంతో ఏ విషయాన్ని తేల్చలేకపోతున్నారు. దీంతో నియోజకవర్గాల్లో టీడీపీ కేడర్ ఆందోళనలో మునిగిపోయింది. ఎన్నికలు సమీపిస్తున్నా ఇంకా పొత్తులు కొలిక్కి రాకపోవడం, అభ్యర్థులను ఖరారు చేయలేకపోవడం ఆ పార్టీని దెబ్బతీస్తోంది.

సభలు విఫలంతో విలవిల

మరోవైపు 'రా కదలిరా' పేరుతో చంద్రబాబు నిర్వహించిన సభల వైఫల్యం టీడీపీ వాస్తవ బలాన్ని తేటతెల్లం చేసింది. ప్రతి పార్లమెంటు పరిధిలోనూ ఒక సభ నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించినా దాన్ని అమలు చేయడానికి అష్ట కష్టాలు పడుతున్నామని టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సభకూ జనం ఆశించిన స్థాయిలో రాకపోవడంతో చంద్రబాబు అక్కడి నేతలపై రుసరుసలాడడం తప్ప ఏమీ చేయలేక పోతున్నారు. 20కిపైగా నిర్వహించిన సభల్లో చంద్రబాబుకు ఖాళీ కుర్చీలే స్వాగతం పలికాయి. కేవలం టీడీపీ మాత్రమే సభ పెడితే జనం రావడంలేదని జనసేనతో కలిసి ఇటీవల తాడేపల్లిగూడెంలో 'తెలుగు జన కేతన జెండా' పేరుతో ఉమ్మడి సభ నిర్వహించారు. కానీ ఆ సభనూ జనం పట్టించుకోలేదు. చంద్రబాబు తనయుడు లోకేశ్ 'శంఖారావం' పేరుతో నిర్వహించిన యాత్ర టీడీపీ గాలిని పూర్తిగా తీసివేసింది. వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలు ఒకదాన్ని మించి ఒకటి సూపర్ హిట్ అవుతున్నా టీడీపీ, జనసేన సభలు విఫలమవడం క్షేత్ర స్థాయిలో టీడీపీ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. వీటన్నింటి కంటే ముందు భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో చంద్రబాబు ప్రకటించిన ముందస్తు మేనిఫెస్టోనూ జనం పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాల పేర్లనే మార్చి టీడీపీ మేనిఫెస్టోలో పెట్టి అభాసుపాలయ్యారు. ఈ పరిస్థితుల్లోనూ జనం నమ్మడం లేదని అర్థమై బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని అయినా రేసులో నిలబడి పోటీ ఇవ్వవచ్చనే ఉద్దేశంతో చేస్తున్న యత్నాలు ఫలితాన్ని ఇవ్వడంలేదు. వరుస వైఫల్యాలతో ఎన్నికలకు సిద్ధంగా లేని చంద్రబాబు దుష్ప్రచారాన్ని మాత్రమే నమ్ముకున్నారు. ఎల్లో మీడియా, సోషల్ మీడియా అండతో వైఎస్ జగన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో అబద్ధాలు, విష ప్రచారాలకు దిగారు. తాను అధికారంలో లేకపోవడం వల్ల ఆంధ్ర రాష్ట్రం నాశమైనపోయిందనే రీతిలో తన మేనేజ్‌మెంట్ నైపుణ్యంతో ప్రచారం చేస్తున్నా జనానికి మాత్రం వాస్తవం కళ్లెదుటే కనిపిస్తోంది. అందుకే చంద్రబాబు ఇంకా ఎన్నికలకు సిద్ధం కాలేక తన పాతకాలపు వ్యూహాలను నూరుతూనే ఉన్నారు.

జనం 'నిన్ను నమ్మం బాబూ' అంటున్నారు: మంత్రి పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కదిరి: చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని, అందుకే ప్రజలంతా ఇప్పుడు 'నిన్ను నమ్మం బాబూ' అని అంటున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఆదివారం జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా... ఆయనకు చెప్పుకోవడానికి ఒక్క పథకమూ లేదన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా పచ్చ చొక్కాలకు మాత్రమే గతంలో పథకాలు అందాయన్నారు. నేడు అర్హత ఉంటే చాలు వలంటీర్ చేతికి దరఖాస్తు అందజేసినా, లేదంటే నేరుగా సచివాలయానికి వెళ్లి చెప్పినా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. తన ద్వారా లబ్ధి పొందినట్లయితేనే తన పార్టీకి ఓటు వేయండని సీఎం జగన్ ధైర్యంగా చెబుతున్నారన్నారు. సొంత పార్టీ వారికి దోచిపెట్టిన నాయకుడు చంద్రబాబు అయితే.. ప్రజల సంక్షేమానికి నిధులు ఖర్చు చేసిన సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని, చంద్రబాబు వస్తే ఇవన్నీ రద్దు చేస్తారన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసగించారని గుర్తుచేశారు. అదే జగన్ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా డ్వాక్రా సంఘాలను ఆదుకుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంత, కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ సుభాష్ మాకొద్దు

- రామచంద్రపురం టీడీపీ సమావేశం రసాభాస
- డబ్బు సంచులతో వస్తే టికెట్ ఇస్తారా అంటూ కార్యకర్తల ఆగ్రహం
- ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యాన్ని నిలదీసిన వైనం
- సమావేశానికి డుమ్మా కొట్టిన పార్టీ పరిశీలకుడు సుజయకృష్ణ రంగారావు
- అధిష్టానం తీరుకు నిరసనగా కార్యకర్త ఆత్మహత్యాయత్నం



కుర్చీలను తగులబెడుతున్న టీడీపీ నేతలు

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన టికెట్‌ల వ్యవహారం చిచ్చు రేపింది. టీడీపీ నుంచి అమలాపురానికి చెందిన వాసంశెట్టి సుభాష్ తనకే టికెట్ కేటాయించిందంటూ నియోజకవర్గంలో తిరుగుతున్న వైనం గొడవకు దారితీసింది. టీడీపీ అధిష్టానం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఓ కార్యకర్త కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ప్రచారంపై జనసేన కార్యకర్తలు సైతం ఫైర్ అవుతున్నారు. రామచంద్రపురం బైపాస్ రోడ్డులోని టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఆదివారం టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ పరిశీలకుడు సుజయకృష్ణ రంగారావు హాజరు కావాల్సి ఉండగా గొడవ జరిగే అవకాశం ఉందని తెలుసుకున్న ఆయన డుమ్మా కొట్టారు. ఈ సమావేశంలో రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతుండగా అమలాపురం నుంచి వాసంశెట్టి సుభాష్ తనకే టీడీపీ టికెట్ ఇచ్చారని నియోజకవర్గంలో తిరుగుతున్నారని దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయనను నిలదీశారు. దళిత ద్రోహి, రౌడీషీటర్ సుభాష్ మాకొద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో వనుం చంటి అనే కార్యకర్త రెడ్డి సుబ్రహ్మణ్యానికి టికెట్ కేటాయించాలని కోరుతూ కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొనేందుకు యత్నించాడు. కార్యకర్తలు అతడిని వారించారు. అప్పుడే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తన అనుచరులతో అక్కడకు చేరుకుని నియోజకవర్గానికి సంబంధం లేని సుభాష్ తిరుగుతుంటుంటే పార్టీ ఇన్‌చార్జిగా మీరేం చేస్తున్నారంటూ సుబ్రహ్మణ్యాన్ని నిలదీశారు. ఈ సందర్భంగా ఇరుపార్టీ నాయకులకు మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. సుభాష్ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని సుబ్రహ్మణ్యం బదులిచ్చారు. పొత్తు ధర్మం పాటించాలని చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన పోలిశెట్టి చంద్రశేఖర్‌కు జనసేన టికెట్ ఇస్తే తాను మనస్ఫూర్తిగా పని చేస్తానని సుబ్రహ్మణ్యం వివరించారు. టికెట్ విషయమై తనకు గాని, తన భార్యకు గానీ ఇంత వరకూ అధిష్టానం నుంచి ఎటువంటి స్పష్టత రాలేదని చెప్పారు. చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం మాట్లాడుతుండగానే జనసేన, టీడీపీ కార్యకర్తలు అక్కడ ఉన్న ఫర్నిచర్‌ను తగులబెట్టారు. సుభాష్‌కు టికెట్ ఇస్తే ఆయనను నియోజకవర్గంలో తిరగనిచ్చేది లేదని తెగేసి చెప్పారు.

పవన్ కళ్యాణ్ పోటీ ఎక్కడో..!



- ఎన్నికలు దగ్గర పడుతున్నా ఇంకా అస్పష్టతే
- తన సీటుకూ టీడీపీపైనే ఆధారం
- భీమవరం, గాజువాక అభ్యర్థుల ప్రకటనా పెండింగ్‌లోనే..
- ఉమ్మడి విశాఖ నుంచి పవన్‌ను పోటీచేయించే యోచన

సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేసేది ఇంకా తేలలేదు. మరో 40–45 రోజుల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నా, ఈ విషయంలో జనసేన పార్టీ గానీ పవన్‌కళ్యాణ్ గానీ ఇంకా పూర్తి స్పష్టతకు రాలేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ ఒక్క చోటా పవన్‌కళ్యాణ్ పోటీకి సంబంధించి చర్చ జరుగుతున్న దాఖలాలు లేవంటున్నారు. పరిస్థితులు చూస్తుంటే... తాను పోటీ చేసే స్థానంపై కూడా చంద్రబాబుపై ఆధారపడినట్టు ఉన్నారని సొంత పార్టీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అంతర్గతంగా సర్వేలు చేయించుకుని, కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయన్న అంచనాతో గాజువాక, భీమవరం స్థానాలను పవన్‌కళ్యాణ్ ఆఖరి నిముషంలో ఎంపిక చేసుకున్నారు. వామపక్షాలు, బీఎస్పీ మద్దతు ఇచ్చాయి. అయితే రెండు చోట్లా పవన్‌కళ్యాణ్ ఓడిపోయారు. గాజువాకలో మొత్తం 1,99,314 ఓట్లు పోలవగా, పవన్‌కళ్యాణ్ కేవలం 58,539 ఓట్లు (29.37 శాతం) మాత్రమే తెచ్చుకోగలిగారు. భీమవరంలో 1,92,558 ఓటు పోలవగా, 62,285 ఓట్లు (28 శాతం) మాత్రమే పడ్డాయి. గాజువాకలో 17 వేలు, భీమవరంలో 8 వేల ఓట్లకు పైగా తేడాతో ఆయన ఓడిపోయారు. ఈ నేపథ్యంలో తాను ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొనే అవకాశం లేకపోయినా కచ్చితంగా గెలిచే సీటు అయి ఉండాలని భావిస్తున్నారు. గాజువాక, భీమవరం, పిఠాపురం స్థానాలు పరిశీస్తున్నట్లు సమాచారం.

చంద్రబాబు లెక్కలు వేరు

అయితే పవన్ సీటు విషయంలో చంద్రబాబు లెక్కలు వేరుగా ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. పవన్ కళ్యాణ్ పోటీచేసే నియోజకవర్గం పరిధిలోని లోక్‌సభ స్థానంలో టీడీపీకి ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుందన్న ఆలోచనలతో ఉన్నట్టు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్‌కు కేటాయించే స్థానం, ఆ చుట్టుపక్కల టీడీపీ బలహీనంగా ఉండే స్థానాలను చంద్రబాబు బేరీజు వేస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏదో ఒక స్థానం నుంచి పవన్‌కళ్యాణ్‌ను పోటీ చేయించాలని చూస్తున్నారని, అలా జరిగే పక్షంలో గాజువాక నుంచే మరోసారి పోటీ పడే అవకాశం ఉందంటున్నారు. 15 రోజుల క్రితం భీమవరం పర్యటనలో పవన్ టీడీపీ, బీజేపీ నాయకుల ఇళ్లకు స్వయంగా వెళ్లారు. దీంతో ఈసారీ భీమవరం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని జనసేనలో అంతర్గత చర్చ సాగింది. అయితే, సీట్ల సర్దుబాటులో భాగంగా భీమవరం నుంచి పోటీ చేయని పక్షంలో తనకు అవకాశం ఇవ్వాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు చంద్రబాబును హైదరాబాద్ వెళ్లి మరీ కోరడంతో పవన్ కళ్యాణ్ భీమవరం పోటీపై అనుమానాలు మొదలయ్యాయి. ఆ తర్వాత పిఠాపురం నుంచి పోటీ చేస్తారని కొంత ప్రచారం కొనసాగినా స్పష్టత లేదు. మరోవైపు జనసేనకు కేటాయించిన 24 అసెంబ్లీ స్థానాల్లో ఐదింటిలో మాత్రమే అభ్యర్థులను పవన్ కళ్యాణ్ ప్రకటించారు. పార్టీ అధినేతే ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలియని సందిగ్ధంలో ఉన్నప్పుడు తమ గురించి ఆలోచించే వారెవ్వరని జనసేన ఆశావహులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.

నారావారి కొత్త డ్రామా ధర్మయుద్ధం

ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజం



రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈ ఎన్నికల్లో ప్రజలను వంచించేందుకు ధర్మయుద్ధం పేరుతో కొత్త డ్రామాకు తెర తీశారని, దీనిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్‌సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు బీజేపీతో విభేదించి, ప్రధాని మోదీని అనరాని మాటలు, వ్యక్తిగత దూషణలు చేసిన చంద్రబాబు..నేడు బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకునేందుకు కూడా సిద్ధపడుతున్నారని విమర్శించారు. అమిత్ షా తిరుపతి వచ్చినప్పుడు టీడీపీ కార్యకర్తలు, దుండగులతో చెప్పులు వేయించిన ఘనుడు చంద్రబాబు అని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ధర్మ పోరాట దీక్ష ఎవరి కోసం చేశారో... ఇప్పుడు ధర్మయుద్ధం ఎవరితో చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. గత టీడీపీ పాలనలో రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి వంచించారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తానని, ఉద్యోగం వచ్చే వరకూ నిరుద్యోగ భృతి ఇస్తానని ఆశలు కల్పించి.. తీరా అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా మోసం చేశారని గుర్తు చేశారు.

సంక్షేమ సారథి జగన్...

పేదలు, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం పరితపించే జననేత సీఎం జగన్ అని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత పాలించిన సీఎంలది ఒక తీరైతే...జగన్ పాలన ఒక తీరని చెప్పారు. రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ఈ ఐదేళ్లలో రూ.3 లక్షల కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి చరిత్ర సృష్టించారన్నారు. ప్రతి పనికీ కమీషన్లు బొక్కే లోకల్ టీడీపీ నేతలు.. తాను ప్రతి పనిలో 25 శాతం కమీషన్లు తీసుకుంటున్నానంటూ ఇష్టం వచ్చినట్లు నిందారోపణలు చేస్తున్నారని, వీటిని సాక్ష్యాధారాలతో నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబ అవినీతి, అక్రమ బాగోతాలు అందరికీ తెలిసినవేనని అన్నారు. తాను ఎంపీగా రెండున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని.. ఆదిరెడ్డి కుటుంబంలో మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు అనుభవించిన 16 ఏళ్ల కాలంలో ఏం చేశారో చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎంపీ భరత్‌రామ్ హెచ్చరించారు.

నీ పాలన గురించి చెప్పి ఓట్లడిగే దమ్ముందా?

- చంద్రబాబు పగటికలలు కంటున్నారు
- జనసేన కార్యకర్తలను పవన్ నిలువునా ముంచేశారు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజం



రేణిగుంట(తిరుపతి జిల్లా): 'మీ ఇంటికి నేను మంచి చేశాను.. నన్ను ఆశీర్వదించండి. లేకుంటే నాకు ఓటేయొద్దు అని చెప్పగలిగే దమ్ముందా?' అని చంద్రబాబును డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రశ్నించారు. చంద్రబాబు అధికారం గురించి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేశారని వివరించారు. చంద్రబాబు ఎప్పుడైనా ఎస్సీ, ఎస్టీ, బీసీలను రాజ్యసభకు పంపించారా? అని ప్రశ్నించారు. గొల్ల బాబూరావు అనే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని, నలుగురు బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందన్నారు. ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా? అంటూ చంద్రబాబు హేళన చేశారని మండిపడ్డారు. 2019లో పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయిన పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. జనసేన కార్యకర్తలను నిలువునా ముంచేశారని విమర్శించారు. 24 సీట్లను కూడా చంద్రబాబు చెప్పిన వారికే ఇచ్చే దుస్థితిలో పవన్ ఉన్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ చేతిలో చంద్రబాబు, పవన్‌కు మళ్లీ ఘోర పరాభవం తప్పదన్నారు.

ఎల్లప్పుడూ జగన్ వెంటే..

డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ.. 'గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ టికెట్‌ను నా కుమార్తెకు ఇస్తే చంద్రబాబుకు వచ్చిన నష్టమేంటి? నేనే సంతోషంగా నా కుమార్తెకు టికెట్ ఇవ్వాలని సీఎం జగన్‌ను అడిగాను. నా సేవలను పార్టీ మరో రకంగా వినియోగించుకుంటుంది. నేను ఎప్పుడూ వైఎస్ కుటుంబాన్ని వదలను. దళితుడినైన నన్ను గుర్తించి డిప్యూటీ సీఎం పదవి వరకు తీసుకెళ్లిన సీఎం జగన్ మేలును ఎప్పటికీ మరువను. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లను అమ్ముకునే సంస్కృతి చంద్రబాబుది' అని విమర్శించారు.

ఇద్దరు బలహీనులు కలిస్తే.. బలహీనులే అవుతారు: కాకాణి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఇద్దరు బలహీనులు కలిస్తే బలహీనులే అవుతారని, జీరోలైన మిమ్మల్ని కూడినా..గుణించినా వచ్చేది జీరోనే అని టీడీపీ నేతలనుద్దేశించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రసంగమంతా ఆత్మస్తుతేనని, ఫ్రస్టేషన్ కనిపిస్తోందన్నారు. నేతల చేరికలతో టీడీపీ బలపడిందని ఆయన భావిస్తున్నారని, పోటీ చేయడానికి అభ్యర్థులు దొరికినంత మాత్రాన ప్రజల మద్దతు లభించిందని చెప్పుకోవడం పెద్ద పొరపాటన్నారు. సీఎం జగన్ ప్రజలకు ఏం మేలు చేశారో స్పష్టంగా చెబుతున్నారని, అలాంటి ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో, పొరుగు రాష్ట్రాల మేనిఫెస్టో చంద్రబాబు కాపీ కొడుతున్నారే తప్ప సొంతంగా తాము ఇది చేస్తామని చెప్పలేకపోతున్నారని, అందుకే చంద్రబాబు మోసగాడు అని బ్రాండ్ పడిపోయిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ బలమైన పార్టీ అని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10కి 10 స్థానాలు తమ పార్టీనే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రతిపాదిత అభ్యర్థుల జాబితా ఢిల్లీకి..

- ఈ రెండ్రోజుల సమావేశాల్లో పొత్తులపై ఎలాంటి చర్చ జరగలేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ తరపున పోటీచేసే ప్రతిపాదిత అభ్యర్థుల జాబితాలను శని, ఆదివారం జరిగిన సమావేశాల్లో సిద్ధంచేశామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. జాతీయ పార్టీ సహ సంఘటనా కార్యదర్శి శివ ప్రకాష్ జిల్లాల వారీగా ఆయా జిల్లాల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, ఇతర ముఖ్యనేతలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. శనివారం 14 లోక్‌సభ స్థానాల పరిధిలో జిల్లా నాయకుల సమావేశాలు జరగ్గా.. ఆదివారం మిగిలిన 11 లోక్‌సభ స్థానాల సమావేశాలు జరిగాయి. అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ 175 అసెంబ్లీ, 25 లోకసభ స్థానాలకు సంబంధించి ఆయా జిల్లాల నేతల నుంచి అభిప్రాయాలు సేకరించాం. నియోజకవర్గాల వారీగా సామాజిక, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయి.. అభ్యర్థులు ఎవరైతే బాగుంటుందన్న వివరాలు అడిగి తెలుసుకున్నాం. ఈ జాబితాలను జాతీయ నాయకత్వానికి పంపుతాం. రాష్ట్రవ్యాప్తంగా 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసేందుకు రెండు వేలమందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండ్రోజుల సమావేశాల్లో అభ్యర్థులపై ఒక నిర్ణయానికి వచ్చాం. నిబంధనల ప్రకారం.. మేం ఇచ్చే జాబితాపై పార్టీ పార్లమెంటరీ బోర్డులో చర్చ జరుగుతుంది. అప్పుడు కేంద్ర పార్టీ రాష్ట్ర నాయకులను పిలిచి అభ్యర్థుల తుది ఎంపికపై చర్చిస్తుంది.

పొత్తుపై చర్చ జరగలేదు..

ఈ సమావేశాల్లో పొతుల గుర్తించి ఎలాంటి చర్చ జరగలేదు. కేవలం అభ్యర్థుల ఎంపికకు సంబంధించే జిల్లా నేతల అభిప్రాయాలు తీసుకున్నాం. పొత్తులపై జాతీయ నాయకత్వమే నిర్ణయం తీసుకుంటుంది. ఒకవేళ జాతీయ పార్టీ పొత్తులపై నిర్ణయం తీసుకునే పక్షంలో ఆ నిర్ణయాలకు అనుకూలంగా మేం మరోసారి సమీక్ష చేసుకుంటాం అని అన్నారు.

జగన్ వంటి దమ్మున్న నాయకుణ్ణి ఎన్నుకోండి

- 'నా కమ్మ.. నా కులం' అనుకునే చంద్రబాబులాంటి దరిద్రం మనకొద్దు
- మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ



నాటికల పోటీలో జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ

పాలకొల్లు (సెంట్రల్): కుల మతాలకు అతీతంగా ఉండే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడిని ఎన్నుకోవాలని మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబులా 'నా కమ్మ.. నా కులం' అనే దరిద్రం మనకొద్దని, అటువంటి నాయకులు అవసరం లేదని స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో కళాపరిషత్ ఆధ్వర్యంలో 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన అల్లు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ.. తనకు కులం పేరు చెబితే కోపం వస్తుందని.. అన్ని కులాల వారూ ఓట్లేస్తేనే తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. అందుకే కుల మతాలు చూసి ఓటు వేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అప్పాబావా నాయకులను కాకుండా దమ్మున్న నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. పాలకొల్లు మునిసిపాలిటీలో చాలా దోపిడీ జరుగుతోందని, పారిశుధ్య వాహనాలకు వేసే ఆయిల్‌ను సైతం అమ్ముకుంటున్నారని ఆరోపించారు.



లోతుగా ఆలోచించే ప్రతి ఒక్క ఆలోచనాపరుడు
తనను అర్థం చేసుకోవడం కంటే కూడా,
అపార్థం చేసుకోవడం గురించి ఎక్కువ భయపడతాడు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 4 మార్చి 2024

పుస్తక హననం

నేను గనక కాలంలో వెనక్కి వెళ్లగలిగితే, అలెగ్జాండ్రియా లైబ్రరీని దర్శిస్తానంటాడు ఖగోళ శాస్త్రవేత్త కార్ల్ సాగన్. ఈజిప్టులోని అలెగ్జాండ్రియా లైబ్రరీకి ప్రపంచంలోనే అత్యంత గొప్ప గ్రంథాలయం అని పేరు. వేలాది గ్రీకు, హీబ్రూ, మెసొపొటేమియన్ సాహిత్య స్క్రోల్స్, ప్రాచీన ఈజిప్టుకు చెందిన కళోపకరణాలు ఇక్కడ ఉండేవి. ఎరాటోస్తనీస్, ఆర్కిమెడీస్, యూక్లిడ్ వంటి గ్రీకు శాస్త్రజ్ఞులు దీన్ని సందర్శించారు. రెండు వేల ఏళ్ల కిందట ఇది వైభవోపేతంగా వర్ధిల్లిందనీ, దీన్ని క్రీ.పూ. 48–47 ప్రాంతంలో సీజర్ తగలబెట్టేశాడనీ చెబుతుంటారు. అయితే, తగలబడిందని నిర్ధారించడానికి చారిత్రక ఆధారాలు లేవనీ, మానవ జాతి పోగేసుకున్న సమస్త వివేకసారం మట్టి పాలైందని అనుకోవడంలో ఉన్న ఉద్వేగంలోంచి ఈ కథ పుట్టివుంటుందనీ చెబుతాడు బ్రిటిష్ లైబ్రేరియన్, రచయిత రిచర్డ్ ఓవెండెన్. ఇప్పటి 'పుస్తకం' ఉనికిలో లేని ఆ కాలంలో నునుపు చేసిన చెట్ల బెరడుల రోల్స్ కాలక్రమంలో నశించడమే ఈ కథగా మారివుంటుందని మరో కథ. ఏమైనా, సమస్త విజ్ఞానం ఒక చోట రాశిగా పోగయ్యే గ్రంథాలయం అనే భావనను ఊహించడమే మానవ నాగరికత సాధించిన విజయం. ఆ గ్రంథాలయాలనే నేలమట్టం చేయడం ద్వారా శత్రువు మీద పైచేయి సాధించే ప్రయత్నం చేయడం... అదే నాగరిక మానవుడి అనాగరికతకు తార్కాణం.

ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం మొదలైనప్పటినుంచీ జరుగుతున్న ప్రాణనష్టం గురించి మీడియా మాట్లాడుతూనే ఉంది. కానీ గాజాలో కనీసం పదమూడు గ్రంథాలయాలకు ఇజ్రాయెల్ వల్ల నష్టం వాటిల్లింది. ఇందులో కొన్ని పూర్తిగా నాశనం కాగా, కొన్ని దారుణంగా దెబ్బతినడమో, అందులో ఉన్నవి దోచుకెళ్లడమో జరిగింది. నూటా యాభై ఏళ్ల గాజా చరిత్ర రికార్డులున్న సెంట్రల్ ఆర్కైవ్స్ ఆఫ్ గాజా, పాలస్తీనాలోని అరుదైన పుస్తకాల కలెక్షన్ కలిగివున్న గ్రేట్ ఒమారి మాస్క్, వేలాది పుస్తకాలకు నెలవైన దయానా తమారీ సబ్బాగ్ లైబ్రరీతో పాటు, గాజా యూనివర్సిటీ లైబ్రరీ, అల్–ఇస్రా యూనివర్సిటీ లైబ్రరీ కూడా దెబ్బతిన్నవాటిల్లో ఉన్నాయి. ''ఆర్కైవ్ మీద ఆధిపత్యం లేకపోతే రాజకీయ అధికారం లేదు'' అంటాడు ఫ్రెంచ్ విమర్శకుడు జాక్వెస్ డెరిడా. అందుకే గ్రంథాలయాలను దొంగదెబ్బ కొట్టడం అనేది చరిత్ర పొడవునా జరుగుతూనే ఉంది.

ప్రపంచానికే జ్ఞానకాంతిగా వెలుగొందింది భారత్‌లోని నలందా విశ్వవిద్యాలయం. 5వ శతాబ్దంలో గుప్తులకాలంలో ఇది నిర్మితమైంది. రత్నదధి, రత్నసాగర, రత్నరంజక పేరుతో మూడు తొమ్మిదంతస్థుల భవనాలుండేవి. ఖగోళం, జ్యోతిషం, గణితం, రాజకీయం, ఆయుర్వేదం, వైద్యం, కళలు, సాహిత్యం, వ్యాకరణం, తర్కం సంబంధిత అంశాలన్నింటికీ నెలవు ఇది. జైన తీర్థంకరుడు మహావీరుడు 14 వర్షాకాలాలు ఇక్కడ గడిపాడట! క్రీ.శ.1193లో భక్తియార్ ఖిల్జీ దీన్ని తగలబెట్టించాడు. దేశంలో బౌద్ధ ప్రాభవం క్షీణించడానికి ఇదీ ఓ కారణమని చెబుతారు. ''గ్రంథాలయాల ద్వారా సమాజం తన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంది. కొన్నిసార్లు గ్రంథాలయాలను సాంస్కృతిక హనన పథకంలో భాగంగా ఉద్దేశపూర్వకంగా నాశనం చేశారు. ఎన్నో ప్రజా, ప్రైవేటు లైబ్రరీలు మూర్ఖ దురాక్రమణదారుల వల్ల నాశనం అయ్యాయి'' అంటారు పాత్రికేయుడు జానీ డైమండ్.

బీజింగ్‌లో ఎనిమిదో శతాబ్దంలో నెలకొల్పిన హాన్లిన్ లైబ్రరీ ఒక విజ్ఞాన భాండాగారం. ఇందులో ఒక ముఖ్యమైన సోర్సు మింగ్ వంశపు చక్రవర్తి ఝూ డీ 1403లో 'జాంగ్లే దాదియన్' పేరుతో సిద్ధం చేయించిన ఎన్‌సైక్లోపీడియా. వ్యవసాయం, నాటకం, భూగర్భశాస్త్రం, వైద్యం, కళ, చరిత్ర, సాహిత్యం లాంటి వాటితో కూడిన 22,000 విభాగాలు అందులో ఉన్నాయి. 1900వ సంవత్సరంలో మంటల్లో లైబ్రరీ తగలబడినప్పుడు ఆ ఎన్‌సైక్లోపీడియా కూడా మసైపోయింది. వలసవాదులు, తిరుగుబాటుదారుల రూపంలో ఉన్న బ్రిటిష్ వాళ్లు, చైనీయులు దీనికి కారణం మీరంటే మీరేనని పరస్పరం నిందించుకున్నారు.

అమెరికా జాతీయ గ్రంథాలయాన్ని 1814లో బ్రిటిష్‌వాళ్లు నాశనం చేశారు. అప్పటికి దాన్ని నెలకొల్పి నాలుగేళ్లే అయింది. సెనేటర్ల ఉపయోగార్థం 3000 వాల్యూములు అందులో ఉన్నాయి. అయినప్పటికీ ఆ దెబ్బ తమ జాతి ఆత్మను గాయపరిచిందంటాడు అమెరికా చరిత్రకారుడు రాబర్ట్ డార్న్‌టన్. అదే బ్రిటనీయులు 2003లో ఇరాక్ జాతీయ గ్రంథాలయాన్ని నాశనం చేశారు. పనామ్ పెన్హ్ నగరంలోని జాతీయ గ్రంథాలయాన్ని 1967లో సర్వనాశనం చేయడం ద్వారా కంబోడియా నాగరికత మొత్తాన్నీ 'ఖ్మేర్ రూజ్' తుడిచిపెట్టింది. దేశ చరిత్రను మళ్లీ 'ఇయర్ జీరో' నుంచి మొదలుపెట్టించాలన్న మూర్ఖత్వంలో భాగంగా కమ్యూనిస్టు నాయకుడు పోల్ పాట్ సైన్యం నరమేధానికీ, సాంస్కృతిక హననానికీ పాల్పడింది. సుమారు లక్ష పుస్తకాలున్న, అప్పటికి యాభై ఏళ్ల పాతదైన శ్రీలంకలోని జాఫ్నా పబ్లిక్ లైబ్రరీని 1981లో సింహళ మూక కూడా అలాగే తగలబెట్టింది.

ఒక గ్రంథాలయం ధ్వంసమైతే మనం ఏం కోల్పోయామో కూడా మనకు తెలియకపోవడం అతి పెద్ద విషాదం. ఒక గ్రంథాలయాన్ని నిర్మూలించడమంటే ఒక దేశ, ఒక జాతి సాంస్కృతిక వారసత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టడం; గతపు ఘనతను పూర్తిగా నేలమట్టం గావించడం; అన్నీ కోల్పోయినా మళ్లీ మొదలెట్టగలిగే శక్తియుక్తులను నిర్వీర్యం చేయడం; చెప్పాలంటే ఇంకేమీ లేకుండా చేయడం, సున్నా దగ్గరికి తెచ్చి నిలబెట్టడం! అయినా గోడలు కూలితేనే, పుస్తకాలు కాలితేనే గ్రంథాలయం నాశనం కావడమా? వాటిపట్ల నిర్లక్ష్యం వహించడం మాత్రం నెమ్మదిగా నాశనం చేయడం కాదా?

తీక్షణ భావాల మృదుభాషి

కామెంట్



కరణ్ థాపర్

''ప్రతిపక్షం అన్నది ప్రజల అసంతృప్తిని ప్రతిఫలించే దృష్టికేంద్రం. ప్రతిపక్షమే లేకుంటే ప్రజాస్వామ్యమే ఉండదు'' అని దృఢంగా నమ్మేవారు ఫాలీ శామ్ నారిమన్. ''ప్రస్తుత పరిస్థితులతో ఎప్పటికీ మనం ఒక కొత్త రాజ్యాంగాన్ని రూపొందించుకోలేం'' అని అనేవారు. ''దారికి ఒప్పించటం, కోరినది ఇవ్వటం, ఓరిమి వహించటం'' అనే ఔదార్యాలు లేకుండా అద్భుతమైన, వినూత్నమైన ఆలోచనలు మాత్రమే మనకొక ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని ఏనాటికీ అందించలేవు. పరిస్థితులను బట్టి చూస్తే భారతదేశంలో ప్రస్తుతం ఇవి మూడూ క్షీణించి ఉన్నాయి'' అన్నది ఆయన అభిప్రాయం. ''భారత పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల పరిరక్షణకు మన న్యాయమూర్తులు మరింత సుముఖంగా ఉండాలి'' అనేవారు.

ఆఫీసులో నా డెస్కుకు ఎదురుగా ఉన్న గోడకు ఫాలీ నారిమన్ ఫొటో వేలాడదీసి ఉంటుంది. అది ఆయన స్వాభావిక మృదుహాసాన్ని, మిలమిల మెరిసే కళ్లను పట్టివ్వదు కానీ, ఆయనలోని దృఢచిత్తాన్ని, ఒడుదొడుకులను తట్టుకోగలిగిన స్థితిస్థాపక గుణాన్ని మాత్రం ప్రతిఫలిస్తూ ఉంటుంది. కెమెరాలోకి గుచ్చి చూస్తూ, తన కుడి చేతితో కుర్చీ ఆన్పును దృఢంగా పట్టుకుని ఉన్న ఆయన తీరును గమనిస్తే... ఆయన – తనేమిటో తనకు తెలిసిన మనిషి అనీ, తనను తాను స్వీయ స్పృహ లేకుండా వ్యక్తపరచుకోగలరనీ మీరు పసిగట్టగలరు.

ఆ గోడపైన ఉన్నది – ఆయన చివరి పుస్తకం 'యు మస్ట్ నో యువర్ కాన్‌స్టిట్యూషన్' ఆవిష్కరణ సందర్భంగా ఆయనతో నా చివరి ఇంటర్వ్యూకు ముందరి ఇంటర్వ్యూలో తీసిన ఫొటో. ఆ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడిన చాలా విషయాలు మన దేశానికి ఒక సందేశం అనే నేను నమ్ముతున్నాను.

ప్రసిద్ధ బ్రిటిష్ న్యాయ–విద్యావేత్త ఐవర్ జెన్నింగ్స్‌ను అంగీకారంగా ఉటంకిస్తూ, నారిమన్ ఇలా అన్నారు: ''పార్లమెంటులో అత్యంత ముఖ్యమైన వ్యవస్థ ప్రతిపక్షమే అని అనడంలో అవాస్తవమేమీ లేదు. ప్రతిపక్షం అన్నది ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం. ప్రజల అసంతృప్తిని ప్రతిఫలించే దృష్టికేంద్రం. ప్రభుత్వం ఎంత ముఖ్యమైనదో, ప్రతిపక్షం పనితీరు కూడా దాదాపుగా అంతే ముఖ్యమైనది. ప్రతిపక్షమే లేకుంటే ప్రజాస్వామ్యమే ఉండదు.''

అలా అని ప్రభుత్వాన్ని మనం ఎలా ఒప్పించగలమని ఇంటర్వ్యూ మధ్యలో నేను అడిగినప్పుడు, ఆయన నవ్వి ఊరుకున్నారు. అది నేను చేయగలిగిందైతే కాదు అన్నారు. ఏమైతేనేం, ఆయనే ఆ తర్వాత ''నాకొచ్చిన సందేహాన్నే మీరు వ్యక్తం చేయటం నాకెంతగానో సంతోషంగా ఉంది'' అన్నారు.

నారిమన్ మాట్లాడే ధోరణి సూటిగా, సందర్భశుద్ధితో ఉంటుంది తప్ప... ఎప్పుడూ కూడా బాధించేలా, అభ్యంతరకరంగా ఉండదు. కొన్నిసార్లు ఆయనే మిమ్మల్ని మెల్లగా నడిపిస్తున్నారని కూడా మీరు తెలుసుకోలేరు. ఉదాహరణకు, బహుశా మేము తొలిసారి కలుసుకోవటం రచయిత పత్వంత్ సింగ్ ఇంట్లోననుకుంటా... ఆయన నా భుజం చుట్టూ చేయి వేసి – మిగతావాళ్లంతా డైనింగ్ టేబుల్ దగ్గర్నుంచి డ్రాయింగ్ రూమ్‌కు కదులుతూ ఉండగా – నన్ను ఒక మూలకు తోడ్కొని వెళ్లారు. ''గుర్తుంచుకో! పత్వంత్ ఎప్పుడూ కూడా చివరి మాట తనదే కావాలని కోరుకుంటాడు. అలా ఉండేందుకు మీరు ఆయన్ని అనుమతిస్తే ఎప్పటికీ మీ స్నేహితుడిగా ఉంటాడు'' అన్నారు. బాగా గుర్తు... పత్వంత్‌ని నేను ప్రశ్న మీద ప్రశ్న అడుగుతూనే ఉన్నాను. సన్నటి గీతను దాటేస్తున్నానేమోనని నారిమన్ నన్ను నెమ్మదిగా హెచ్చరిస్తూనే ఉన్నారు.



సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దివంగత ఫాలీ ఎస్. నారిమన్
(10 జనవరి 1929 – 21 ఫిబ్రవరి 2024)

ప్రభుత్వం అతి సమీపంగా ప్రస్తావనకు వచ్చిన అనేక అంశాలపై ఇంటర్వ్యూలో నారిమన్ ఇదే విధమైన సున్నిత శైలిని అవలంబించారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో ఎప్పటికీ మనం ఒక కొత్త రాజ్యాంగాన్ని రూపొందించుకోలేం'' అని ఆయన అన్నారు. ''దారికి రప్పించటం, కోరినది ఇవ్వటం, ఓరిమి వహించటం'' అనే ఔదార్యాలు లేకుండా అద్భుతమైన, వినూత్నమైన ఆలోచనలు మాత్రమే మనకొక ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని ఏనాటికీ అందించలేవు. ''పరిస్థితులను బట్టి చూస్తే భారతదేశంలో ప్రస్తుతం ఇవి మూడూ క్షీణించి ఉన్నాయి'' అన్నారాయన.

ఇటీవలి ఆయన మరణం తర్వాత నేను మళ్లీ ఆనాటి ఇంటర్వ్యూను విన్నాను. నారిమన్ ఎంత బుద్ధిశాలిగా మాట్లాడారో వెంటనే గమనించాను. ''రాజ్యాంగంలో ప్రవేశిక చాలా ముఖ్యమైన భాగం'' అన్నారు. ప్రవేశికను ఆయన రాజ్యాంగం యొక్క మనస్సాక్షి అన్నారు. ప్రవేశికలోని 'సౌభ్రాతృత్వం' అనే భావన గురించే ఆనాడు ఆయన నొక్కి మాట్లాడారా? ప్రవేశికలో మాత్రమే ఉన్న మాట అది.

ఆ తర్వాత 'సహనశీలత' వైపుగా మా సంభాషణను నడిపించింది నేను కాదు, ఆయనే! ప్రస్తుతం సమస్యేమిటంటే మనకు ''సహనం లేదు'' అన్నారాయన. మళ్లీ ఆ తర్వాత కూడా ఈ మాట అనడం కోసం ఆయన తన పుస్తకం హద్దులను సైతం దాటేశారు.

అప్పుడు నేను పట్టుకోలేకపోయాను కానీ, ఇప్పుడు ఆయన మరణం తర్వాత ఆలోచిస్తే ఆయన ఎంత జాగ్రత్తగా ఆ సందేశాలు ఇచ్చారో కదా అని ఆశ్చర్యం కలుగుతోంది. మరికొన్ని కూడా ఉన్నాయి. భారత పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుల్ని నిలబెట్టేందుకు మన న్యాయమూర్తులు మరింత సుముఖంగా ఉండాలి అన్నారు. అలా ఉండేందుకు వారు ఇష్టపడకపోవటం ఆయన్నెంతో నిరాశకు గురి చేసింది. అయితే వారిని తీవ్రంగా విమర్శించేందుకు సంకోచించి, 'క్యురేట్స్ ఎగ్'తో పోల్చి సరిపెట్టుకున్నారు... మంచీ ఉందీ, చెడూ ఉందీ... అయితే మంచిని చెడు తినేస్తోంది అనే అర్థంలో!

నారిమన్‌తో నేను పలు ఇంటర్వ్యూలు చేశాను. తొలినాళ్లలో ఆయన స్పోర్టింగ్ బ్రేసెస్‌ని ధరించి ఉండేవారు. నాకు బౌ టై ఉండేది. మా మధ్య సంభాషణ గొప్ప శక్తితో, ఆసక్తితో సాగేది. మధ్యలో స్నేహపూర్వకమైన అంతరాయాలను కలిగించుకునేవాళ్లం. ఉల్లాసం, ఉత్సాహం తరచూ మా ఇంటర్వ్యూలను నడిపించేవి. అవును, మా సంభాషణ గురించి ఇలాగే చెప్పాలి.

ఆయన భార్య బాప్సి ఓ వైపున కూర్చొని ఉండి మా సంభాషణను ఆలకిస్తూ ఉండేవారు. దాదాపు ప్రతిసారీ ఆమె నన్ను భోజనానికి ఉండమనేవారు. ఆమె అలా అనడమే ఆలస్యం నేను భోజనానికి తయార్! ఆయన నాతో పాటుగా కారు వరకు బయటికి నడిచి వచ్చేవారు. నేను వారికి వీడ్కోలు చెబుతున్నప్పుడు... ''ఆమెకు నువ్వంటే అభిమానం'' అని నవ్వుతూ అనేవారు.

ఆ గుణం కూడా ఆయన గురించిన సముచితమైన విశేషణమే. ఆయన పట్ల నాకు గొప్ప గౌరవభావం. ఆయన మేధ నన్ను ముగ్ధుడిని చేసేది. మనసులో ఏదీ దాచుకోలేని ఆయన స్వభావం, ఒక సరైన పని చేయటంలో ఆయనకు ఉండే నిస్సంశయ నిబద్ధత నన్ను ఆశ్చర్యచకితుడిని చేసేవి. నేను కూడా ఆయనపై అభిమానం పెంచుకున్నాను. పెద్దగా పరిచయం లేకుండానే ఏర్పడే ఆప్యాయత వంటిది ఆ అభిమానం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

డబ్బా మజాకా!



రిహానా (యూఎస్ గాయని) కోటాను కోట్ల విలువైన మనిషి. అట్లాంటి ఆమెను అంబానీలు పెళ్లిళ్లలో పాడే గాయనిని చేసేశారు. డబ్బు తలుచుకుంటే ఏదైనా చేయగలదు!

– ప్రశాంత్ రంగస్వామి, తమిళ నటుడు

కట్టేద్దాం గోడ!



దక్షిణ సరిహద్దును కాపాడుకోవడం అనేది సాంకేతిక సవాల్ కాదు. అది 'విల్' (సంకల్పం)కు సంబంధించినది. మనసుంటే మార్గం ఉంటుంది. విల్ ఉంటే వాల్ (గోడ) వస్తుంది.

– వివేక్ రామస్వామి, యూఎస్ నాయకుడు

గమనార్హం



పడికట్టు మాట: తన రీజియన్‌ను సరిగ్గా ఉంచుకోలేనంతవరకూ ఇండియా గ్లోబల్ పవర్ కాలేదు. వాస్తవం: ఇండియా ఇప్పటికే గ్లోబల్ పవర్, దాన్ని తన రీజియన్ పునారచన కోసం ఉపయోగిస్తోంది. దక్షిణాసియా, హిందూ మహాసముద్ర ప్రాంతాలలో (జపాన్, యూఎస్, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్) ఇండియాకు ఉన్న ఆర్థిక, భద్రత భాగస్వామ్యాల వల్ల ఇండియా ఇరుగుపొరుగు విధానానికి మేలు జరుగుతోంది.

– కాన్‌స్టంటినో జేవియర్, ఫెలో

గొప్ప సంగతి



ఇండియా నుంచి అత్యంత పేదరికం అనేది తొలగిపోయింది. 'ద వరల్డ్ పావర్టీ క్లాక్' ఇండియాలోని అత్యంత పేదరికాన్ని 3 శాతం కంటే తక్కువగా చూపుతోంది. ఇది మన జీవిత కాలాల్లో సంభవించిన అత్యంత గణనీయమైన ప్రపంచ పరిణామాల్లో ఒకటి.

– శమికా రవి, ఆర్థికవేత్త

నిత్య హడావిడి



భారత స్టాక్ మార్కెట్లు, భారత రాజకీయాలు, భారత స్టార్టప్ ఎకో సిస్టమ్‌లలో నీరసమైన క్షణాలు అనేవే ఉండవు. మూడింట్లోనూ ఏదీ సరితూగనంత వేగం, రొద ఉంటూనే ఉంటాయి.

– రాజేశ్ సహానీ, వ్యాఖ్యాత

ఆగని సందడి



రానున్న రెండు వారాల్లో యూరప్, ఇండో–పసిఫిక్ రీజియన్ నుంచి ఉన్నతాధికారుల హైప్రొఫైల్ పర్యటనలకు ఇండియా ఆతిథ్యం ఇవ్వనుంది. దేశం ఎన్నికల దిశగా కదులుతున్నప్పటికీ, దౌత్యవేత్తల సందడి కొనసాగుతూనే ఉంది.

– సిద్ధాంత్ సిబాల్, జర్నలిస్ట్

నిజంగా బాగుందా?



బీజేపీ నుంచి టికెట్స్ రాని ప్రతి ఒక్కరూ, ఎంపీ బాధ్యతల నుంచి తమను విడుదల చేయమని (బీజేపీ జాతీయాధ్యక్షుడు) నడ్డాజీని కోరుతారు. అలాగే ప్రోటోకాల్ ప్రకారం ప్రధాని, హోంమంత్రికి ధన్యవాదాలు చెబుతారు. ఇదంతా కూడా అదేదో అమీర్ ఖాన్ సినిమాలో లాగా 'ఆల్ ఈజ్ వెల్' (అంతా బాగుంది) అని చాటేందుకు!

– నికుంజ్ షా, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

చిరస్మరణీయ మూర్తి

అనేక సాంస్కృతిక ప్రక్రియలలో ఆరితేరిన అసమాన్య ప్రతిభామూర్తి, క్రియాశీల చైతన్యంతో వందలాది మందిని సాహిత్య, నాటక రంగాలలో తీర్చిదిద్దిన సౌజన్యదీప్తి కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుత రామరాజు. 1924 మార్చి 5న తూర్పుగోదావరి జిల్లా కొటిమేరులో మాతామహుల ఇంట జన్మించారు. చిన్న వయసులోనే ఆంగ్ల, తెలుగు నాటకాలలో నటనకు శ్రీకారం చుట్టారు. 1949 నుండి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. సాహిత్య, నాటక రంగాలు ఆయనకు రెండు కళ్ళు. విశాఖ పట్టణాన్ని తమ కార్యక్షేత్రంగా జీవితాంతం పనిచేశారు. విలియమ్స్ మేక్పీస్ థేకర్ రచించిన 'జమిందార్ ఆఫ్ బొంకుల దిబ్బ', విలియమ్స్ షేక్స్‌పియర్ రచనలు 'హెన్రీ ఫిఫ్త్', 'యాజ్ యు లైక్ ఇట్' వంటి నాటకాలలో నటించారు. 'చాణక్య', 'తిమ్మరుసు', 'ఖిజీర్', 'షాజహాన్', 'అజాత శత్రువు' వంటి పాత్రల్లో నటించారు.



గణపతిరాజు
అచ్యుత రామరాజు

ఇక రచయితగా, కవిగా, 'ఖడ్గతిక్కన', 'మాలిని', 'బ్రహ్మముడి', 'వినాయకుడి పెళ్ళి', 'తీర్పు', 'ఆనందహేల', 'ఇంకానా ఇకపై సాగవు' (నాటిక), 'మున్నీ' (కథా సంకలనం), 'అమరం' (కవితా సంపుటి) ఇలా పలు అమూల్యమైన కవితా, వచన, నాటక రచనలు చేశారు. 'విశాఖ నాటక కళా మండలి', 'విశాఖ రచయితల సంఘం', 'విశాఖ నాటక కళాపరిషత్', 'విశాఖ సాహితి' వంటి, సాహిత్య, నాటక సంస్థల స్థాపకునిగా, అధ్యక్ష, గౌరవాధ్యక్షునిగా బాధ్యతలు వహించి ఎందరికో స్ఫూర్తినిచ్చారు.

వేదికలు, భావజాలాలు వేరయినా వివాద రహితునిగా, స్నేహపాత్రునిగా వందలాది మంది హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. తన రాజకీయ (భారతీయ జన సంఘ్ పార్టీ నేత) భావజాలం ప్రభావం ఇతరులైన సన్నిహితులపై పడకుండా, కేవలం సాంస్కృతిక సాన్నిహిత్యమే పరమావధిగా భావించి జీవించిన ధన్యజీవి. 1968–1974 మధ్య జనసంఘ్ పార్టీ పక్షాన శాసన మండలి సభ్యునిగా వ్యవహరించారు. ఆ పదవి తన సామాజిక బాధ్యతలో చిన్న భాగం మాత్రమే. తెలుగునాట రాజకీయ, సాహిత్య మేరు శిఖరాలైన పి.వి. నరసింహారావు, డా॥ బెజవాడ గోపాల రెడ్డి, దామోదరం సంజీవయ్య, డా॥ సి. నారాయణ రెడ్డి వంటి ఎందరికో ఆయన సన్నిహితులు. 2004 జూన్ 10వ తేదీన అమరులైన డా॥ గణపతి రాజు అచ్యుతరామరాజు స్ఫూర్తి కలకాలం తెలుగువారిపై ప్రసరిస్తూనే ఉంటుంది.

– బి.వి. అప్పారావు

(మార్చి 5న గణపతి అచ్యుత రామరాజు శతజయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గాలివాటంతో పోయిన విశ్వసనీయత

అభిప్రాయం




డా॥ జి. నవీన్

ఒకవైపు వైసీపీ అధినేత జగన్ రాష్ట్రం నలుమూలలా 'సిద్ధం' సభలు పెట్టి ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తుంటే... ఎట్టకేలకు ప్రతిపక్ష పార్టీలు జనసేన – తెలుగు దేశం కూటమిగా ఏర్పడి తాడేపల్లిగూడెంలో మొదటి సభ పెట్టాయి. అక్కడ పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం చర్చనీయాంశం. పవన్ సొంత పార్టీ పెట్టి ఇప్పటికి పదేళ్లు అయ్యింది. ఈ దశాబ్ద కాలంలో 2014లో హిందుత్వ బీజేపీనీ, అవకాశవాద చంద్రబాబు టీడీపీనీ బలపరిచారాయన. 2019కి వచ్చేటప్పటికి బీజేపీకి పూర్తి వ్యతిరేక వైఖరి అవలంబించే కమ్యూనిస్టు పార్టీలతో, బీఎస్పీతో జత కట్టారు. ఆ ఎన్నికలు అయిన వెనువెంటనే తిరిగి బీజేపీ పంచన చేరారు. ఇప్పుడు టీడీపీతో కలిసి బరిలోకి దిగారు. ఈ పదేళ్ల వ్యవహార శైలి అతడి రాజకీయ ఊసరవెల్లితనాన్ని చాటి చెబుతోంది. ఈ విషయంలో తాను చంద్రబాబుకి ఏ మాత్రం తీసిపోనని కించిత్ గర్వపడొచ్చు కూడా! దేశం కాని దేశ ప్రజల కోసం ఆత్మ త్యాగం చేసిన చేగువేరా వంటి అద్వితీయమైన నాయకుడిని స్మరించిన నోటితోనే వెన్నుపోటు పొడిచే కళలో ఆరితేరిన చంద్రబాబు నామజపం చేయడం సిగ్గు చేటు.

'జెండా' సభలో ఆయన మాటల్లో అక్కసు కనిపించింది తప్ప ఎన్నికల్లో వారి అజెండా ప్రస్తావనే లేదు. 2019లో జనం తనని రెండు చోట్ల ఓడించారు అనే కోపం ప్రదర్శించారు కానీ ఎందుకు ఆ పరిస్థితి దాపురించిందో సింహావలోకనం చేసుకునే సంయమనం చూపలేదాయన. సినిమా పాటల్లో గెటప్‌లు మార్చినంత తొందరగా రాజకీయాలలో రంగులు మారిస్తే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతాము అనే తర్కాన్నీ మరచారు. తనకు తానే దేశం కోసం, రాష్ట్రం కోసం పరితపిస్తున్నాను అని చెబితే నమ్మేసి మళ్లీ మళ్లీ మోసపోవడానికి ఇవి ఆడియో రిలీజ్ సభలు కాదు అనే విషయం పాపం 'పవర్' స్టార్ విస్మరించారు. అంతగా ఆలోచించి ఈయన దేశం కోసం చేసిన మంచి ఏమిటో మచ్చుకు ఒక్కటైనా చెప్పలేకపోయారు. 2014లో తాను గెలిపించిన చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు ఒక్కటైనా ఉందా? పోనీ ఈసారి గెలిస్తే ఇదీ మా ప్రణాళిక అని చెప్పే సాహసం కూడా చేయలేకపోయారు. 'నేను ఒక నియోజకవర్గం కూడా పెంపొందించుకోలేదు' అని అనడం ఎన్నికలు మొదలు కాక మునుపే ఓటమికి సాకులు వెతుక్కుంటున్నట్టు ఉంది.

ఒక దశలో తనను తాను వామనుడిగా, జగన్‌ను బలి చక్రవర్తిగా పోల్చారు. దక్షిణాది ప్రజల చరిత్ర ఈయనకి ఏ మాత్రం అవగతమైనట్లు లేదు. ఎన్నో పుస్తకాలు నెమరు వేశాను అని డాంబికాలు పలికే పవన్ కల్యాణ్ బలి చక్రవర్తి ఔన్నత్యాన్నీ, వామనుడి కుటిలత్వాన్నీ గమనించినట్లు లేరు. కేరళలో కానీ, ఇతర దక్షిణాది రాష్ట్రాలలో కానీ బలి చక్రవర్తిని ఒక ఉదార రాజుగా కొలుస్తారు. బహుజనుల నాయకుడైన బలిని అవహేళన చేస్తూ ఒక రాజకీయ సభలో ప్రసంగించడం ఆయన అపరిపక్వతకు మచ్చుతునక.



పలుమార్లు కోట్ల సంపాదన వదిలి ప్రజల కోసం తిట్లు తింటున్నాను అని ఈయన చెప్తారు. ఇది చాలా చవకబారు వాదన. తనకు తానే ఒక కారణ జన్ముడిగా, త్యాగశీలిగా చెప్పుకోవడం నిజానికి ప్రజల వివేకాన్ని అవమానించడమే. ఒక రాజకీయ నాయకుడు ప్రజలను మమేకం చేసుకుంటూ తన అజెండాని వారికి తెలియచెప్పాలి. కానీ 'అంతా నాకు వదిలేయండి. నాకు అన్నీ తెలుస'ని ఏమార్చకూడదు. ఆది గమనించే 2019లో ప్రజలు ఈయన్ని తేలికగా తీసుకున్నారు.

రాష్ట్రంలో అన్ని స్థానాల్లో పోటీ చేసే స్థోమత లేదు అని చెప్పడం మరో హాస్యాస్పదమైన అంశం. చరిత్రలో ఎన్నో కొత్త పార్టీలు అటువంటి ధైర్యాన్నే చేసి ప్రజల మద్దతు కూడకట్టుకోగలిగాయి. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ కానీ, జగన్ సారథ్యంలో వచ్చిన వైసీపీ కానీ, ఈయన అన్నయ్య చిరంజీవి పెట్టిన 'ప్రజారాజ్యం' కానీ సొంతంగా రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేసి తాడో పేడో తేల్చుకున్న కొత్త పార్టీలే. ఇతర రాష్ట్రాలలో కూడా ఆమ్ ఆద్మీ పార్టీ లాంటి శక్తులు కొత్తగా బరిలోకి దిగి విజయం సాధించిన సందర్భాలు కోకొల్లలు. అంతటి మేధ లేక చీటికి మాటికి తనను గుడ్డిగా నమ్ముకున్న నాయకులనూ, కార్యకర్తలనూ 'పోల్ మేనేజ్‌మెంట్' రాదు అంటూ కించపరుస్తూ మాట్లాడడం ఒక పద్ధతిగా పెట్టుకున్నారు పవన్. ఒకసారి పార్టీ ఎదుగుదలకి 10 ఏళ్ళు కావాలి అన్నారు. పదేళ్లు గడిచాక ఇప్పుడు... కాదు కాదు 20–30 ఏళ్ళు అంటున్నారు. ఎంత కాలం ఇలా వెళ్ళబుచ్చుతారో చూడాలి!


24 సీట్లకి జనసేనను కుదించి చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌ను భూస్థాపితం చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు అనిపిస్తుంది. కూటమి గెలిస్తే ఎందుకూ కొరగాని జూనియర్ పార్టీ అవుతుంది జనసేన. ఓడితే కూటమి వల్లే ఈ పరిస్థితి అని చెప్పడానికి సరిపోతుంది. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన సందర్భంలో కమ్యూనిస్టు పార్టీల మద్దతు ఇలాగే తీసుకున్న చంద్రబాబు వాళ్ళ విశ్వసనీయతపై ఇలాంటి దెబ్బే కొట్టారు. 1994లో సీపీఐ, సీపీఎంలు కలిపి 34 సీట్లు గెలిచి బలమైన స్థానంలో ఉండేవారు. ఎన్టీఆర్‌ను కాదని చంద్రబాబుతో చేతులు కలిపిన కమ్యూనిస్టు పార్టీలు ఆంధ్ర ప్రదేశ్‌లో పట్టు పోయి మళ్ళీ కోలుకోలేదు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు కలిపినా ఒకటో ఆరో సీటుకి పరిమితమయ్యి కాలగర్భంలో కలిసిపోయాయి. ఈసారి బాబు దెబ్బతో పవన్ కల్యాణ్ కూడా కరి మింగిన వెలగపండు అవుతారేమో!

వ్యాసకర్త సామాజిక, రాజకీయ అంశాల విశ్లేషకుడు

జగన్మాత కరుణ

సీతాదేవిని మహాలక్ష్మి అవతారం అంటారు. ఆ మహాలక్ష్మి కరుణకు మారుపేరు. ఆమె మహాలక్ష్మి అయితే రాముడు నారాయణుడు. సీతారాముల గురించి మాట్లాడుతున్నప్పుడు మహాత్ములు, ఆళ్వార్లు రాముడి కృప కన్నా సీతాదేవి కృపనే గొప్పగా చెప్పారు.

ఒకానొక కాకి అపరాధం చేసింది. రాముడు వెంటనే బాణాన్ని వదిలాడు. అది ఆ కాకిని తరిమింది. ఆ కాకి చివరికి రాముడి వద్దకు వచ్చి తనను క్షమించమని ప్రాధేయపడింది. అప్పుడు పక్కనే ఉన్న సీతాదేవి జాలిపడి దాన్ని విడిచి పెట్టమని కోరింది. దాంతో రాముడు సరేనన్నాడు. శూర్పణఖ రగడ చేసింది. అయితే సీత పక్కన ఉండడంతో రాముడు శూర్పణఖ ప్రాణం తీయకుండా హెచ్చరికలతో విడిచి పెట్టాడు. ఇలా సీతాదేవి పక్కన ఉన్నప్పుడు రాముడు ఎవరినీ వధించలేదు. సీత పక్కన లేనప్పుడే రాముడు పలువురిని వధించాడంటారు.



జ్యోతిర్మయం

రావణాసురుడిని వధించిన తర్వాత ఆంజనేయుడు అశోకవనంలో సీతతో 'మిమ్మల్ని ఇంతకాలమూ ఇబ్బంది పెట్టిన ఈ అసురుల నాశనానికి ఆదేశించండి' అని కోరాడు. అందుకు సీతాదేవి రావణాసురుడి ఆదేశాల మేరకే వారలా ప్రవర్తించారు. వారికి ఏ విధంగానూ హాని తలపెట్టకూడదు' అని చెప్పింది. జగన్మాతకు తప్పించి ఇంతటి కరుణ మరెవరికి ఉంటుంది. అందుకే, ఆమెను జగన్మాతగా భావించాలంటారు. అమ్మవారికి భూమాత అనేగా మరొక పేరు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.నవమి రా.2.55 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: జ్యేష్ఠ ఉ.11.34 వరకు, తదుపరి మూల, వర్జ్యం: రా.7.32 నుండి 9.02 వరకు, దుర్ముహూర్తం: ప.12.36 నుండి 1.24 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, అమృతఘడియలు: తె.5.03 నుండి 7.43 వరకు (తెల్లవారితే మంగళవారం), అమృతఘడియలు: సా.6.54 నుండి 8.40 వరకు ; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.21, సూర్యాస్తమయం: 6.03.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

హంస వాహనంపై ఆది దంపతులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు హంసవాహన సేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంసవాహనంపై ఆశీనులను చేసి ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజ చేసి హారతులనిచ్చారు. మంగళవాయిద్యాలు మారుమోగగా, భక్తుల శివన్మామస్మరణ ప్రతిధ్వనించగా హంసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షణ చేయించి వెలుపలకి తోడ్కొనివచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. హంసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించి ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. గ్రామోత్సవంలో దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వేడుకగా భక్తకన్నప్ప ధ్వజారోహణం



రేణిగుంట(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 13 రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో మొదటి రోజు శ్రీకాళహస్తి దేవస్థానం సమీపంలో కైలాసకొండల్లో వెలసిన భక్తకన్నప్ప కొండపై కన్నప్ప ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ఇక్కడ శ్రీకాళహస్తీశ్వరుని భక్తుడు భక్తకన్నప్పకే తొలిపూజ చేయడం ఆనవాయితీ. ఆది దంపతులకు స్వాగతం పలుకుతూ కైలాసగిరిని ఆలయాధికారులు అందంగా ముస్తాబు చేశారు. శ్రీకాళహస్తి ఆలయంలోని అలంకార మండపంలో భక్తకన్నప్ప ఉత్సవమూర్తిని పుష్పాలతో విశేషంగా అలంకరించి కన్నప్పను కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి ధ్వజస్తంభం వద్ద ప్రతిష్టించారు. ధ్వజస్తంభం చుట్టూ కలశాలను ఏర్పాటు చేశారు. ఆ కలశ జలాలతో అభిషేకం చేసి ధ్వజపటాన్ని ఎగురవేశారు. అనంతరం కన్నప్ప కొండమీద ఎత్తైన ప్రదేశానికి వెళ్లి కైలాసగిరుల్లో కొలువై ఉన్న అష్టదిక్పాలకులను ఉత్సవాలకు ఆహ్వానించి, ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ప్రార్థిస్తూ హారతులు సమర్పించారు. అనంతరం కన్నప్ప ఉత్సవమూర్తిని పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో నాగేశ్వరరావు, బియ్యపు పవిత్రారెడ్డి, డిప్యూటీ ఈవో ఏకాంబరం, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, ఏఈవో ధనపాల్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఆలయంలో స్వామివారి ధ్వజారోహణం జరగనుంది.

రోడ్డు ప్రమాదంలో 'పిన్నెల్లి' గన్‌మెన్ మృతి

నివాళులర్పించిన ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్



మాచర్ల: ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మూడేళ్లుగా గన్‌మెన్‌గా పనిచేస్తున్న బాపట్ల ప్రాంతానికి చెందిన ఎం.గోపిరెడ్డి (30) ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాపట్ల మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి ద్విచక్రవాహనంపై బాపట్ల బయలుదేరారు. చుండూరుపల్లి రహదారి వద్ద లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని మృతిచెందారు. గోపిరెడ్డి 2018లో పోలీసు కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. మూడేళ్లుగా పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గోపిరెడ్డి మృతి వార్త తెలుసుకున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి వెంటనే వెళ్లి నివాళులర్పించారు. తన గన్‌మెన్ మృతి చెందటం బాధాకరమని పీఆర్కే ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు.

6న రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ

ఖాతాల్లోకి కరువు సాయం.. మిచాంగ్ పరిహారం



- 11.59 లక్షల మంది ఖాతాల్లోకి రూ.1,294.58 కోట్లు
- బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావం కారణంగా 2023 ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన కరువుతో పాటు 2023–24 రబీ సీజన్ ఆరంభంలో మిచాంగ్ తుపాన్‌తో పంటలు కోల్పోయిన రైతులకు పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ రెండు విపత్తుల వల్ల నష్టపోయిన 11.59 లక్షల మంది రైతులకు రూ.1,294.58 కోట్లు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈమేరకు ఈ నెల 6వ తేదీన తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి బాధిత రైతుల ఖాతాలకు నేరుగా సాయాన్ని జమ చేయనున్నారు. వైఎస్సార్ రైతు భరోసాతో పాటు సున్నా వడ్డీ రాయితీ కింద రైతన్నలకు రూ.1,294.34 కోట్లు అందించి వారం తిరగకముందే మరోసారి అన్నదాతలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ఆరు ప్రామాణికాల ఆధారంగా కరువు మండలాలు

ప్రకృతి వైపరీత్యాల వేళ పంటలు కోల్పోయిన రైతులకు ఆ సీజన్ ముగియకుండానే పరిహారాన్ని అందజేస్తూ ఐదేళ్లుగా సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పైసా కూడా బకాయి పెట్టకూడదన్న సంకల్పంతో ఏ సీజన్‌లో జరిగిన నష్టాన్ని అదే సీజన్ ముగిసేలోగా అందజేస్తోంది. వర్షాభావంతో గతేడాది ఖరీఫ్‌లో 84.94 లక్షల ఎకరాలకు గానూ 63.46 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఆరు ప్రామాణికాల (వర్షపాతం, పంట విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, జలప్రవాహం, భూగర్భ జలాలు, జలాశయాల స్థాయిలు) ఆధారంగా ఏడు జిల్లాల్లో 103 మండలాలు కరువుబారిన పడినట్లు గుర్తించి సీజన్ ముగియకుండానే ప్రకటించారు. బెట్ట పరిస్థితులతో 14,23,995.5 ఎకరాల్లో 33 శాతం కన్నా ఎక్కువ శాతం పంట నష్టపోయినట్లు గుర్తించారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత 6.96 లక్షల మంది రైతులకు రూ.847.22 కోట్ల పెట్టుబడి రాయితీ చెల్లించాలని లెక్క తేల్చారు.

22 జిల్లాల్లో మిచాంగ్ ప్రభావం

మిచాంగ్ తుపాన్ వల్ల 22 జిల్లాల్లో 6,64,380 ఎకరాల్లో 33 శాతం కన్నా ఎక్కువ శాతం పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. 4.61 లక్షల మంది రైతులకు రూ.442.36 కోట్లు పెట్టుబడి రాయితీ చెల్లించాలని అంచనా వేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఐదు వేల ఎకరాల్లో పంట నష్టపోయిన 1892 మంది రైతులకు రూ.5 కోట్ల పరిహారం చెల్లించాలని అంచనా వేశారు. మొత్తం 20,93,377 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న 11,59,126 మంది రైతులకు రూ.1,294.58 కోట్ల పరిహారం చెల్లించాలని లెక్క తేల్చారు.

భారమైనా పెట్టుబడి రాయితీ పెంపు

కేంద్రం నిర్ణయించిన దాని కంటే ఎక్కువ సాయం అందించాలన్న లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడి రాయితీని ప్రభుత్వం పెంచింది. వ్యవసాయ భూముల్లో మట్టి, ఇసుక మేటలు తొలగించేందుకు గతంలో హెక్టారుకు రూ.12 వేలు ఇవ్వగా దాన్ని రూ.18 వేలకు పెంచింది. దెబ్బతిన్న వర్షాధార పంటలకు హెక్టార్‌కు రూ.6800 చొప్పున ఇస్తున్న పరిహారాన్ని రూ.8500కు పెంచారు. నీటి పారుదల భూములైతే గతంలో రూ.13,500 చొప్పున చెల్లించిన పరిహారాన్ని రూ.17 వేలకు పెంచారు. వరి, వేరుశనగ, పత్తి, చెరకు తదితర పంటలకు గతంలో హెక్టార్‌కు రూ.15 వేల చొప్పున ఇస్తుండగా దాన్ని రూ.17 వేలకు పెంచారు. ఉద్యాన పంటలకు రూ.7500 నుంచి రూ.17 వేలకు పెంచారు. మామిడి, నిమ్మ జాతి తోటలకు రూ.20 వేల నుంచి రూ.22,500 చొప్పున, మల్బరీకి రూ.4800 నుంచి రూ.6వేలకు పెంచి ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వంపై భారం పడినప్పటికీ కష్టాల్లో ఉన్న రైతులకు ఎంత చేసినా తక్కువే అనే ఉద్దేశంతో పెట్టుబడి రాయితీని పెంచి మరీ ప్రభుత్వం చెల్లిస్తోంది.

ఐదేళ్లలో రూ.3,271 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి సంబంధించి అదే సీజన్ ముగిసేలోగా పరిహారం చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కరువు, మిచాంగ్ తుపాన్ వల్ల 2023–24 సీజన్‌లో పంటలు దెబ్బతిన్న 11.59 లక్షల మంది రైతులకు ఈనెల 6వతేదీన రూ.1,294.58 కోట్ల పెట్టుబడి రాయితీని సీఎం జగన్ బటన్ నొక్కి ఖాతాలకు జమ చేస్తారు. గత 57 నెలల్లో 22.85 లక్షల మంది రైతులకు రూ.1,976.44 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని అందించింది. తాజాగా చెల్లించే సాయంతో కలిపితే 34.44 లక్షల మంది రైతులకు రూ.3,271 కోట్లు అందించినట్లవుతుంది.

–చేవూరు హరికిరణ్,
స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

విద్యావేత్త తుమ్మలపల్లి సేవలు చిరస్మరణీయం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియంలో స్థల దాత విగ్రహం ఆవిష్కరణ



తుమ్మలపల్లి హరినారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించిన జస్టిస్ కృష్ణమోహన్, చిత్రంలో జంధ్యాల శంకర్, మల్లాది విష్ణు తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): విద్యావేత్త డాక్టర్ తుమ్మలపల్లి హరినారాయణ సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్థల దాత డాక్టర్ హరినారాయణ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు జస్టిస్ కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై తొలుత డాక్టర్ తుమ్మలపల్లి హరినారాయణ, అన్నపూర్ణ దంపతుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సమాజానికి మనం చేసే మంచి పనులే మనల్ని చిరంజీవిగా ఉంచుతుందనటానికి హరినారాయణే నిదర్శనమన్నారు. అటువంటి మహోన్నతుని విగ్రహావిష్కరణలో భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. హైదరాబాద్ అంటే రవీంద్ర భారతి ఆడిటోరియం గుర్తుకొచ్చినట్లే విజయవాడ అంటే తుమ్మలపల్లి కళాక్షేత్రం గుర్తుకు వస్తుందన్నారు. ఆ మహనీయుని సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజానికి ఏదో విధంగా సహాయపడాలని కోరారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ, హరినారాయణ ట్రస్ట్ ద్వారా ఏటా నగరంలోని పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయటం గొప్ప విషయమన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి ఆశయాలు, సిద్ధాంతాలకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ విద్యార్థి గృహం సంస్థ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణరావు, డాక్టర్ జి.ఈశ్వర్, కార్యదర్శి జి.వి.ఎస్.ఎస్.రాఘవరావు, కోశాధికారి మోగులూరు శ్రీకృష్ణ, హరినారాయణ విగ్రహ దాత బుర్రా శివ వరప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: పలువురు ప్రముఖులు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, రాజ్యసభ ఎంపీ మేడ రఘునాథ్ రెడ్డి, తిరుపతి కలెక్టర్ లక్ష్మీశ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వాచనాలు పలుకగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు.



ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు

దేశమంతా ఏపీ వైపు చూస్తోంది

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సీఎం జగన్ ప్రభుత్వం
- ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణల వల్ల వైద్యరంగంలో గొప్ప మార్పులు వచ్చాయని, దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం ఐఎంఏ ఏపీ స్టేట్ జోన్–3 రీజినల్ అకడమిక్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులతో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం చేరువైందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపుల ద్వారా 50 రోజుల్లోనే 60 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించడం ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదన్నారు. సీఎం నిర్ణయాలతో రాష్ట్రంలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతమయ్యాయని చెప్పారు. రానున్న రోజుల్లో వైద్యం, ఆరోగ్యం విషయాల్లో మన రాష్ట్రం దేశానికి దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. గతంలో వైద్య రంగానికి సంబంధించి మన రాష్ట్రం కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల కంటే దిగువన ఉండేదని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యల కారణంగా ఏపీ ముందు వరుసలో ఉందని చెప్పారు. ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణీందర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వల్ల ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం సమీకృత వైద్యాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందని, ఇది మంచిది కాదన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో భాగంగా పలువురు వైద్యులు చేసిన అరుదైన శస్త్రచికిత్సల గురించి వీడియో ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ జీవీజీ మహేష్, డాక్టర్ త్యాగరాజరెడ్డి, డాక్టర్ ఇ.సాయిప్రసాద్, డాక్టర్ హేమలత, వసుధ, డాక్టర్ హరీష్‌కుమార్, అప్నా ప్రెసిడెంట్ డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు ఏపీలో బాటలు

ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

సాక్షి, అమరావతి/తాడికొండ: దేశంలోనే నాణ్యమైన విద్యను అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) చైర్మన్ టీజీ సీతారాం ప్రశంసించారు. ఉన్నత విద్యలో ప్రమాణాలు పెంచేందుకు ఏపీలో ప్రత్యేకంగా ఉన్నత విద్య ప్రణాళిక బోర్డును ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యాన ఆదివారం విట్ యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు 6వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వర్సిటీల్లో వైబ్రెంట్ రీసెర్చ్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం పెంపు' అంశంపై సీతారాం మాట్లాడారు. విద్యాసంస్థల మధ్య సంస్థాగత సహకారం, అకడమిక్ లింకేజీల ద్వారా విద్యార్థులు రీసెర్చ్ ప్రాజెక్టులు చేపట్టేందుకు అందుబాటులోని వనరులపై అవగాహన పెంచుకోవడానికి, ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండటానికి సహాయపడతాయని ఆయన చెప్పారు. పరస్పర సహకారంతో జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు పెంచడంపై వర్సిటీల వైస్ చాన్సలర్లు దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీలు కృత్రిమ మేధ(ఏఐ), ఎమర్జింగ్ టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలన్నారు. మారుతున్న టెక్నాలజీలను కరిక్యులమ్‌లో చేర్చడంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వాతావరణాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. విద్యార్థులు స్వయం పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో తాము తీసుకువచ్చిన సంస్కరణ వల్ల పేటెంట్ కోసం వచ్చే దరఖాస్తులు 350 శాతం పెరిగాయని చెప్పారు. ఏపీలో 87 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బుద్దా చంద్రశేఖర్, ఉన్నత విద్యా మండలి వీసీలు ప్రొఫెసర్ రామమోహన్‌రావు, ప్రొఫెసర్ ఉమామహేశ్వరిదేవి, సెక్రటరీ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్, ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీరంగం మాధ్యూ, విట్–ఏపీ వీసీ కోటారెడ్డి, డాక్టర్ విశ్వనాథన్, 51 వర్సిటీల వైస్ చాన్సలర్లు పాల్గొన్నారు.



2022-23 వార్షిక రిపోర్టును విడుదల చేస్తున్న ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు సభ్యులు

పెదలబుడు అభివృద్ధిలో చంద్రబాబు విఫలం: వైవీ



పాడేరు/అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): తన దత్తత గ్రామం పెదలబుడును అభివృద్ధి చేయలేని చంద్రబాబు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. పాడేరు, అరకులోయలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభల్లో ఆయన మాట్లాడారు. గిరిజనుల శ్రేయస్సు కోసం సీఎం జగన్ ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. గిరిజనులకు పాలన చేరువ చేసేందుకు కొత్త జిల్లా ఏర్పాటు చేశారన్నారు. పాడేరులో రూ.550 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల వల్ల గిరిజనులకు కార్పొరేట్ వైద్యం మరింత చేరువ అవుతుందన్నారు. అరకు, పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ స్థానాలను గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. గిరిజనులను టీడీపీ చిన్నచూపు చూస్తే, జగనన్న మాత్రం తన హృదయంలో పెట్టుకున్నారన్నారు. బాక్సైట్‌కు టీడీపీ అనుకూలంగా జీవో తెస్తే, గిరిజనుల మనోభావాలు దెబ్బతినకూడదని భావించిన జగనన్న వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లో ఆ జీవో రద్దుచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మీ పాలనలో వరికపుడిశెల గుర్తుకు రాలేదా బాబూ!

- కోడెల ఆత్మహత్యనూ రాజకీయంగా వాడుకుంటున్న చంద్రబాబు
- యూజ్ అండ్ త్రో పాలసీకి బ్రాండ్ అంబాసిడర్ బాబే
- టీడీపీ హయాంలో కంటే మెరుగ్గా శాంతిభద్రతలు
- జల వనరుల శాఖ మంత్రి అంబటి

సత్తెనపల్లి: '14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా చేశావు. అనేకసార్లు శిలాఫలకాలు ఆవిష్కరించావు. అప్పుడు గుర్తుకు రాలేదా వరికపుడిశెల. ఇప్పుడేమో అధికారంలోకి వచ్చాక ఒక్క ఏడాదిలోనే పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నావు. అన్నేళ్లు ఏం చేశావ'ని ప్రతిపక్ష నేత చంద్రబాబును జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. టీడీపీ మునిగిపోతున్న పడవ అని.. దాన్ని కాపాడుకునేందుకే రా కదలి రా సభల్లో చంద్రబాబు ఉక్రోషం వెళ్లకక్కుతున్నారని విమర్శించారు. పిన్నెల్లిని మారీచుడని, దుర్మార్గుడని చంద్రబాబు అంటున్నాడని.. దమ్ముంటే ఆయనను ఓడించమని హెచ్చరించారు. దుర్మార్గమైన పాలన చేశారు కాబట్టే విసిగిపోయిన ప్రజలు పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించారన్నారు. 'నన్ను పదేపదే ఆంబోతు అని చంద్రబాబు విమర్శిస్తున్నాడు. ఏ ఆంబోతుకు ఏ ఆవును సప్‌లై చేశావో చిట్టా తీస్తా జాగ్రత్త. అడ్రస్‌లతో సహా చెబితే మళ్లీ ఏడవాల్సి వస్తుంది' అని చురకలంటించారు. తన గురించి మాట్లాడేటప్పుడు నాలుక అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.



కోడెలను వేధించి.. ఆయన మరణానికి కారణమైంది చంద్రబాబే

మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్య చేసుకోడానికి చంద్రబాబే కారణమని మంత్రి రాంబాబు స్పష్టం చేశారు. ఓటమి పాలైన తర్వాత ఆయనను కలిసే అవకాశం కూడా చంద్రబాబు ఇవ్వలేదని గుర్తు చేశారు. కోడెలను, ఆయన కుటుంబాన్ని పక్కన పెట్టడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. చివరకు ఆయన మరణాన్ని కూడా సొమ్ము చేసుకునేందుకు చంద్రబాబు వెనుకాడటం లేదన్నారు. కోడెలపైన, ఆయన కుటుంబంపైనా చంద్రబాబుకు ఇంకా కక్ష పోలేదని.. ఆయన వారసులకు సీటివ్వకుండా రాజకీయ భవిష్యత్ లేకుండా చంద్రబాబు అణచివేస్తున్నారని ధ్వజమెత్తారు.

విశ్వాస ఘాతకుడు 'లావు'

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును ఎంపీగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపిస్తే.. విశ్వాస ఘాతకుడిగా మారి టీడీపీ పంచన చేరారని మంత్రి అంబటి నిప్పులు చెరిగారు. నరసరావుపేటలో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేందుకు శ్రీకృష్ణదేవరాయలును గుంటూరులో పోటీ చేయమంటే కుదరదన్నారని గుర్తు చేశారు. ఇకపై ఆయన బీసీల ఓటు అడిగే హక్కు కోల్పోయారని అన్నారు. జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి కేబినెట్ ర్యాంక్ ఇచ్చి గౌరవించారని, ఆయన కుమారుడికి జెడ్పీటీసీ ఇచ్చారని గుర్తు చేశారు. జంగా కృష్ణమూర్తి మనసును శ్రీకృష్ణదేవరాయలు విషపూరితం చేసి నిలువునా మునిగిపోయే పరిస్థితి తీసుకొచ్చారని పేర్కొన్నారు.

వాడుకుని వదిలేసే రకం చంద్రబాబు

రాష్ట్రంలో యూజ్ అండ్ త్రో అంటే గుర్తొచ్చేది చంద్రబాబేనని మంత్రి అంబటి స్పష్టం చేశారు. తమ్ముడిని, హరికృష్ణను, తోడల్లుడిని వాడుకుని వదిలేసి యూజ్ అండ్ త్రో పాలసీకి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు పేరొందారన్నారు. 'హూ కిల్డ్ బాబాయ్ అంటున్నావ్. హు కిల్డ్ కోడెల. హూ కిల్డ్ వంగవీటి రంగా' అని నిలదీశారు. రాష్ట్రంలో అనేక విధ్వంసాలు, హత్యలకు చంద్రబాబు అధికార దాహమే కారణమన్నారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్లు చంద్రబాబు ఎంత గొంతు చించుకున్నా ఫలితం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకునేందుకు ఎంతగా తాపత్రయపడుతున్నారో సిద్ధం సభలను చూస్తే అర్థమవుతుందన్నారు. బాబుకు, పవన్‌కు కాలం చెల్లిపోయిందని, నాలుగో సిద్ధం సభ తర్వాత టీడీపీ పోటీ నుంచి పారిపోయే పరిస్థితి వస్తుందని చెప్పారు.

'సచివాలయం తాకట్టు' పచ్చ మీడియా సృష్టే

తాకట్టులో సచివాలయం అంటూ పచ్చ మీడియా పచ్చి అబద్ధాలు రాసి ప్రజల్ని నమ్మించాలని ప్రయత్నిస్తోందని మంత్రి అంబటి పేర్కొన్నారు. సెక్రటేరియట్‌ను తాకట్టు పెట్టడం పూర్తిగా అవాస్తవమని, ఏదో విధంగా జగన్‌పై బురదజల్లే ప్రయత్నమేనన్నారు. రాధాకృష్ణ, రామోజీ అసత్యాలు రాసి ప్రజల్ని నమ్మించాలనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వాటిని ప్రజలెవరూ నమ్మే పరిస్థితి లేదని చెప్పారు.

ఓటమి భయంతోనే తప్పుడు కథనాలు

ఎల్లో మీడియాపై బహుజన పరిరక్షణ సమితి నేతల ఆగ్రహం



తాడికొండ: ఓటమి భయంతోనే చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డుపెట్టి తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. 'ఏపీ సచివాలయం తాకట్టు' పేరుతో ఎల్లో పత్రికల్లో వచ్చిన తప్పుడు కథనాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,253వ రోజుకు చేరాయి. రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి మాట్లాడారు. రాజధానిలో జరిగిన రూ.3.50 లక్షల కోట్ల అవినీతిపై ఒక్క కథనం ప్రచురించని ఎల్లో మీడియా.. లేనిది ఉన్నట్లు ప్రచురించడానికి పడుతున్న తంటాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. పత్రికా విలువలను దిగజార్చి వార్తలు రాస్తున్న కుల గజ్జి మీడియాను ప్రజలు ఇప్పటికే బహిష్కరించారని చెప్పారు. ప్రభుత్వాలు కూడా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలు ఉన్నతంగా ఎదిగితే ఎక్కడ తమ సామాజిక వర్గాన్ని మించిపోతారో అనే అక్కసుతో బాబు పేదలను అణగదొక్కుతూ వస్తున్నాడని, ఇక బాబు రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకునే రోజులు దగ్గర పడ్డాయన్నారు. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి మరిది విజయం కోసమే పరితపిస్తూ బీజేపీని పక్కదారి పట్టిస్తుందని విమర్శించారు. నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు త్వరలోనే ఏపీలో పరిపాలనా వికేంద్రీకరణ దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, కొమరవల్లి కిషోర్ బాబు, బోదాల సలోమీ, బోదాల సౌమ్య, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, నూతక్కి జోషి, పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.8 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- సినీ ఫక్కీలో కంటైనర్‌ను వెంటాడి పట్టుకున్న విశాఖ పోలీసులు
- స్పేర్ పార్టుల ముసుగులో రవాణా

ఆనందపురం (విశాఖ జిల్లా): కంటెయినర్‌లో తరలిస్తున్న రూ.8 లక్షల విలువైన గంజాయిని ఆనందపురం పోలీసులు పట్టుకున్నారు. డీసీపీ–1 విజయ్ మణికంఠ ఆదివారం ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. జేసీపీ స్పేర్ పార్టుల లోడుతో హరియాణ వెళ్లడానికి బయలుదేరిన కంటెయినర్‌లో గంజాయి రవాణా జరుగుతోందని శ్రీకాకుళం పోలీసులకు సమాచారం అందించింది. అక్కడ చెక్ పోస్టు వద్ద కంటెయినర్‌ను ఆపి తనిఖీ చేస్తుండగా అక్కడ సిబ్బందిని, డివైడర్‌ను ఢీకొట్టి కంటైనర్‌ను ముందుకు దూసుకెళ్లింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు విజయనగరం, విశాఖ పరిధిలోని అన్ని చెక్ పోస్టులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు ఆనందపురం పోలీసులు భీమిలి క్రాస్ రోడ్డు వద్ద కంటెయినర్‌ను ఆపేందుకు యత్నించగా.. కంటైనర్‌ను ఆపకుండా ముందుకు పోనిచ్చారు. పోలీసు సిబ్బంది మోటార్ బైక్‌ల సాయంతో సినీ ఫక్కీలో వెంబడించి బోయిపాలెం సమీపంలో కంటెయినర్‌ను నిలువరించారు. ఈ లోగా కంటెయినర్‌లో ఉన్న వారు పరారయ్యారు. సీఐ టీవీ తిరుపతిరావు కంటెయినర్ తాళాలను పగలుగొట్టి లోపల పరిశీలించారు. అందులో స్పేర్ పార్టులతో పాటు 13 గంజాయి బ్యాగ్‌లు బయటపడ్డాయి. దీంతో కంటెయినర్‌ను ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీసీపీ–1 విజయ్ మణికంఠ, ఏసీపీ(నార్త్) సునీల్‌లు కంటెయినర్‌ను పరిశీలించి 13 బ్యాగ్‌లలో ఉన్న 80 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న 386 కిలోల గంజాయి విలువ రూ.8 లక్షలుగా తేల్చారు. గంజాయిని ఒడిశాలో లోడు చేసినట్టు సమాచారం ఉందని, నిందితులను త్వరలో పట్టుకుంటామని డీసీపీ విజయ్ మణికంఠ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగ్‌లతో డీసీపీ–1 మణికంఠ, ఏసీపీ సునీల్

ఎమ్మెల్సీ 'కలిచర్ల'పై పోలీసులకు ఫిర్యాదు

కుప్పం(చిత్తూరు జిల్లా): కుప్పం టీడీపీ నాయకుడు, ఎమ్మెల్సీ కలిచర్ల శ్రీకాంత్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌పై ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆయన అనుచరులు దాడిచేసి గాయపరిచినట్టు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంలో, దీనిపై ఎమ్మెల్సీని ప్రశ్నించడంతో ఆగ్రహించిన ఆయన తన అనుచరులతో దాడిచేయించారని విజయకుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ వల్ల తనకు ప్రాణ భయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు హఫీజ్, మణి, ఎంఆర్ సురేశ్, మోహన్‌రామ్ తదితరులు ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బీజేపీకి ప్రధాని మోదీ రూ.2,000 విరాళం

న్యూఢిల్లీ: బీజేపీ ఎన్నికల ప్రచారం కోసం ఆ పార్టీ అగ్రనేత, ప్రధాని మోదీ ఆదివారం రూ.2,000 విరాళం ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కృషి చేస్తున్న బీజేపీకి ఆర్థిక బాసటగా నిలిచేందుకు రూ.2,000 ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు తన విరాళానికి సంబంధించిన రశీదును 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. '' వికసిత భారత్ కోసం అవిశ్రాంతంగా కష్టపడుతున్న బీజేపీకి సాయపడుతున్నందుకు సంతోషిస్తున్నా. వికసిత్ భారత్ సుసాధ్యం కోసం మీరూ మీ వంతు విరాళంతో ముందుకురండి. నమోయాప్ ద్వారా సైతం ప్రతి ఒక్కరు విరాళాలు ఇవ్వొచ్చు'' అని మోదీ అన్నారు. దీనికి డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్ హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ)ను ఉల్లంఘిస్తూ ఇన్నాళ్లూ కొనసాగిన ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రద్దుచేయడంతో బీజేపీ ఇలా విరాళాల బాట పట్టింది. నమో యాప్ ద్వారానూ విరాళాలు సేకరిస్తోంది.

పాక్‌లో భారీ వర్షాలు.. 37 మంది మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఆక్రమిత కశ్మీర్‌తోపాటు బలోచిస్తాన్, ఖైబర్ ఫఖ్తున్వా ప్రావిన్స్‌ల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 48 గంటల వ్యవధిలో ఈ ప్రాంతాల్లో వర్షాలు, వరద సంబంధిత ఘటనల్లో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా ఖైబర్ ఫఖ్తున్వా ప్రావిన్స్‌లో ఇళ్లుకూలి, ఇళ్లలోకి వరద చేరిన ఘటనల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది చిన్నారులేనని అధికారులు తెలిపారు. అదేవిధంగా, బలోచిస్తాన్, పీవోకేలో అయిదుగురు చొప్పున చనిపోయారు. గ్వాదర్ రేవు పట్టణం జల దిగ్బంధంలో చిక్కుకుంది. చైనా-పాకిస్తాన్‌లను కలిపే కారకోరం హైవే మూతబడింది.


ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు... జవాను, మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో ఆదివారం ఉదయం మావోలకు, పోలీసు బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఒక మావోయిస్టు, బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన ఒక జవాను మృతి చెందారు. జిల్లాలోని చోటీబెథియా పోలీస్ స్టేషన్ పరిధిలో గల హిదూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే నిఘా వర్గాల సమాచారం మేరకు బస్తర్ ఫైటర్స్, జిల్లా రిజర్వ్ గార్డ్‌లు, బీఎస్ఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో హిదూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం పోలీసులకు మావోలు తారసపడ్డారు. వెంటనే భద్రతా బలగాలపైకి మావోలు కాల్పులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనలో బస్తర్ ఫైటర్స్ విభాగానికి చెందిన 28 ఏళ్ల జవాను రమేశ్ కురేతి ప్రాణాలు కోల్పోయారు. రమేశ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా సంగం గ్రామానికి చెందిన వ్యక్తి. పోలీసులు తేరుకుని ఎదురుకాల్పులు జరపడంతో ఒక మావోయిస్టు మృతి చెందాడు.

హిమగిరులకు పెనుముప్పు!

2100 నాటికి హిమాలయాల్లో 75 శాతం మంచు మాయం | ఇండియా పర్యావరణ నివేదిక వెల్లడి

భారతదేశానికి పెట్టని కోటలాగా రక్షణ కవచంగా ఉన్న సుందర హిమాలయాలు కనుమరుగు కానున్నాయా? భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదలను అడ్డుకోకపోతే కచ్చితంగా ఇదే జరుగుతుందని ఇండియా పర్యావరణ నివేదిక-2024 తేల్చిచెప్పింది. 2100 నాటికి హిమాలయ పర్వతాల్లోని 75 శాతం మంచు కరిగిపోయే ప్రమాదం ఉందని స్పష్టంచేసింది. తద్వారా వరదలు, విపత్తులు సంభవిస్తాయని, పర్యావరణం, జీవజాలం, వృక్షజాతులకు ముప్పు సంభవిస్తుందని వెల్లడించింది. ఆసియాలో 200 కోట్ల మంది తీవ్రంగా ప్రభావితం అవుతారని పేర్కొంది. భూగోళంపై అత్యధికంగా మంచు నిల్వ ఉన్న మూడో అతిపెద్ద ప్రాంతం హిమాలయాలే. కాలుష్యం, ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల ఇక్కడి హిమానీనదాలు(గ్లేసియర్స్) వేగంగా కరిగిపోతున్నాయి. ఎగువ హిమాలయాల్లో ఇప్పటికే మంచు చాలావరకు మాయమైంది. 2013 నుంచి 2022 వరకు ఇండియాలో 44 శాతం ప్రకృతి విపత్తులకు హిమగిరుల్లో మంచు కరగడమే కారణమని ఇండియా పర్యావరణ నివేదిక-2024 వివరించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో, ప్రధానంగా హిమాలయ రాష్ట్రాల్లో వరదలు, పెను తుఫాన్లు, కొండ చరియలు విరిగిపడడం వంటి విపత్తులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నట్లు ఈ నివేదిక గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. మనమంతా పర్యావరణ సంక్షోభం అంచున ఉన్నట్లు అర్థం చేసుకోవచ్చు. హిమాలయాల్లో మంచు కరిగిపోతుండడంతో విలువైన వృక్ష సంపద అంతరించిపోతున్నట్లు పలు పరిశోధనల్లో తేలింది. ప్రతి పదేళ్లకు 54 మీటర్ల మేర వృక్షాలు కనుమరుగు అవుతున్నట్లు వెల్లడయ్యింది. నిత్యం మంచుతో గడ్డకట్టుకొని ఉండే ప్రాంతాలు సైతం మాయమవుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ భాగంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. 2004 నుంచి 2020 వరకు 8,340 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మంచు కరిగింది. అదంతా మైదాన ప్రాంతంగా మారిపోయింది. హిమాలయాల్లో 40 శాతం మంచు ఇప్పటికే కరిగిపోయిందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే 2100 నాటికి 75 శాతం మంచు కనిపించకుండా పోతుందని ఇండియా పర్యావరణ నివేదిక హెచ్చరించింది. ఈ మహావిపత్తును నివారించాలంటే వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెడ్ డెవలప్‌మెంట్(ఐసీఐఎంఓడీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇజబెల్లా కొజీల్ సూచించారు. అత్యవసర, నిర్ణయాత్మక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. హిమాలయ పర్యావరణ, జీవావరణ వ్యవస్థపై కోట్ల మంది జీవితాలు ఆధారపడి ఉన్నాయని గుర్తుచేశారు. మన ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలని, హిమాలయాలను కాపాడుకోకపోతే మానవాళి మనుగడకు ప్రమాదం తప్పదని స్పష్టం చేశారు.



ప్రమాదంలో డూమ్స్ డే గ్లేసియర్

అంటార్కిటికా ఖండం పశ్చిమ భాగంలోని డూమ్స్ డే హిమానీనదం(థ్వాయిట్స్ గ్లేసియర్) మనుగడ ముప్పును ఎదుర్కొంటోంది. గత 80 ఏళ్లలో ఏకంగా 50 బిలియన్ టన్నుల మంచును కోల్పోయింది. ప్రస్తుతం 130 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ గ్లేసియర్ క్రమంగా కరిగిపోతోంది. కొత్తగా వచ్చిచేరే మంచు కంటే కరిగిపోతున్నదే ఎక్కువ. మరికొన్నేళ్లలో పూర్తిగా అంతమైనా ఆశ్చర్యం లేదని పరిశోధకులు చెబుతున్నారు. ఇటీవలే ఈ హిమానీనదంపై అధ్యయనం చేశారు. నమూనాలు సేకరించి విశ్లేషించారు. ఎల్-నినో ప్రభావం కారణంగా భూమి వేడెక్కుతుండడంతో డూమ్స్‌డే గ్లేసియర్ కరిగిపోతున్నట్లు గుర్తించారు. ఈ పరిణామం 80 సంవత్సరాల క్రితం.. 1940వ దశకంలోనే మొదలైందని, 1970వ దశకంలో వేగం పుంజుకుందని తేల్చారు. అంటార్కిటికా ఖండంలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో హిమానీనదం కరిగిపోయే రేటు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నట్లు సైంటిస్టులు స్పష్టం చేశారు. పశ్చిమ అంటార్కిటికాలో మంచు ఫలకాల స్థిరత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం తోడ్పడుతుందని భావిస్తున్నారు. డూమ్స్ డే గ్లేసియర్ కీలకమైన ప్రదేశంలో ఉంది. ఇది పూర్తిగా కరిగిపోతే పశ్చిమ అంటార్కిటికా నుంచి సముద్రంలోకి మరింత నీరు చేరుతుంది. ఫలితంగా సముద్ర మట్టం 65 సెంటీమీటర్ల వరకు పెరిగే ప్రమాదం ఉంది. అదే జరిగితే లోతట్టు ప్రాంతాలు మునిగిపోతాయి. జల విధ్వంసం తప్పదు.



\- సాక్షి, నేషనల్ డెస్క్

కొత్త ప్రభుత్వం ఏర్పడుతూనే... 100 రోజుల అజెండా!

మంత్రివర్గ సహచరులతో మోదీ భేటీ | 'వికసిత్ భారత్'పై మేధోమథనం | దార్శనిక పత్రంపై సుదీర్ఘంగా చర్చ

న్యూఢిల్లీ: 'వికసిత్ భారత్: 2047' దార్శనిక పత్రంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మేధోమథనం నిర్వహించారు. ఆయన ఆదివారం తన సహచర మంత్రులతో సమావేశమయ్యారు. '2047 నాటికి వికసిత్ భారత్' అనే లక్ష్య సాధన కోసం రాబోయే ఐదేళ్లలో అనుసరించాల్సిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా 100 రోజుల అజెండాను మోదీ తెరపైకి తీసుకొచ్చినట్లు సమాచారం. రాబోయే మే నెలలో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 100 రోజుల్లో అమలు చేయాల్సిన అజెండాపై ఆయన చర్చించారు. దీనిపై కొందరు మంత్రులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రివర్గ భేటీలో కొన్ని కీలక అంశాలపై ప్రజంటేషన్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందాలని, ఘన విజయమే లక్ష్యంగా పని చేయాలని సహచర మంత్రులకు మోదీ సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమంతోపాటు దేశ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ 370కిపైగా స్థానాలు, ఎన్డీయే 400కుపైగా స్థానాలు గెలుచుకుంటాయని మరోసారి ధీమా వ్యక్తం చేశారు.

రోడ్‌మ్యాప్ సిద్ధం

ప్రధాని మోదీ లక్ష్యానికి అనుగుణంగా 'వికసిత్ భారత్' సాధన కోసం రోడ్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. ఇందుకోసం గత రెండున్నరేళ్లలో వివిధ స్థాయిల్లో 2,700 సమావేశాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు నిర్వహించినట్లు తెలిపాయి. 20 లక్షల మంది యువతీ యువకుల నుంచి సలహాలు సూచనలు అందినట్లు పేర్కొన్నాయి. ఈ రోడ్ మ్యాప్ ఆర్థిక వృద్ధి, అభివృద్ధి లక్ష్యాలు, సులభతర జీవనం, సులభతర వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలతో కూడిన ఒక సమగ్ర బ్లూప్రింట్ అని అధికారులు స్పష్టం చేశారు.



10 రోజులు.. 29 కార్యక్రమాలు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాని మోదీ రాష్ట్రాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. రాబోయే 10 రోజుల్లో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేయబోతున్నారు. ఆ సందర్భంగా మొత్తం 29 కార్యక్రమాల్లో పాల్గొంటారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు అనేక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జమ్మూకశ్మీర్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఢిల్లీలో మోదీ పర్యటిస్తారని అధికార వర్గాలు ఆదివారం పేర్కొన్నాయి. మోదీ సోమవారం తెలంగాణలో పర్యటించనున్నారు.

మరో మూడు ప్రైమరీలు

అధ్యక్ష అభ్యర్థిత్వానికి చేరువగా ట్రంప్

కొలంబియా(యూఎస్): అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం డొనాల్డ్ ట్రంప్‌కు దాదాపుగా ఖాయమైనట్టే. తాజాగా మిస్సోరీ, ఐదహో, మిషిగన్ ప్రైమరీల్లో ఆయన విజయం సాధించారు. ఆయనకు మద్దతు పలికిన డెలిగేట్ల సంఖ్య 244కు పెరిగింది. ప్రత్యర్థి నిక్కీ హేలీ కేవలం 24 డెలిగేట్ల మద్దతుతో చాలా వెనుకంజలో ఉన్నారు. రిపబ్లికన్ అభ్యర్థిత్వం దక్కాలంటే 1,215 డెలిగేట్ల మద్దతు కావాలి. మిషిగన్ రాష్ట్ర ప్రైమరీలో 68 శాతం ఓట్లు ట్రంప్‌కు, 27 శాతం ఓట్లు హేలీకి పడ్డాయి. మంగళవారం జరగబోయే 16 ప్రైమరీల ఫలితాలతో రిపబ్లికన్, డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థులు దాదాపు తేలిపోనున్నారు. మొత్తం డెలిగేట్లలో మూడింట ఒక వంతు మంది ఆ రోజున తమ పార్టీ తరఫున అభ్యర్థిగా ఎవరు ఉండాలనేది ఓటేసి నిర్ణయిస్తారు. ఇప్పటివరకు కొనసాగిన ట్రంప్ అజేయ జైత్రయాత్ర చూస్తుంటే బైడెన్‌కు పోటీగా బరిలో దిగే రిపబ్లికన్ అభ్యర్థి ట్రంపేనని దాదాపు ఖరారైనట్టు కన్పిస్తోంది.



పట్నాలో జన్‌విశ్వాస్ ర్యాలీలో ఏచూరి, ఖర్గే, లాలు, రాహుల్, తేజస్వి, అఖిలేశ్

ఇండియా కూటమి ఎన్నికల భేరి

కాంగ్రెస్‌కు గరిష్ట సీట్లు ఖాయం: ఖర్గే

- పట్నా జన్‌విశ్వాస్ ర్యాలీ బలప్రదర్శన
- ప్రసంగించిన ఆర్జేడీ చీఫ్ లాలూ
- పాల్గొన్న వామపక్ష పార్టీల నేతలు

పట్నా: ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు బిహార్ రాజధాని పట్నా వేదికగా ఎన్నికల ప్రచార నగారా మోగించారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ సారథ్యంలో ఆదివారం జరిగిన 'జన్ విశ్వాస్ మహా ర్యాలీ'లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే ప్రసంగిస్తూ..రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్టంగా సీట్లు కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతలపై ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలను ఉసిగొల్పుతూ దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. వాటిని చూసి తాము భయపడటం లేదని చెప్పారు. దేశ సంపదను, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. కేవలం ఇద్దరు, ముగ్గురు బడా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలను కాపాడుతున్న మోదీ ప్రభుత్వం, దేశ జనాభాలో 73 శాతం మేర ఉన్న వెనుకబడిన వర్గాలు, దళితులను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్ ప్రసంగిస్తూ.. ఇటీవల తమను వదిలేసి ఎన్డీఏ పక్షంలో చేరిన సీఎం నితీశ్‌పై మండిపడ్డారు. వచ్చే ఎన్నికల కోసం సిద్ధం కావాలంటూ ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. 'కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేలా మీలో నైతిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు నేను ఇక్కడే ఉంటాను'అని పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ..యూపీ, బిహార్‌లలో కలిపి 120 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీని ఓడిస్తే కేంద్రంలో ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. వామపక్ష పార్టీల నేతలు సీతారాం ఏచూరి, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య కూడా ర్యాలీలో ప్రసంగించారు.


రైల్వేపై రాహుల్ విమర్శలు

కేంద్ర ప్రభుత్వం ధనికులను మాత్రమే దృష్టిలో పెట్టుకుని రైల్వే విధానాలను రూపొందిస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని మోదీని నమ్మితే నమ్మకద్రోహం గ్యారెంటీ అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''డైనమిక్ ఫేర్ పేరుతో ఏటా 10 శాతం చొప్పున రైలు చార్జీలను ప్రభుత్వం పెంచుతోంది. క్యాన్సిలేషన్ చార్జీలను, ప్లాట్‌ఫాం టిక్కెట్ల ధరలను సైతం పెంచింది'' అని విమర్శించారు.

హౌతీల క్షిపణి దాడులతో.. ఎర్ర సముద్రంలో నౌక మునక

దుబాయ్: హౌతీ మిలిటెంట్ల క్షిపణి దాడిలో దెబ్బతిన్న మొట్టమొదటి వాణిజ్య నౌక ఎర్ర సముద్రంలో మునిగిపోయింది. గాజాలో హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం సాగిస్తున్న దాడులకు నిరసనగా యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలోని వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 18వ తేదీన బాబ్ ఎల్ మండెల్ సింధుశాఖ వద్ద రుబీమర్ అనే నౌకపైకి హౌతీలు క్షిపణులను ప్రయోగించారు. దీంతో, ఆ నౌక దెబ్బతినడంతో అందులోని సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆ నౌక నుంచి ఇంధన లీకవుతూ క్రమేపీ మునిగిపోతూ వచ్చింది. శనివారం మధ్యాహ్నానికి రుబీమర్ పూర్తిగా నీట మునిగినట్లు యెమెన్ అధికారులు ధ్రువీకరించారు.

పాక్ ప్రధానిగా షహబాజ్



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రిగా పీఎంఎల్-ఎన్ నేత షెహబాజ్ షరీఫ్(72) ఎన్నికయ్యారు. నూతన ప్రధానిని ఎన్నుకోవడానికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 336 ఓట్లకుగాను షహబాజ్ షరీఫ్‌కు 201 ఓట్లు లభించాయి. ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోని పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ అభ్యర్థి ఒమర్ అయూబ్ ఖాన్‌కు కేవలం 92 ఓట్లు దక్కాయి. షెహబాజ్ షరీఫ్‌కు సాధారణ మెజార్టీ కంటే 32 ఓట్లు అధికంగా లభించడం విశేషం. పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్(పీఎంఎల్-ఎన్), పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) సంకీర్ణ ప్రభుత్వానికి ఆయన నాయకత్వం వహించబోతున్నారు. పీఎంఎల్-ఎన్, పీపీపీ కూటమికి ముత్తహిదా ఖ్వామీ మూవ్‌మెంట్, పాకిస్తాన్ ముస్లిం లీగ్(ఖ్యూ), బలూచిస్తాన్ అవామీ పార్టీ, పాకిస్తాన్ ముస్లిం లీగ్(జెడ్), ఇస్తెఖామ్-ఇ-పాకిస్తాన్ పార్టీ, నేషనల్ పార్టీ మద్దతిస్తున్నాయి. షహబాజ్ షరీఫ్ పాకిస్తాన్ 24వ ప్రధానమంత్రిగా ఎన్నికైనట్లు పార్లమెంట్ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ ప్రకటించారు. షహబాజ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు ప్రధానమంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఓటింగ్ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులైన కొందరు ఎంపీలు సభలో అలజడి సృష్టించారు. అనంతరం షహబాజ్ మాట్లాడుతూ కశ్మీర్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. కశ్మీరీల, పాలస్తీనియన్ల స్వాతంత్ర్యం కోసం ఒక్కటి కావాలని ఎంపీలకు పిలుపునిచ్చారు. వారి స్వేచ్ఛను కోరుతూ పార్లమెంట్‌లో తీర్మానం చేయాలన్నారు.

రాజకీయాలకు గుడ్‌బై

బీజేపీ ఎంపీ హర్ష్ వర్ధన్



న్యూఢిల్లీ: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దిగనున్న అభ్యర్థుల తొలిజాబితాను బీజేపీ ప్రకటించిన మరుసటి రోజే రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్. హర్ష్ వర్ధన్ ప్రకటించారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీ పరిధిలోని చాంద్‌నీచౌక్ స్థానం నుంచి సిట్టింగ్ బీజేపీ ఎంపీగా కొనసాగుతున్నారు. శనివారం బీజేపీ విడుదలచేసిన తొలి జాబితాలో ఈయన పేరు లేదు. అందుకే ఈయన రాజకీయాలను వదిలేస్తున్నట్లు వార్తలొచ్చాయి. ఈ సందర్భంగా ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. '' 50 ఏళ్ల క్రితం కాన్పూర్‌లో ఎంబీబీఎస్‌లో చేరా. పేదలకు సేవచేశా. 30 ఏళ్ల పైబడిన రాజకీయ జీవితంలో ఐదు సార్లు శాసనసభ, రెండు సార్లు పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచా. మళ్లీ ఇన్నాళ్లకు నా మూలాల్లోకి వెళ్లిపోతా'' అన్నారు. ఢిల్లీ పరిధిలో నలుగురు సిట్టింగ్ ఎంపీలు పర్వేశ్ శర్మ, రమేశ్ బిధూరి, మీనాక్షి లేఖీ, హర్ష్‌వర్ధన్‌లను కాదని కొత్త వారికి బీజేపీ అవకాశమిస్తూ వారి పేర్లను తొలి అభ్యర్థుల జాబితాల చేర్చడం తెల్సిందే.

నేను పోటీచేయలేను: పవన్ సింగ్

పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ ఎంపీ స్థానం నుంచి తనను బీజేపీ అభ్యర్థిగా నిలబెట్టినప్పటికీ తాను మాత్రం పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు బీజేపీ నేత పవన్ సింగ్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. '' నేనైతే పోటీ నుంచి వైదొలగుతున్నా. ఎందుకు పోటీ చేయట్లేను అనే కారణాలను వెల్లడించలేను' అని భోజ్‌పురీ గాయకుడు, నటుడు అయిన పవన్ సింగ్ స్పష్టంచేశారు. అసన్‌సోల్‌లో బీజేపీ ముందే ఓడిందంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎద్దేవాచేసింది.

అతివాద బోధకులకు బ్రిటన్‌లోకి నో ఎంట్రీ

లండన్: పాకిస్తాన్, ఆఫ్గానిస్తాన్, ఇండోనేసియా వంటి దేశాల నుంచి అతివాద ఇస్లామిస్ట్ విద్వేష ప్రబోధకులను దేశంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవాలని బ్రిటిష్ ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేసిందని 'డైలీ టెలీగ్రాఫ్' తెలిపింది. తీవ్రవాద కార్యకలాపాలు ఊహించని రీతిలో పెరుగుతుండటం పట్ల బ్రిటిష్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. విదేశాల నుంచి వచ్చే అతివాద మత ప్రబోధకులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారి పేర్లను వీసా హెచ్చరిక జాబితాలో చేరుస్తారు. వీరికి దేశంలోకి ప్రవేశించే దారులు మూసుకుపోతాయని 'డైలీ టెలీగ్రాఫ్' పేర్కొంది.

వారిని డార్లింగ్ అనడం లైంగిక వేధింపే

- పరిచయం లేని మహిళ విషయంలో అది శిక్షార్హమైన నేరమే
- తేల్చిచెప్పిన హైకోర్టు

కోల్‌కతా: పూటుగా తాగి మహిళా కానిస్టేబుల్‌ను డార్లింగ్ అని పిలిచిన ఓ వ్యక్తిని దోషిగా తేలుస్తూ కలకత్తా హైకోర్టు తీర్పు వెలువరించింది. పరిచయం లేని మహిళను అలా పిలవడాన్ని 'లైంగిక వేధింపు నేరం'గా పరిగణిస్తామని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ సందర్భంగా ఇదే కేసులో గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 354ఏ (మహిళా గౌరవాన్ని భంగపరచడం), 509 సెక్షన్ల కింద అతడిని దోషిగా తేల్చింది. మహిళా కానిస్టేబుల్‌ను మద్యం మత్తులో డార్లింగ్ అని పిలిచిన జనక్ రామ్ అనే వ్యక్తికి గతంలో పడిన శిక్షను సమర్థిస్తూ జస్టిస్ జై సేన్ గుప్తా నేతృత్వంలోని ఏకసభ్య హైకోర్టు ధర్మాసనం తాజా తీర్పును వెలువరించింది. '' పరిచయంలేని మహిళను తాగిన/తాగని వ్యక్తి నడి వీధిలో డార్లింగ్ అనే పిలిచే ధోరణి భారతీయ సమాజంలో లేదు. నిందితుడు మద్యం మత్తులో ఉంటే అప్పుడు నేరాన్ని మరింత తీవ్రమైనదిగా పరిగణిస్తాం' అని జడ్జి వ్యాఖ్యానించారు. అండమాన్ నికోబార్ ద్వీపంలోని మాయాబందర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనాన్ని అదుపు చేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను 'చలాన్ వేయడానికి వచ్చావా డార్లింగ్?' అంటూ జనక్‌రామ్ వేధించాడు.

రేపు నా రాజీనామా: జస్టిస్ అభిజిత్

కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ మంగళవారం రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. విద్యా సంబంధమైన పలు అంశాలపై ఈయన వెలువరించిన తీర్పులు ఇటీవల తీవ్ర రాజకీయ చర్చలకు దారితీశాయి. ఆదివారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో ప్రవేశించాలని అనుకుంటున్నారా అన్న ప్రశ్నకు ఆయన మంగళవారం రాజీనామా పత్రం సమర్పించాక అన్ని విషయాలను మీడియాతో పంచుకుంటానంటూ బదులిచ్చారు. రాజీనామా లేఖను మంగళవారం మొదటగా రాష్ట్రపతికి, లేఖ ప్రతులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపిస్తానన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ, ప్రభుత్వ సాయం అందుకునే, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ దర్యాప్తు జరపాలంటూ ఈడీ, సీబీఐలకు ఆదేశాలిచ్చారు.

కేంద్రానికి 'యాంటీ పంజాబ్' సిండ్రోమ్

లూధియానా: పంజాబ్ వ్యతిరేకత అనే రుగ్మతతో బాధపడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో శిక్షించాలని ఆప్ అగ్రనేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో తమ పార్టీకి విజయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా పంజాబ్ శకటాన్ని కేంద్రం నిరాకరించడం పంజాబీలను అవమానించడమేనన్నారు. దేశం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన పంజాబ్ అమరులకు కేంద్రం నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు. బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో కేంద్రం మితిమీరి జోక్యం చేసుకుంటూ పాలన సజావుగా సాగకుండా ఆటంకాలు కలిగిస్తోందని విమర్శించారు. ఆదివారం ఆయన లూధియానాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో తనను ఇబ్బందులు పెడుతున్న కేంద్రాన్ని అడ్డుకోగలిగానన్నారు. ఇక్కడ సీఎం మాన్ కేంద్రం, బీజేపీ, గవర్నర్‌ల వైఖరితో పోరాటం సాగిస్తున్నారని చెప్పారు.

మేం మీ కీలు బొమ్మలం కాదు

తైపీ: తైవాన్ విదేశాంగ మంత్రి భారత మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై తైవాన్ ఘాటుగా స్పందించింది. 'తైవాన్, భారత్ మీ తొత్తులు కాదు. స్వేచ్ఛాయుత మీడియా కలిగిన స్వతంత్ర ప్రజాస్వామ్య దేశాలు' అంటూ దీటుగా బదులిచ్చింది. తైవాన్ విదేశాంగ మంత్రి జోసెఫ్ వూ 'ఇండియా టుడే'టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ ఫిబ్రవరి 29న ప్రసారమైంది. ఇందుకు నిరసనగా భారత్‌లోని చైనా రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దాంతో, పొరుగు దేశాలను వేధించడం మాని దెబ్బతిన్న సొంత ఆర్థిక వ్యవస్థను గురించి ఆలోచించుకోవాలంది.

వాట్సాప్ నుంచి వేరే యాప్‌లకూ మెసేజ్‌లు!



న్యూఢిల్లీ: ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను తీసుకొస్తూ వినియోగదారులకు అనువుగా యాప్‌లో మార్పులు చేస్తున్న 'వాట్సాప్' త్వరలో మరో ఫీచర్‌ను జతచేయనుంది. ఇకపై వాట్సాప్ నుంచి సిగ్నల్, టెలిగ్రామ్ వంటి ఇతర యాప్‌లకూ మెసేజ్‌లను పంపుకోవచ్చు. దీనికి అనువుగా కొత్త ఫీచర్‌ను వాట్సాప్‌లో త్వరలో తీసుకురానున్నారు. దీంతో ఇతర సామాజిక మాధ్యమాల వేదికలపైనా వాట్సాప్ నుంచి మెసేజ్‌లను షేర్ చేసుకోవచ్చు. ఇతర చాట్స్ కోసం ప్రత్యేకంగా, విడిగా ఒక చాట్ ఇన్‌ఫో స్క్రీన్ ఒకటి కనిపించేలా ఫీచర్‌ను వాట్సాప్ సిద్ధంచేస్తోంది. ఈ కొత్త ఫీచర్‌కు తుది మెరుగులు దిద్ది అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ నిపుణులు తలమునకలైనట్లు తెలుస్తోంది. వాట్సాప్‌తో మెసేజ్‌ల షేరింగ్‌లపై సిగ్నల్, టెలిగ్రామ్ యాప్‌లు ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదని వాబేటాఇన్ఫో అనే సంస్థ స్పష్టంచేసింది. ఏఏ యాప్‌లతో అనుసంధానం అవ్వాలనేది ఆయా వాట్సాప్ యూజర్ల స్వీయనిర్ణయం, స్వీయ నియంత్రణ పైనే ఆధారపడి ఉంటుంది కాబట్టి వ్యక్తిగత భద్రతకు భంగం వాటిల్లదని వివరించింది. బీటీ వెర్షన్‌ను టెస్ట్‌చేస్తున్న కొన్ని సెలక్ట్ చేసిన గ్రూప్‌లకు మాత్రమే ఈ వాట్సాప్ ప్రొఫైల్ స్క్రీన్‌షాట్ అడ్డుకునే ఫీచర్ అందుబాటులో ఉంది. మరి కొద్ది వారాల్లో ఈ ఫీచర్‌ను యూజర్లు అందరికీ అందుబాటులోకి తేనున్నారు.

బీఎస్‌ఎఫ్‌లో తొలి మహిళా స్నైపర్

సుమన్ కుమారి ఘనత



షిమ్లా: సుదూరంగా మాటువేసి గురిచూసి షూట్‌చేసే 'స్నైపర్' విధుల్లో చేరి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమారి చరిత్ర సృష్టించనున్నారు. సరిహద్దు భద్రతా దళం(బీఎస్‌ఎఫ్)లో తొలి స్నైపర్‌గా కుమారి పేరు రికార్డులకెక్కనుంది. ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్(సీఎస్‌డబ్ల్యూటీ)లో ఎనిమిది వారాల కఠోర శిక్షణను కుమారి విజయవంతంగా పూర్తిచేసుకున్నారు. దీంతో శిక్షణలో ఆమె ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్ సాధించారు. బీఎస్‌ఎఫ్‌లో స్నైపర్ బాధ్యతలు అప్పజెప్పనున్నారు. కుమారి 2021లో బీఎస్‌ఎఫ్‌లో చేరారు. నిరాయుధంగా శత్రువుతో పోరాడే 'నిరాయుధ దళం'కు గతంలోనే ఆమె ఎంపికయ్యారు. పాకిస్తాన్ సరిహద్దుల వెంట మాటువేసి అదనుచూసి చొరబాట్లకు తెగబడే ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో స్నైపర్‌లది కీలక పాత్ర.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం • 4 • మార్చి • 2024



బాలానందం
మైసూరులోని జలదర్శిని అతిథి గృహ ప్రాంగణం పుష్పాల చెట్లతో కనువిందు దృశ్యం. ఆహ్లాద పరిసరాలలో బాలల చిందులు

న్యూస్‌రీల్

ఉత్సాహంగా బీజేపీ ర్యాలీ



శని మహాత్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపురం పార్లమెంటరీ నియోజక వర్గంలో ఆదివారం బీజేపీ నేతలచే విజయ సంకల్ప యాత్ర కార్ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు యలహంకలో మొదలైన ర్యాలీలో సుమారు 500కు పైగా కార్లు పాల్గొన్నాయి. కార్యకర్తలు మరోమారు ప్రధాని మోదీ అని వినాదాలు చేశారు. గౌరిబిదనూరులో శని మహాత్ముని ఆలయంలో యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్, ఆయన కుమారుడు అలోక్ పూజలు నిర్వహించారు. విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ హైకమాండ్ ఎవరికి టికెట్ ఇచ్చినా మేము వారికి మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు. యువతను సంఘటితం చేయడం కోసం ఈ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. తాను కూడా చిక్క ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు అలోక్ చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై సర్కారు మెతక ధోరణి: అశోక్

శివాజీనగర: సంఘ విద్రోహ శక్తులు, ఉగ్రవాద సంస్థలపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుభూతి భావాన్ని ప్రదర్శించడం ప్రమాదకరమని బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ అన్నారు. ఆదివారం మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. విధానసౌధలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేయడం, రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడు కేసులో ప్రభుత్వ వైఖరి ఆందోళనకరంగా ఉంది. దేశ విద్రోహ శక్తులనే సమర్థిస్తోంది. మైనార్టీల మెప్పు కోసం ప్రవర్తిస్తోందని దుయ్యబట్టారు. విధానసౌధలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసినవారిని ఇప్పటివరకూ అరెస్టు చేయలేదన్నారు. అప్పుడు పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. వీడియోల ఫోరెన్సిక్ నివేదికను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భారత్ బియ్యం క్షణాల్లో ఖాళీ



బియ్యం లారీ వద్ద క్యూ కట్టిన ప్రజలు

చింతామణి: చింతామణి పట్టణంలో భారత బ్రాండ్ బియ్యం విక్రయాలు జరగ్గా, ప్రజలు పెద్దఎత్తున క్యూలో నిలబడి కొనుగోలు చేశారు. కేజీ రూ. 29 చొప్పున 10 కేజీల మూటను రూ.290కి కొనుగోలు చేశారు. పట్టణంలోని కెఎండీ కళ్యాణ మండపం దగ్గర లారీ లోడు గంటలోనే ఖాళీ అయ్యింది.

విమానాశ్రయంలో బంగారం సీజ్

యశవంతపుర: మంగళూరు విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న రూ.46 లక్షల విలువగల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన కాసరగోడ్‌వాసి డ్రాయర్‌లో బంగారాన్ని దాచాడు. కస్టమ్స్ అధికారులు తనిఖీలలో రూ.46 లక్షల విలువగల 24 క్యారెట్ల 729 గ్రాముల పసిడి లభించింది. ప్రయాణికున్ని అదుపులోకి తీసుకున్నారు.

కన్న కొడుకు కిరాతకం

- ఆస్తి, పింఛన్ కోసం తల్లిని కొట్టి చంపిన వైనం
- అనంతరం తాను ఆత్మహత్య



తల్లి కొడుకు రాజేంద్ర, శారద (ఫైల్)

హుబ్లీ: కన్నతల్లి పాలిట ఆ కొడుకు కర్కోటకుడిగా మారాడు. నిత్యం అమ్మను వేధిస్తూ చివరికి ఆమెను చంపి తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన ధార్వాడ హొసయల్లాపురలోని ఉడుపి నగరలో ఆదివారం వెలుగు చూసింది. శారద భజంత్రి (60) హత్యకు గురైన మహిళ. ఆమె కుమారుడు రాజేంద్ర (40) నిందితుడు. రాజేంద్ర డబ్బుల కోసం తల్లిని తరచూ వేధించేవాడు. తల్లికి వస్తున్న పింఛన్, ఆస్తిపై కన్నేశాడు. ఆస్తిని తన పేరుతో రాసివ్వాలని తల్లిని వేధించేవాడు. ఆమె నిరాకరించేది. ఈ క్రమంలో ఆస్తి విషయంగా మరోసారి ఘర్షణ పడ్డారు. తీవ్ర ఆగ్రహానికి లోనైన రాజేంద్ర తల్లిని ఇనుప రాడ్‌తో కొట్టి చంపేశాడు. తల్లి మరణించడంతో దిక్కుతోచక తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నట్లు ధార్వాడ నగర పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దుస్తులు, బస్సులు... మారుస్తూ పరారీ!



- బెంగళూరు కెఫె పేలుడు కేసులో నిందితుని మాస్టర్ ప్లాన్
- సీసీ కెమెరాలకు చిక్కకుండా తీవ్ర ప్రయత్నాలు
- రాష్ట్రం దాటిపోయి ఉంటాడని అనుమానం
- విచారణకు ఇతర రాష్ట్రాల పోలీసుల సాయం



ఈ నిందితుని కోసం విస్తృతంగా గాలింపు

బనశంకరి: సిలికాన్ సిటీలో వైట్‌ఫీల్డ్ కుందలహళ్లిలో సంచలనం రేకెత్తించిన రామేశ్వరం కెఫె బాంబ్ పేలుడు కేసులో ప్రముఖ నిందితుడు పోలీసులను దారి తప్పించడానికి మాస్టర్ ప్లాన్ వేసినట్లు దర్యాప్తులో వెలుగు చూసింది. బాంబు పెట్టడానికి వెళ్లినప్పుడు షర్ట్‌పై మరొక షర్ట్ వేసుకుని, పరారీ సమయంలో దుస్తులు మార్చేశాడు. అంతేగాక అనేక బీఎంటీసీ బస్సులు మారుతూ ప్రయాణించాడు. తద్వారా సీసీ కెమెరాలకు తన ఆనవాళ్లు చిక్కకుండా ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. టికెట్ తీసుకోకుండా బీఎంటీసీ బస్సులో ప్రయాణించిన నిందితుడు ఒక బస్ ఎక్కి ముందు బస్టాప్‌లో దిగి, మరో బస్ ఎక్కి మళ్లీ మరో స్టాప్‌లో దిగాడు. ఇలా 15 కు పైగా బస్సుల్లో అతను టికెట్ తీసుకోకుండా సంచరించాడు. దుస్తులు మార్చడంతో పాటు అనేక బస్సులు మారుతూ ప్రయాణించిన అనుమానిత వ్యక్తి బయటి రాష్ట్రాలకు పారిపోయినట్లు అంచనా వేస్తున్నారు.

మూడు రాష్ట్రాల్లో గాలింపు

బాంబు బ్లాస్ట్ ఉగ్ర కార్యకలాపాల దర్యాప్తులో పేరు పొందిన మహారాష్ట్ర, తెలంగాణ ఉగ్రవాద వ్యతిరేక పోలీసు విభాగాలను బెంగళూరు పోలీసులు నిరంతరం సంప్రదిస్తున్నారు. తెలంగాణ పోలీసు బృందం కెఫెను పరిశీలించి నమూనాలను తీసుకెళ్లినట్లు తెలిసింది. తమిళనాడు, కేరళ, తెలంగాణలో మకాం వేసిన బెంగళూరు పోలీసులు అతని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

ఒకటిన్నర గంట తరువాత పేలిపోయేలా

దుండగుడు బాంబు పెట్టి ఒకటిన్నర గంట తరువాత పేలేలా టైమ్‌ని నిర్ధారించాడు. బెంగళూరు నుంచి తమిళనాడుకు పారిపోయి ఉండవచ్చని తెలిసింది. రామేశ్వరం కెఫె నుంచి బెంగళూరును ఆనుకుని ఉన్న తమిళనాడు హోసూరు బార్డర్‌కు వెళ్లడానికి 59 నిమిషాలు పడుతుంది. ఒకవేళ ట్రాఫిక్ రద్దీ ఉంటే గంట 15 నిమిషాల్లో చేరుకోవచ్చుననే ఉద్దేశంతో ఒకటిన్నర గంట సమయాన్ని ఫిక్స్ చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆలోగా బెంగళూరును వదిలిపెట్టవచ్చని దుండగుడు ఆలోచించాడు. రామేశ్వరం కెఫె నుంచి తమిళనాడు బార్డర్ వరకు అన్ని సీసీ కెమెరాలు పోలీసులు పరిశీలిస్తున్నారు. కెఫె నుంచి వైట్‌ఫీల్డ్‌కు వెళ్లిన సమాచారం ఉందని, అక్కడి నుంచి చెన్నసంద్ర ద్వారా సర్జాపుర, అత్తిబెలెకు పారిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కెఫె మేనేజర్ ఏమన్నాడు

రామేశ్వరం కెఫె మేనేజర్ హరిహరన్.. బాంబు పెట్టి పారిపోయిన వ్యక్తిని చూశానని తెలిపారు. సాధారణ వ్యక్తి లాగా వచ్చి సాంబారు ఇడ్లీ తీసుకుని ఒకచోట కూర్చున్నాడని, కొద్దిసేపటికి అతను అదృశ్యమయ్యాడని, అతను కూర్చున్న స్థలంలో చిన్నపాటి టిఫిన్ బాక్సు ఉందని పోలీసులకు తెలిపాడు. కొంతసేపటికి అది పేలిపోయి విధ్వంసం సృష్టించింది. సీసీబీ పోలీసులు కొంతమంది అనుమానితులను అదుపులోకి తీవ్ర విచారణ చేపడుతున్నారు. ఆడుగోడి టెక్నికల్ సెల్‌లో ప్రశ్నిస్తున్నారు. ఈశాన్య విభాగం డీసీపీ లక్ష్మీనారాయణ్ విచారణలో పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా రామేశ్వరం కెఫె

అన్ని కోణాల్లో దర్యాప్తు

- నగరవాసులు భయపడొద్దు: హోంమంత్రి

బనశంకరి: విధానసౌధలో పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసిన కేసులో ఎఫ్ఎస్ఎల్ నివేదిక అందిన వెంటనే తక్షణం బాధ్యులపై కఠిన చర్యలను తీసుకుంటామని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. ఆదివారం రామేశ్వరం కెఫె బాంబు పేలుడు ఘటనపై పోలీసు ఉన్నతాధికారులతో ఆయన భేటీ అయ్యారు. బాంబు పేలుడు నిందితుని దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి, వీటి ఆధారంగా దర్యాప్తు జరుగుతోంది, పలు పోలీస్ బృందాలు పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నాయి. త్వరలో నిందితున్ని అరెస్ట్‌చేస్తామని ఆయన చెప్పారు. ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ బృందాలు సైతం విచారణలో ఉన్నాయన్నారు. బెంగళూరు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, సేఫ్ సిటీగా చేసే ప్రయత్నం కొనసాగించాలన్నారు. డీసీపీలు తమ పరిధిలో గస్తీ, నిఘా సమాచారం సేకరించి భద్రతను పెంచాలని హోంమంత్రి సూచించారు. సమావేశంలో డీజీపీ అలోక్‌మోహన్, పోలీస్ కమిషనర్ బీ.దయానంద్, అదనపు పోలీస్ కమిషనర్లు, డీసీపీలు పాల్గొన్నారు.

అమ్మ, అంకుల్ రోజూ కొడతారు

- బాలునిపై అకృత్యం



యశవంతపుర: చిన్నారి కొడుకును కంటికి రెప్పలా పోషించాల్సిన తల్లి కిరాతకురాలిగా మారింది. బాలునికి చిత్రహింసలు పెట్టి ఇంటినే నరకం చేసింది. బెంగళూరు గిరినగర వీరభద్రేశ్వర నగరలో ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. చిన్నారి దయనీయ స్థితిని చూసి స్థానికులు చలించిపోయారు. భర్త నుంచి దూరంగా ఉంటున్న మహిళకు రెండేళ్ల పైబడిన కొడుకు ఉన్నాడు. ఆమె ఇంటిని రోజూ ప్రియుడు వచ్చేవాడు. ఈ సమయంలో ఇద్దరూ కలిసి బాలున్ని చేత్తో, వంట పాత్రలతో కొట్టి హింసించేవారు. ఇంట్లో ఉండవద్దంటూ బాలున్ని ఇంటి బయట పడేసేది. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు వెళ్లి చూడగా చిన్నారి తీవ్ర గాయాలతో కనిపించాడు. తనను అమ్మ, అంకుల్ రోజూ కొడతారని బాలుడు చెప్పగా చలించిపోయిన స్థానికులు మహిళపై ఆక్రోశం వ్యక్తం చేశారు. తాను పనికి వెళతానని, అందుకే బాలున్ని ఇంటి బయట ఉంచుతానని ఆమె చెప్పింది. స్థానికులు గిరినగర పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి బుద్ధిమాటలు చెప్పి పంపారు. బాలున్ని సంరక్షణ కోసం బాలల కమిషన్‌కు అప్పగించారు.

మరో తల్లి దాష్టీకం

బనశంకరి: నగరంలో హనుమంత నగరలోనూ ఇదే తరహా దారుణం చోటుచేసుకుంది. కుమారున్ని ఇంట్లో బంధించి ప్రియునితో కలిసి చితకబాది రాక్షసంగా ప్రవర్తించింది. నిన్ను సాకడం నా వల్ల కాదంటూ చిత్రహింసలకు గురిచేసింది. ఓ సేవాసంస్థ సిబ్బంది బాలునికి గృహ నిర్బంధం నుంచి విముక్తి కల్పించారు.

మృత్యుకూపమైన నీటికుంట



ముగ్గురిని బలిగొన్న నీటకుంట ఇదే

- ప్రమాదవశాత్తు పడి తల్లిదండ్రులు, కూతురు మృతి

కృష్ణరాజపురం: నీటి కుంటలో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లి జారిపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన సంఘటన బెంగళూరు గ్రామీణ జిల్లాలోని హొసకోటె పోలీసుస్టేషన్ పరిధిలోని కరిబీరనహోసహళ్లి గ్రామంలో జరిగింది. మృతులు మరియప్ప (65), ఇతని భార్య మునియమ్మ (60), కుమార్తె భారతి (40). వీరు కూలీ కార్మికులుగా పనిచేసేవారు. గ్రామంలో జరుగుతున్న ఉత్సవం చూడడానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కుంటలో కాళ్ళు కడుక్కుందామని దిగారు. కుమార్తె నీటి కుంటలో పడిపోగా, ఆమెను కాపాడటానికి తల్లి దండ్రి యత్నించి ఇద్దరూ దిగి నీటమునిగిపోయారు. ఈత రాకపోవడంతో బయటపడలేక మరణించినట్లు అనుమానాలున్నాయి. హొసకోటె పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.





మృతులు మరియప్ప, మునియమ్మ (ఫైల్)



కుమార్తె (ఫైల్)

రెండేళ్ల వయస్సులోనే గుర్తిస్తే వినికిడి సమస్య మాయం

బనశంకరి: ప్రారంభంలోనే శ్రవణదోషాలను గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉందని కర్ణాటక లోక్‌సేవా కమిషన్ మాజీ సభ్యురాలు, దివ్యాంగ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ మంగళశ్రీధర అన్నారు. ప్రపంచ శ్రవణ దినోత్సవం సందర్భంగా జేపీ.నగర రెండోస్టేజ్‌లోని ఉచిత శ్రవణ పరీక్షాకేంద్రాన్ని డాక్టర్ మంగళశ్రీధర ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో చెవుడు సమస్యను రెండేళ్ల వయసున్నప్పుడే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సంస్థ ముఖ్యులు ఎంఎస్‌జీ.నాయక్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాలునికి వినికిడి పరీక్షలు చేస్తున్న దృశ్యం

బెల్టుల పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

మండ్య: మండ్య తాలూకా తూబినకెరె పారిశ్రామిక వాడలోని బెల్ట్ తయారీ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకొని భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. హరి బెల్ట్ అండ్ కన్వెయర్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో శనివారం రాత్రి 43 మంది సిబ్బంది విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో భారీగా మంటలు చెలరేగాయి. ఒక యూనిట్‌లోని యంత్ర సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది 70 మంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే యంత్రాలు కాలిపోయాయి. ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



కాలిపోయిన యంత్రాలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బాలలకు బతుకు భరోసా



ఆదివారం ఉదయం బెళగావి జిల్లా సవదత్తిలో బాలలకు చుక్కల పంపిణీ



బెంగళూరు ఉత్తరలోని దొడ్డబనహళ్లిలో చిన్నారికి చుక్కలు

- రాష్ట్రంలో ముమ్మరంగా పోలియో చుక్కల పంపిణీ

శివాజీనగర: బాలలు వైకల్యం బారిన పడకుండా, సురక్షిత జీవితం కోసం రెండు చుక్కలు అనే నినాదంతో రాజధాని బెంగళూరుతో పాటుగా రాష్ట్రమంతటా పల్లె పల్లెలో పల్స్ పోలియో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఐదేళ్లలోపు బాలలకు పోలియో చుక్కల మందు పంపిణీ ఆరంభమైంది. రైల్వేస్టేషన్, బస్టాండ్, వివిధ కాలనీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, దేవాయాల, పాఠశాలలు, సముదాయ భవనాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది చుక్కల మందు పంపిణీ సాగించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ పిల్లలకు చుక్కలను వేయించాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించారు.



బెంగళూరులో పసిగుడ్డుకు చుక్కల రక్షణ

ఇప్పటికీ పోలియో ప్రమాదం

పోలియో నేటికీ కూడా ప్రపంచవ్యాప్తంగా పిల్లలను బాధిస్తోంది. ఇందులో భారతదేశం ఇరుగుపొరుగు దేశాలలో పోలియో కేసులు సంభవించడం మనదేశానికి ఆందోళనకరంగా ఉంది. అందుచేత పోలియో నిర్మూలనకు సామూహికంగా చుక్కల మందు పంపిణీ అవసరమైంది అని వైద్య నిపుణులు తెలిపారు. రెండురోజుల పాటు చుక్కల మందు పంపిణీ సాగించి, తరువాత ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందు వేస్తారు. ఇది మూడురోజులు కొనసాగుతుంది. సంచారజాతులు, మురికివాడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఏ బిడ్డ చుక్కల మందు నుంచి తప్పించుకోకుండా రాష్ట్రంలో 62 లక్షల మంది పిల్లలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సుమారు 33,712 సంచార బృందాలు పాల్గొన్నాయి.

కోతిజ్వరానికి మరొకరు బలి

యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లాలో కోతి జ్వరం వాయువేగంతో వ్యాపిస్తోంది. ఈ జ్వరం బారినపడి మరో వ్యక్తి మృతి చెందారు. శిరసి తాలూకా హత్తరగి నవిలగార కు చెందిన రామచంద్రగౌడ (68) అనే వృద్ధుడు కొన్నిరోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ ఉడుపి మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సలు ఫలించని కారణంగా ఆదివారం ఉదయం రామచంద్రగౌడ మరణించారు. గతంలో సిద్ధాపుర తాలూకాలో ఇద్దరు మహిళలు కోతిజ్వరంతో చనిపోవడం తెలిసిందే. జిల్లాలో ఇప్పటివరకు 47 మందికి కోతిజ్వరం సోకినట్లు వైద్యులు గుర్తించారు.

పురాతన ఆలయం ధ్వంసం

దొడ్డబళ్లాపురం: మంగళూరు జిల్లా ఉళ్లాలలో ప్రసిద్ధ పురాతన దేవాలయాన్ని రాత్రికి రాత్రి జేసీబీలతో ధ్వంసం చేశారు. కొండాణ క్షేత్రంలో ఉన్న పురాతన వైద్యనాథ దేవాలయాన్ని దుండగులు ధ్వంసం చేసి పరారయ్యారు. హిందూ సంఘాలు, భక్తులు పెద్ద సంఖ్యలో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉళ్లాల పోలీసులు కేసు నమోదుచేసి బందోబస్తు కల్పించారు.

చర్చికి నిప్పు

రామనగరలోని గ్రేస్ కమ్యూనిటీ చర్చిలో మంటలు చెలరేగి విగ్రహం, శిలువ తదితర సామగ్రి కాలిపోయాయి. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చర్చికి నిప్పంటించారు. దీంతో మంటలు వ్యాపించి మొత్తం కాలిబూడిదయ్యాయి. ఆదివారం ఉదయం ప్రార్థనలు చేయడానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాన్ని చూసి విలపించారు. రామనగర పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగిన మత్తులో సజీవ దహనం

దొడ్డబళ్లాపురం: తాగిన మైకంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని వ్యక్తి మృతిచెందిన సంఘటన కనకపుర తాలూకా కంసాగర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామం నివాసి నరసేగౌడ (66), తాగుడుకి బానిసయ్యాడు. గత బుధవారం రాత్రి పీకలదాకా తాగి ఒక బాటిల్‌లో పెట్రోల్ తీసుకుని ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు నిలబడి పెట్రోల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే గ్రామస్తులు మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. అయితే ఆదివారంనాడు చికిత్స ఫలించక మరణించాడు.

రాష్ట్రం పరువు తీయొద్దు: డీకే

దొడ్డబళ్లాపురం: రాజకీయ లాభం కోసం బాంబు పేలుడు సంఘటనను అడ్డం పెట్టుకుని బీజేపీ రాష్ట్రం పరువు తీస్తోందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బెంగళూరును బాంబ్ బెంగళూరుగా మారుస్తోందని బీజేపీ ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. బీజేపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రం పరువుతోపాటు సొంత పరువు కూడా తీసుకుంటున్నారన్నారు. వారి పాలనలో జరిగిన సంఘటనలను మరిచిపోయారన్నారు. పేలుడు సంఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని, కేసు దర్యాప్తు చేయడానికి పోలీసులకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చామన్నారు.

24 నుంచి కైవార తాతయ్య జయంతి

చింతామణి: తాలూకాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కైవారలో ఈ నెల 24 నుంచి 26 వరకు యోగి నారాయణ తాతయ్య జయంతి ఉత్సవాలు జరుగుతాయని ధర్మాధికారి డాక్టర్ జయరాం తెలిపారు. ఈమేరకు ఆదివారం పోస్టర్లను విడుదల చేశారు. జయంతి సందర్భంగా అమరనారాయణస్వామి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ట్రస్టు ఉపాధ్యక్షుడు విభాకరరెడ్డి, కోశాధికారి సత్యనారాయణ్, సంకీర్తన సంచాలకులు బాలకృష్ణ భాగవతార్, సభ్యుడు నరసింహప్ప, పాలనాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్త్రీలకు సమాన హక్కులు



జ్యోతి వెలిగిస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: సదృఢ సమాజ నిర్మాణం కోసం పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కులు ఉన్నాయని కిల్లే బ్రహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, సోమవారి పేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య స్వామీజీలు పేర్కొన్నారు. [illegible] జిల్లా వీరశైవ మహిళలు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం, అక్క అవార్డుల పంపిణీ కార్యక్రమంలో మహిళలను సన్మానించి మాట్లాడారు. మహిళలు హక్కులు, విధులు, సమానత్వం, విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. అదే విధంగా స్వేచ్ఛకు హద్దులు ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు భూపాల్ నాడగౌడ, చంద్రశేఖర్, జిల్లావీరశైవ మహిళ సమాజం అధ్యక్షురాలు రేఖ, నిర్మల, సులోచన, సుమతీ శాస్త్రి, విజయ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు లోక్‌సభ స్థానం పోటీకి సిద్ధం



మాట్లాడుతున్న నాయక్

రాయచూరు రూరల్: రాయచూరు-యాదగిరి జిల్లాల నుండి లోక్‌సభకు పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, మాజీ ఎమ్మెల్యే గంగాధర నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...తనకు రెండు జిల్లాల్లో అభిమానులు, కార్యకర్తలు ఉన్నారని, బీజేపీ అధిష్టానం పోటీకి అవకాశం కల్పిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆ మూడు స్టేషన్లలో రైళ్ల హాల్ట్

రాయచూరు రూరల్: దక్షిణ మధ్య రైల్వే బోర్డు పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం లాతూర్-యశ్వంతపుర రైలు బీదర్ జిల్లాలోని కమలానగర్, బాల్కి, ఉద్గీర్‌లలో నిలుపుదల చేస్తున్నట్లు కేంద్రమంత్రి భగవంత ఖూబా తెలిపారు. శనివారం రాత్రి ఆయన బీదర్ జిల్లా కమలానగర రైల్వే స్టేషన్‌లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. రైలు నంబర్ 16583-16584 ఈ మూడు స్టేషన్లలో రైళ్లను ఆపాలని సుదీర్ఘ విన్నపాల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి బోసురాజ్

రాయచూరు రూరల్: గ్రామీణులకు తాగు, సాగునీటిని అందించడానికి సిద్ధంగా ఉన్న గణేకల్ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ పరిశీలించారు. ఆదివారం సిరవార తాలూకా గణేకల్ (బంగారప్ప) చెరువు వద్ద నూతనంగ నిర్మించిన ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రూ.211 కోట్లతో రూపుదిద్దుకున్న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. మంత్రి వెంట పలువురు అధికారులు ఉన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

రాయచూరు రూరల్: జిల్లాలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం నగరంలోని ప్రభుత్వ కేఈబీ ప్రాథమిక పాఠశాలలో మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ చిన్నారులకు చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారం, జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్ర బాబు, విద్యాశాఖ అధికారి బడిగేర, మహిళా శిశు సంక్షేమ అధికారి చేతన్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధాని కావాలి

కంప్లి: ప్రధాని నరేంద్ర మోదీ జనరంజక పాలన అందిస్తున్నారని, ఆయన మరోసారి ప్రధాని అయితే దేశం మరింత ఆర్థికంగా ఎదుగుతుందని మాజీ మంత్రి శ్రీరాములు తెలిపారు. కూడ్లిగి తాలూకాబణవికల్లు గ్రామ శివారున ఏర్పాటు చేసిన విందు భోజన, తాలూకా స్థాయి బీజేపీ కార్యకర్తలు, ప్రముఖులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోదీ ఏ ప్రాంతం నుండి లోక్‌సభకు పోటీ చేసిన అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. తాను కూడా లోక్‌సభకు అవకాశం ఇస్తే గెలిచి చూపుతానన్నారు.

నగరంలో స్వచ్ఛత అభియాన్



చెత్తతో పేరుకుపోయిన కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి పరిసరాలను సంరక్షించాలని యువ స్వచ్ఛ అభియాన్ నేత రవిబోస్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో 20వ వార్డులో స్వచ్ఛత అభియాన్‌కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇళ్ల ముందు శుభ్రతను పాటించాలన్నారు.

సుందర పక్షిధామం అంకసముద్రం



సుదూర ప్రాంతం నుంచి వలస వచ్చిన పక్షి జాతులు



అంకసముద్రంలో సేద తీరుతున్న విహంగాలు



అరుదైన పక్షులు

- హంపీ సమీపంలో పర్యాటకులను కనువిందు చేస్తున్న పక్షులు
- సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన 240 పక్షిజాతులు

సాక్షి,బళ్లారి: ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ, కరిడిధామ, తుంగభద్ర డ్యాం, ప్రముఖ పుణ్యక్షేత్రాలతో ఉమ్మడి బళ్లారి జిల్లా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నేపథ్యంలో జిల్లాలో పక్షులు కాశీగా అంకసముద్రము కూడా చేరిపోవడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. కర్ణాటక రాష్ట్రంలోనే అరుదైన, అపురూపమైన పక్షిధామగా పేరుగాంచిన అంకసముద్రం చెరువులో పెయింటెడ్ స్టార్క్, పెలికాన్, స్పూన్ బిల్లు, ఓపన్ బిల్లు స్టార్క్, గ్రోటర్ కార్మోరేట్, విదేశాలకు చెందిన బ్రాహ్మణీ బాతు, బ్లాక్ టెయిల్డ్, గాడ్ వీట్, మార్స్ స్యాండ్ పైపర్, యూరేపియన్ కర్లివ్, సైబీరియన్ తదితర 87 జాతులకు చెందిన పక్షులు ఇక్కడకు చేరుకున్నాయి. అంకసముద్రం చెరువు పక్షి ప్రేమికులకు మైమరిపిస్తోంది.

ఏడాది పొడవునా ఇక్కడే :

ముఖ్యంగా దేశ, విదేశాల నుంచి 240 రకాలు చెందిన పక్షిజాతులు రావడంతో పక్షి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న అరుదైన నీటి కుక్కలు సందడి చేస్తున్నాయి. జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి తాలూకా అంకసముద్రం గ్రామ సమీపంలో విజయనగర రాజులు కాలంలో కట్టించిన ఈ చెరువు దాదాపు 244 ఎకరాల్లో విస్తరించిన అంకసముద్రం చెరువు పక్షులకు నిలయంగా మారింది. తుంగభద్ర నది నుంచి ఏడాది పొడువునా నీరు సరఫరా చేస్తుండటంతో ఎప్పటి ఈ చెరువు ఖాళీ కాకపోవడం విశేషం. దీంతో దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అరుదైన పక్షులు ఇక్కడ ఏడాది పొడువునా వచ్చి వెళ్తుంటాయి. దాదాపు వందలాది రకాలకు పైగా అందమైన పక్షులు రాకతో ప్రముఖ పక్షులు కేంద్రంగా, పక్షిధామగా, పక్షి ప్రేమికులకు నిలయంగా ఈ చెరువు విరాజిల్లుతోంది. హంపీకి 40 కిలోమీటర్లు దూరంలో ఉండటంతో పర్యాటకులు భారీగా వస్తుంటారు.



అరుదైన నీటి కుక్కలు

పొడవుగా కనిపించే ఈ నీటికుక్కలు అంకసముద్రం చెరువులో పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. మనుషులు కనిపిస్తే ఒకింత సిగ్గుపడుతూ వయ్యారాలు ఒలకబోసి అటు ఇటుగా తిరిగే ఈ నీటికుక్కలు చెరువుల్లో నీటిశుభ్రత చేసే అరుదైనవని గుర్తించారు. భారతదేశంతో పాటు బంగ్లాదేశ్, పాకిస్థాన్, నేపాల్, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా దేశాల్లో మాత్రమే ఈ నీటికుక్కలు కనిపిస్తాయని, చారిత్రాత్మక నేపథ్యం,ప్రపంచ పర్యాటక కేంద్రాలు ఉన్న ఉమ్మడి బళ్లారి జిల్లాకు అంకసముద్రం చెరువు పక్షులకు నిలయంగా మారడంతో ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

అరటి తోట ఆహుతి



పంట కాలిపోయిన దృశ్యం

- రూ.10 లక్షల నష్టం

రోణ్: కష్టాన్ని నమ్ముకున్న రైతుకు చివరికి కన్నీళ్లు మిగిలాయి. చేతికి వస్తుందనుకున్న అరటి పంట మంటల్లో ఆహుతైంది. వివరాలు.. ఎం.రాయాపురంవాసి నాగేంద్రప్ప గ్రామ సరిహద్దుల్లో శిర పరిధిలో 4 ఎకరాలు భూమిని కొనుగోలు చేసి అందులో బోరు బావి తవ్వించారు. రెండేళ్ల క్రితం రూ.7 లక్షలు ఖర్చు చేసి 3 వేల అరటి మొక్కలు నాటారు. మొదటి సంవత్సరం పంట చేతికి అందడంతో సుమారు రూ.6 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు తెలిపారు. ప్రస్తుతం రెండోసారి పంట ఆశాజనకంగా ఉంది. ఇంతలో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు అరటి తోటకు నిప్పు పెట్టడంతో అరటి చెట్లు, నీటి పంపుసెట్లు కాలిపోయి రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

పోలియో రహిత సమాజమే ధ్యేయం

శివాజీనగర: పోలియో రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు అన్నారు. శేషాద్రిపురంలో ఆదివారం ఆయన చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్‌పోలియోను ప్రారంభించి మాట్లాడారు. 12 సంవత్సరాలుగా దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా చిన్నారులకు చుక్కల మందు వేయించడం ద్వారా భావితరాలకు పోలియో రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. బెంగళూరులో 11 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రామేశ్వరం కెఫేలో పేలుడుపై మాట్లాడుతూ పూర్తి తనిఖీ అనంతరమే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు.

ఐదేళ్ల పాలన గ్యారంటీ

యశవంతపుర: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు పాలన సాగిస్తుందని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. చిక్కమగళూరు పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ జిల్లా మైదానంలో జరిగిన అభివృద్ధి పనులకు సీఎం సిద్దరామయ్యతో కలిసి ప్రారంభోత్సవం చేసి మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో ప్రజలు ఓటు వేశారని, ఐదు గ్యారంటీలను కొనసాగిస్తామన్నారు.

నిలిపి ఉన్న లారీని ఢీకొన్న లారీ



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

క్రిష్ణగిరి: నిలిపి ఉన్న లారీని మరో లారీ ఢీకొని డ్రైవర్‌కు బలమైన గాయాలయ్యాయి.ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు నుంచి క్రిష్ణగిరి వైపు వెళ్తున్న కంటైనర్ లారీ సూళగిరి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే పంచరైంది. డ్రైవర్ లారీని రోడ్డు పక్కన నిలిపి టైర్ ఉప్పుతుండగా ఆ మార్గంలో వచ్చిన లారీ ఢీకొంది. లారీ ముందు భాగం ధ్వంసం కాగా టైర్ ఉప్పుతున్న డ్రైవర్‌కు బలమైన గాయాలు కావడంతో స్థానికులు అతన్ని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది.

అజరామరం ఘంటసాల సంగీతం



జ్యోతి వెలిగించి ఘంటసాల శతజయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న జస్టిస్ మంజులా చేళూరి, కే.సి.రామమూర్తి, డాక్టర్ హంసలేఖ



ఘంటసాల పురస్కారాలు అందుకుంటున్న పద్మశ్రీ లలితా శ్రీనివాసన్, చిత్రా విశ్వేశ్వరన్, డాక్టర్ హంసలేఖ, డాక్టర్ టీ.ఎస్.సత్యవతి

శివాజీనగర: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీతం అజరామరమని ప్రముఖ సంగీత దర్శకుడు, రచయిత డాక్టర్ హంసలేఖ అన్నారు. శనివారం సాయంత్రం నగరంలోని ఏడీఏ రంగమందిరంలో రంగమ్మ భీమప్ప శెట్టి లలితకళా ట్రస్ట్, కళా ప్రదర్శిని సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘంటసాల వెంకటేశ్వర పురస్కారాన్ని అందుకొని మాట్లాడారు. ఘంటసాల పేరిట శతజయంతి ఉత్సవాల పురస్కారాన్ని అందుకోవటం తన పూర్వ జన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కే.సీ.రామమూర్తి మాట్లాడుతూ ఘంటసాల ఆలపించిన నమో వేంకటేశ, నమో తిరుమలేశ పాటలు తిరుమల కొండ ఉన్నంతవరకు ప్రతిధ్వనిస్తుంటాయన్నారు. మహారాష్ట్ర, కేరళ హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన జస్టిస్ మంజులా చేళూరి మాట్లాడుతూ పద్మశ్రీ ఘంటసాల శతజయంతి నాడే తమ తండ్రి కీర్తిశేషులు రంగస్థల నటుడు భీమప్పశెట్టి శతజయంతి కావటం తమ అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యకళాకారిణులు డాక్టర్ లలిత శ్రీనివాస్, పద్మశ్రీ నాట్యకళాకారిణి చిత్ర విశ్వేశ్వరన్, సంగీత దర్శకులు డాక్టర్ హంసలేఖ, సంగీత అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ టీ.ఎస్.సత్యవతిలు ఘంటసాల పురస్కారాలు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన సంగీత నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



నాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

3 లక్షల మంది అభిప్రాయాల సేకరణ

శివాజీనగర: వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చందుకు రాష్ట్రం నుంచి కనీసం 3 లక్షల మంది అభిప్రాయ సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బీ.వై.విజయేంద్ర తెలిపారు. ఆదివారం బెంగళూరులోని మల్లేశ్వరం బీజేపీ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్పం లేఖ ప్రజాభిప్రాయ సేకరణ అభియాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి శాసనసభా నియోజకవర్గంలో బాక్స్‌లు ఏర్పాటు చేసి సలహాలు తీసుకుంటామన్నారు. మొబైల్‌కు మిస్డ్ కాల్ ఇవ్వటం ద్వారా కూడా ఈ అభియానాలో పాల్గొని అభిప్రాయం చెప్పవచ్చన్నారు. 2014-19 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కార్ పూర్తిగా నెరవేర్చిందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ అనే సంకల్పాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దేశం ముందుంచారని, దానిని సాకారం చేసేందుకు సమాజంలో అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15 వరకు ఈ అభియాన్ జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, బీజేపీ నాయకులు మాళవికా అవినాశ్, లోక్‌సభ ఎన్నికల రాష్ట్ర ఇన్‌చార్జి రాధా మోహన్‌దాస్ అగర్వాల్ , ప్రముఖ క్రీడాకారుడు వెంకటేశ్ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సీ.సోమశేఖర్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి రాజీవ్ జీ.వి., ఉపాధ్యక్షుడు రాజేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

హుబ్బళ్లిలో భారీ చోరీలు

హుబ్లీ: నగరంలో రెండు చోట్ల దొంగలుపడి దోచుకున్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక విద్యానగర పాటిల్ కాలనీలోని అపార్టుమెంట్‌లో ఉంటున్న ఓ కుటుంబం ఫ్లాట్‌కు తాళం వేసి కుమార్తె ఇంటికి వెళ్లారు. దొంగలు విషయం గుర్తించి ఇంటిలో ఉన్న రూ. లక్షన్నర విలువైన బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. చోరీ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో గ్రానైట్ వ్యాపారి ఇంటిలో లక్షలు విలువ చేసే బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ధార్వాడ సంఘం థియేటర్ వద్ద ఉన్న కెంపగేరిలో ఈ చోరీ జరిగింది. అరుణ బసవరాజ ఉనగుంద కుటుంబ సభ్యులు బంధువుల పెళ్లి కోసం యాదగిరికి వెళ్లగా దొంగలు తమ చేతివాటం చూపారు. ఇంటి తాళాన్ని విరగకొట్టి లోనికి చొరబడిన దొంగలు... ఇంట్లో ఉన్న 250 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన వారు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోలారు వార్తలు...

పంటలకు ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: సిరిధాన్య పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుమ తెలిపారు. ఆదివారం నగరంలోని టీకల్ రోడ్డులో ఉన్న అంతరగంగ సిరిధాన్య రైతు ఉత్పత్తుల సంస్థ ఆధ్వర్యంలో సిరిధాన్య ఉపయోగాలపై ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిరిధాన్య పంటలను పండించడానికి రైతులకు అధిక ప్రోత్సాహం అందిస్తోంది. వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల ద్వారా దీనిపై రైతులను అధికంగా జాగృతం చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే సౌలభ్యాలను పొంది నాణ్యమైన సిరిధాన్య పంటలను పండించాలని తెలిపారు. ఇందుకు ప్రభుత్వ శాఖల సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర విత్తన మండలి డైరెక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ సిరిధాన్యాలను సుమారు 50 సంవత్సరాల క్రితమే పండించే వారు. అయితే ఆనాడు అది పేదల ఆహారం అయి ఉండేది, ఆపితే అదే ఇప్పుడు పౌష్టిక ఆహారం అయిందన్నారు. నేడు రైతులు పండించే ప్రతి పంటలోను రసాయనిక ఎరువులను ఉపయోగిస్తున్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్పరిణామం కలుగుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రీయ ఎరువులను అధికంగా ఉపయోగించాలని తెలిపారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ శాఖ అధికారి పరమేష్, వినాయకరెడ్డి, అమరనారాయణ, ఈరప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పోలియో కనుమరుగు



చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే రూప

కేజీఎఫ్: దేశంలో పోలియో మహమ్మరి పూర్తిగా కనుమరుగైందని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పల్స్ పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడిన ఎమ్మెల్యే పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ఐదేళ్లలోపు పిల్లలందరికి చుక్కల మందును వేయించాలని తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయంతం చేయాలి

కోలారు: చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 1,61,868 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేసే లక్ష్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. వైద్యాధికారి ఎవి నారాయణస్వామి, ఆర్‌సి హెచ్‌ఓ అధికారి డాక్టర్ విజయకుమారి, డాక్టర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే

మాలూరు: ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పల్స్ పోలియో చుక్కలను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తాలూకా పాలనాధికారి డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ... ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంతో పాటు ఫిర్కా స్థాయిలో కూడా పల్స్ పోలియో చుక్కలను వేస్తున్నారని, పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కృషిక సమాజ అధ్యక్షుడు ఆనేపుర హనుమంతప్ప, పురసభ సభ్యుడు మురళీధర్, భవ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదోడి పెద్ద మనుసు



సైకిళ్లు అందజేసిన ఆంజనేయులు

రాయచూరు రూరల్: దానం , ధర్మం చేయడానికి ఉదార స్వభావం ఉండాలి. ఇందులో ధనిక, పేద అనే తేడా ఉండదు. అలాంటి కోవకు చెందిన ఓ కార్మికుడు పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను కొనిచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవదుర్గ తాలూకాలోని మల్కందిన్ని నుండి హేమనూరు ప్రభుత్వ హైస్కూలుకు ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. అక్కడి పేద విద్యార్థుల అవస్థలను గమనించిన ఆంజనేయులు 11 మందికి రూ. 66 వేలు ఖర్చు పెట్టి సైకిళ్లను కొనిచ్చి తన దాతృత్వాన్ని చాటాడు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవరాజ్, తాలూకా విద్యాశాఖ అధికారి సుఖదేవ్, అధికారి శివరాజ్ పూజారి, గ్రామస్థులు వెంకటేష్, సూగప్పగౌడ తదితరులు ఆంజనేయులను అభినందించారు.

వేడుకగా పట్టాభిషేక మహోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు

కంప్లి: స్వాముల మఠాలు చీల్చే వారు కారని సమాజ సేవకులని కొట్టూరు ముప్పిన బసలింగ స్వామి అన్నారు. గరగ నాగలాపుర శ్రీ గురు ఒప్పత్తేశ్వర విరక్త మఠంలో పూజ్యశ్రీ నిరంజన ప్రభు దేశికర నిరంజన పట్టాభిషేక మహోత్సవంలో ఏర్పాటు చేసిన శ్రీ యడెయూరు సిద్ధలింగేశ్వర పురాణ ప్రవచన ప్రారంభోత్సవం, ఒప్పత్తేశ్వర సముదాయ భవన ప్రారంభోత్సవం పాల్గొని ప్రారంభించి భక్తులను ఆశీర్వదించి మాట్లాడారు.

పంచమిత్ర పోర్టల్ ప్రారంభం



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

మైసూరు: గ్రామ పంచాయతీలో సేవలను పొందడానికి గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌శాఖ ఏర్పాటు చేసిన పంచమిత్ర పోర్టల్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, హెచ్.సి. మహదేవప్ప ఆదివారం మైసూరులోని జలదర్శిని భవన్‌లో ఆవిష్కరించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఎలాంటి సేవలు పొందాలన్నా ఈ పోర్టల్ ఉపయోగపడుతుందన్నారు.

వైభవంగా రథోత్సవం

కంప్లి: సండూరు తాలూకా చిక్క కెరెయాణినహళ్లి గ్రామంలో శనివారం సాయంత్రం శ్రీ బేవినహళ్లి దుర్గమ్మ దేవి జాతర సందర్భంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలంకరించిన రథంలో దేవి ఉత్సవమూర్తిని అధిష్టించి రథోత్సవం నిర్వహించారు.

గంజాయి విక్రేతల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ఆటో

కెజీఎఫ్: గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన అండర్సన్ పేట పోలీసులు వారి వద్ద నుంచి 33 కిలోల గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి అండర్‌సన్ పేట పోలీస్ సరిహద్దులోని కెంపాపుర గ్రామ చెక్‌పోస్టు నుంచి వెళుతున్న ఆటోను అడ్డుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. ఇద్దరిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చేతన్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

కోలారు: హత్యకేసులో నిందితుడుకి జీవితఖైదు శిక్షను విధిస్తూ ముళబాగిలు సెషన్స్ కోర్టు శనివారం తీర్పును వెలువరించింది. ముళబాగిలు నగరానికి చెందిన సుప్రీత్ (25) నిందితుడు. 2020లో సుప్రీత్, అతని స్నేహితుడు గొర్రెల వ్యాపారం చేసే నెపంతో వెళ్లి గొర్రెల యజమాని మునిస్వామి గౌడను హత్య చేశారు. ఘటనపై మునిస్వామి గౌడ కుమారుడు చంద్రు ముళబాగిలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సుప్రీత్‌ను అరెస్టు చేసి కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. సుదీర్ఘ విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి దేవమానె నిందితుడు సుప్రీత్‌కు జీవితఖైదును విధిస్తూ తీర్పు చెప్పారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

5న ఎస్సీ, ఎస్టీ నౌకర్ల సమావేశం

కోలారు : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ నౌకర్ల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని బెంగుళూరులో ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయ తెలిపారు. ఆదివారం నగరంలోని నచికేత నిలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సమావేశానికి పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ నౌకరులు పాల్గొనడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నౌకర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు జి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి ఎస్ ముకుంద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిద్ధలింగేశ్వర స్వామి జాతర ప్రారంభం



మాట్లాడుతున్న సిద్ధలింగ స్వామీజీ

తుమకూరు : చరిత్ర ప్రసిద్ధి చెందిన సిద్ధగంగా మఠంలో శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి జాతర మహోత్సవం, సిద్ధగం గురుపరంపర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు సిద్ధగంగా మఠాధ్యక్షుడు సిద్ధలింగ స్వామీజీ అధ్యక్షత వహించారు. కుణిగల్ తాలూకాలోని బెట్టదహళ్లి మఠానికి చెందిన చంద్రశేఖర శివాచార్య స్వామీజీ పాల్గొని భక్తులకు ఆశీర్వాదం ఇచ్చారు.

పరిశీలనా గృహం నుంచి బాలల పరారీ

శివమొగ్గ : బాలల పరిశీలనా గృహం నుంచి ముగ్గురు చిన్నారులు పరారైన ఘటన శివమొగ్గలో ఆలస్యంగా వెలుగు చూసింది. అల్కోల సమీపంలోని పరిశీలనా గృహంలో బాలలు ఆశ్రయం పొందుతున్నారు. ఫిబ్రవరి 27న రాత్రి 8.30 గంటల సమయంలో శివమొగ్గ, భద్రావతి, సాగరకు చెందిన సుమారు 15 నుంచి 17 సంవత్సరాల వయసున్న విద్యార్థులు మరుగుదొడ్డిలోని కిటికీ ఊచలు వంచి ఉడాయించారు. ఘటనపై శివమొగ్గ నగర వినోభ నగర పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలింపు చేపట్టారు.

మోదీని మళ్లీ ప్రధానిని చేద్దాం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు

బొమ్మనహళ్లి : వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని అత్యధిక స్థానాల్లో గెలిపించి నరేంద్ర మోదీని మళ్లీ ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యేం ఎం.సతీష్‌రెడ్డి, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య పిలుపు ఇచ్చారు. బొమ్మనహళ్లిలో మహిళా మోర్చా ఆదివారం నారీ శక్తి వందన యాత్ర పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బెంగళూరు దక్షిణలో బీజేపీ మరోమారు విజయఢంకా మోగించేలా కార్యకర్తలు శ్రమించాలన్నారు. బాబు రెడ్డి, టి. రామచంద్ర, విజయ లక్ష్మీ ఆనంద్, భారతి రామచంద్ర, వందలాదిగా మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈశ్వరప్ప వ్యాఖ్యలు సరికాదు

యశవంతపుర: బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ ఈశ్వరప్ప గాజు ఇంటిలో కూర్చొని మరో ఇంటిపైకి రాళ్ల విసురుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే శివరామ్ హెబ్బార్ ఆరోపించారు. ఉత్తరకన్నడ జిల్లా శిరసి గుడ్డాపురలో ఆదివారం కదంబోత్సవంలో భాగంగా కదంబ జ్యోతి యాత్రను ప్రారంభించి మాట్లాడారు. ఈశ్వరప్ప చేసిన వ్యాఖ్యలను బీజేపీ సీరియస్‌గా తీసుకోవద్దన్నారు. సీనియర్ అయిన ఈశ్వరప్ప అలా మాట్లాడటం సరికాదన్నారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ఎంత డబ్బు ఇచ్చిందని ప్రశ్నించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బ్యాంకుల మేనేజర్లు

గౌరిబిదనూరు: బ్యాంకు సిబ్బంది రోజూ కంప్యూటర్ల ముందు కూర్చొని పని చేయడం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వారిలో ఉత్సాహం నింపేందుకు క్రీడలు దోహదపడతాయని యూనియన్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆచార్య క్రీడా మైదానంలో బ్యాంకు ఉద్యోగులకు బ్యాంక్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాబోవు దినాలలో మహిళా సిబ్బంది, సిబ్బంది పిల్లలు, పోషకులకు సైతం క్రీడలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. యూనియన్ బ్యాంకు జగదీశ్, బ్యాంక్ ఆఫ్ బరోడా రామమూర్తి, కొటక్ బ్యాంక్ గౌతమ్, వినయ్, కెనరా బ్యాంక్ భానుకిరణ్ యాదవ్, ఎస్‌బీఐ రాజేశ్, ఐడీబీఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను లారీతో ఢీకొట్టేందుకు యత్నం

దొడ్డబళ్లాపురం: అక్రమ రవాణాను అడ్డుకున్న తహసీల్దార్‌పైకి ఇసుకాసురులు లారీని ఎక్కించేందుకు యత్నించారు. హారోహళ్లి తాలూకా భీమసంద్ర గ్రామ శివారులో చెరువు, ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వి మట్టి తరలిస్తున్నారని సమాచారం అందడంతో తహసీల్దా విజయణ్ణ తన సిబ్బందితో కలసి వెళ్లారు. అయితే అంచెబారె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మహేశ్‌కుమార్ తహసీల్దార్‌ను వాహనంతో ఢీకొట్టేందుకు యత్నించాడు. తృటిలో తప్పించుకున్న తహసీల్దార్ తన వాహనంలో లారీని వెంబడించి డ్రైవర్‌ను పట్టుకొని హారోహళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు నిందితుడు మహేశ్‌కుమార్‌ను అరెస్టు చేసి హత్యా యత్నం కేసు నమోదు చేశారు.

అన్నింటా భారతీయుల ప్రతిభా కేతనం



గౌరవ డాక్టరేట్లను అందుకుంటున్న ఎస్‌ఎం కృష్ణ తదితరులు



గౌరవ డాక్టరేట్ల ప్రదానం



అత్యధిక బంగారు పతకాలు అందుకున్న టాపర్లు

- గవర్నర్ గెహ్లాట్
- ఘనంగా మైసూరు వర్సిటీ స్నాతకోత్సవం

మైసూరు: వేదకాలం నుంచి నేటి వరకు భారతీయులు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు ఖగోళ, భూ విజ్ఞానం, గణితం, వైద్య విద్య తదిర రంగాల్లో గొప్ప పాత్ర పోషిస్తున్నారు, ప్రపంచానికి భారత శక్తి తెలుసని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అన్నారు. ఆదివారం ఉదయం మైసూరులోని మైసూరు విశ్వవిద్యాలయంలో 104వ స్నాతకోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ పాల్గొని ప్రసంగించారు. మనది ప్రాచీన కాలం నుంచి కూడా వసుధైక కుటుంబ భావనతో జీవిస్తున్నాం. విశ్వశాంతి, సమానత, సామరస్యాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు.

వనితలే అధికం

ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తిచేసిన పట్టభద్రులకు పట్టాలను బహూకరించారు. మొత్తం 19,992 మందికి పట్టాలను అందజేయగా, అందులో మహిళలు 62 శాతం మంది ఉండడం విశేషం. 100 మంది పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 252 మందికి బంగారు పతకాలను అందజేశారు.

మేఘనకు 15 బంగారు పతకాలు

ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో హెచ్‌ఎస్ మేఘన అనే విద్యార్థిని టాపర్‌గా 15 బంగారు పతకాలను అందుకుంది. 5 నగదు బహుమానాలు ఆమెకు లభించాయి. ఎంఏ కన్నడలో వి. తేజస్వినికి 10 బంగారం పతకాలు, 4 నగదు బహుమానాలు వచ్చాయి. ఎమ్మెస్సీ గణితంలో డి.దర్శన్‌కు 5 బంగారం పతకాలు, 3 నగదు బహుమానాలు దక్కాయి. బీఏలో ఎం.సుమ కు 5 బంగారం పతకాలు, 3 నగదు బహుమానాలు, బీ.నందిశకు 4 బంగారు పతకాలు, బీకాంలో వై.సింధూ కు ఒక బంగారు పతకం లభించాయి. అలాగే డాక్టర్. హెచ్.సి. సత్యన్, కే.ఎం. వీరేశ్, మీరా శివలింగయ్య, ఎస్‌ఎం కృష్ణలకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు.

ఆస్పత్రిలో చేరిన కేంద్ర మాజీ మంత్రి

యశవంతపుర: కేంద్ర మాజీ మంత్రి, విజయపుర ఎంపీ రమేశ్ జిగజిణగి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బెళగావి ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. మెదడు సంబంధిత సమస్య తలెత్తడంతో శనివారం సాయంత్రం కేఎల్‌ఇ ఆస్పత్రిలో చేర్చారు. న్యూరో వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మెదడులో రక్తస్రావమైనట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ బెనకె తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఫోన్ చేసి రమేశ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు.

రంగనాథస్వామి సన్నిధిలో దేవెగౌడ



పూజలు చేస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం : మాజీ ప్రధాని దేవెగౌడ ఆదివారం హాసన్‌లో తమ ఇంటిదేవుడు మావినకెరె రంగనాథ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆరోగ్యం కుదుట పడటంతో తన సతీమణి చెన్నమ్మ, కుమారుడు రేవణ్ణ, కోడలు భవానీ రేవణ్ణ, ప్రజ్వల్ రేవణ్ణ, సూరజ్ రేవణ్ణలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

మహిళకు రూ.14 లక్షలు మస్కా

హోసూరు: జిల్లాలో తరచూ ఎక్కడో ఒక చోట ప్రజలు ఆన్‌లైన్ మోసానికి గురి అవుతున్నారు. మొబైల్‌ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మేసి డబ్బును పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగడం సాధారణమైంది. అదే మాదిరిగా.. పార్ట్ టైం ఉద్యోగం పేరుతో మహిళ వద్ద రూ. 14 లక్షల నగదును సైబర్ దొంగలు వసూలు చేశారు. వివరాల మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పాతపేటకు చెందిన నాగరాణి (39). గత నెల 23వ తేదీ ఆమె వాట్సప్ నంబర్‌కు ఓ మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లో పార్ట్ టైం ఉద్యోగంతో అధిక రాబడి, యాప్‌లకు ఫైవ్ స్టార్ రేటింగ్ చేస్తే అధిక జీతం అందజేస్తామని ఉండడంతో వారిని సంప్రదించింది. వాట్సప్ లింక్ ద్వారా పెట్టుబడులు పెడితే అధిక లాభం వస్తుందని మోసగాళ్లు సూచించడంతో సరేనని ఆమె ఆన్‌లైన్‌లో రూ. 14 లక్షల నగదును జమచేసింది. తరువాత ఆ నంబర్ స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకున్న ఆమె క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

8 నుంచి రామేశ్వరం కెఫే పునః ప్రారంభం

శివాజీనగర: పేలుడు సంభవించి కార్యకలాపాలు నిలిచిపోయిన కుందనహళ్లిలోని రామేశ్వరం కెఫేను ఈనెల 8నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు హోటల్ యజమాని రాఘవేంద్ర రావు తెలిపారు. పేలుడు నేపథ్యంలో తనిఖీలు జరుగుతుండటంతో కెఫేను మూత వేసినట్లు తెలిపారు. శివరాత్రి రోజునుంచి హోటల్‌ను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇకపై వినియోగదారుల రక్షణ కోసం మున్ముందు మెటల్ డిటెక్టర్ వినియోగించాలని పోలీసులు సూచించారన్నారు. బ్యాగులను తనిఖీ చేసిన అనంతరం లోపలకు అనుమతిస్తామన్నారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని, హోటల్‌కు వచ్చేవారందరూ సోదరులతో సమానమన్నారు. పేలుడు ఘటనలో తమ సిబ్బంది కూడా గాయపడ్డారన్నారు. ఇంజినీరింగ్ చదివి ఉద్యోగాలు లేని సమయంలో 2012లో ఫుట్‌పాత్‌పై ఈ హోటల్ ప్రారంభించామన్నారు. దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన జన్మస్థలమైన రామేశ్వరం పేరును తమ హోటల్‌కు పెట్టామన్నారు. తమ హోటల్‌లో పనిచేసేవారంతా గ్రామీణులేనన్నారు. చదువు అబ్బక కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోక నిరాశ్రయులైన వారు తమ హోటల్‌లో పనిచేస్తున్నారని తెలిపారు.



శయనోత్సవ భవ్య మంటపంలో వసంతవల్లభుడు

కమనీయం శయనోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బనశంకరి: వసంతవల్లభరాయస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి శయనోత్సవం కమనీయంగా సాగింది. శనివారం సాయంత్రం తలఘట్టపుర క్యాన్‌టోగ్ తానాశాంతకుమార్ ఆధ్వర్యంలో శయనోత్సవ మంటపంలో ఆలయ ప్రధాన అర్చకులు వీఆర్.రఘురామబట్టర్ వసంతవల్లభుడికి సతీసమేతంగా పూలతో ప్రత్యేక అలంకరణచేపట్టి విశేష పూజలు నిర్వహించారు. వసంతపుర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ రుక్మిణి, తానాశాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంటల్లో కారు దగ్ధం

- కుటుంబానికి తప్పిన ప్రమాదం

దొడ్డబళ్లాపురం: కదులుతున్న కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఒక కుటుంబం ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఈఘటన నాయండనహళ్లి మెట్రో స్టేషన్ వద్ద శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ట్యానరి రోడ్డు నివాసి నజీబుల్లా తమ కుటుంబంతో కలిసి కారులో చెన్నపట్టణకు వెళ్తుండగా నాయండనహళ్లి పై వంతెనపై వాహనంలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కారులోని వారు కిందకు దిగి పరుగులు తీశారు. అగ్నిమాపక దళం సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.

ఇతర భాషలనూ గౌరవించాలి

యశవంతపుర: మాతృభాషను పరిరక్షించుకోవడంతోపాటు ఇతర భాషలను గౌరవించాలని విధానసభ అధ్యక్షుడు యూటీ ఖాదర్ అన్నారు. ఆదివారం బెళగావి నగరంలోని గాంధీభవనంలో కర్ణాటక ప్రభుత్వ ముస్లిం ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ప్రభుత్వ ముస్లిం ఉద్యోగుల సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాతృభాష కన్నడతోపాటు ఇంగ్లిష్, హిందీ, మరాఠీ భాషలపై పట్టు సాధించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గుణాత్మక విద్యను అందించాలన్నారు.

కొండపై వృద్ధుడి మృతదేహం

దొడ్డబళ్లాపురం: కొడగు జిల్లా మడికేరి తాలూకా నిశాని కొండపై అప్పచ్చ(60)అనే వృద్ధుడు శవమై కనిపించాడు. ఈయన శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం కొండమీదకు ట్రెక్కింగ్ వెళ్లిన వారికి శవమై కనిపించాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు. ఆనవాళ్లను బట్టి ఏనుగు దాడిలో మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

బూదనూరు ఉత్సవాలు అదరహో..



గంగమ్మ తల్లికి హారతి ఇస్తున్న దృశ్యం

మండ్య : జిల్లాలో ఎన్నో పురాతన ఆలయాలు, చారిత్రక ప్రదేశాలు, స్మారకాలు ఉన్నాయని, వాటి ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్.చెలువరాయస్వామి అన్నారు. మండ్య తాలూకా బూదనూరు గ్రామంలో నిర్వహించిన బూదనూరు ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మండ్య జిల్లాలో హొయ్సళ కాలం నాటి ఆలయాలు అద్భుతమైన శిల్పసంపదతో అలరారుతున్నాయని, మద్దూరు విదేశీ పక్షులకు ఆశ్రయం ఇస్తోందన్నారు. కేఆర్‌ఎస్ జలాశయం, శ్రీరంగనాథ స్వామి ఆలయం ఇవన్నీ పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలని అన్నారు.



ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న గారడి బొమ్మలు

ఉత్సవాలకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. గారడి బొమ్మలు, ఆకట్టుకున్నాయి.

వ్యాపారి, భార్య ఆత్మహత్య



బాలషణ్ముగం, సుగంధి (ఫైల్)

హోసూరు: అప్పుల బాధను తట్టుకోలేక దంపతులు ఆత్మహత్య చేసుకొన్న ఘటన హడ్కో పరిధిలో జరిగింది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని నెల్లూరు ప్రాంతానికి చెందిన బాలషణ్ముగం (54), భార్య సుగంధి (50). వీరికి పూజ అనే కూతురుంది. బాలషణ్ముగం బాగలూరులోడ్డులో హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం కోసం బంధువుల వద్ద రూ. 40 లక్షలు అప్పుచేశాడు. వ్యాపారం సాగక అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దంపతులు గత నెల 28వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక శనివారం మృతి చెందారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

కెలమంగలం: కుటుంబ కలహాలతో కెలమంగలం సమీపంలోని బిదిరెడ్డి గ్రామానికి చెందిన సురేష్ భార్య పుష్ప(20) ఆత్మహత్య చేసుకుంది. ఈ దంపతులకు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. తరచూ ఏదో విషయంపై గొడవపడేవారు. శనివారం రాత్రి కూడా ఇద్దరూ గొడవ పడ్డారు. జీవితంపై విరక్తి చెందిన పుష్ప ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కెలమంగలం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

కమనీయం వేణుగోపాల స్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు



వివిధ వేషధారణతో భక్తులు

హోసూరు: హోసూరు తాలూకా చొక్కరసనపల్లి గ్రామంలో వేణుగోపాలస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామివారిని అభిషేకించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మేళతాళాలతో తీసుకెళ్లి రథంపై ఉంచి ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగి మొక్కులు తీర్చుకొన్నారు. సేవగానపల్లి, కగ్గనూరు, కొత్తూరు తదితర 20 గ్రామాలకు పైగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. చల్లని పానీయాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సరిహద్దుల్లో వాహన తనిఖీలు

హోసూరు: బెంగళూరులో ఇటీవల ఓ హోటల్లో బాంబు పేలుడు ఘటనతో సమీప రాష్ట్రమైన తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా సరిహద్దు చెక్‌పోస్టులలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. రెండు రోజులుగా హోసూరు పారిశ్రామికవాడ, కర్ణాటక సరిహద్దు జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద వచ్చిపోయే వాహనాలను సోదాలు చేస్తున్నారు. తీవ్ర తనికీల తర్వాతే తమిళనాడులోకి అనుమతిస్తున్నారు. క్రిష్ణగిరి జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులలో పోలీసు భద్రతను కూడా పెంచారు.

20 వేల మంది చిన్నారులకు చుక్కల మందు



పిల్లలకు చుక్కల మందు వేస్తున్న మేయర్ సత్య

హోసూరు : కృష్ణగిరి జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని అప్పావునగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మేయర్ సత్య చిన్నారికి చుక్కల మందు వేశారు. కమిషనర్ స్నేహ, డెప్యూటీ మేయర్ ఆనందయ్య, పారిశుద్ధ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.మాదేశ్వరన్, అధికారి ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ హోసూరు కార్పొరేషన్ పరిధిలో 66 కేంద్రాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 20 వేల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో కలెక్టర్ శరయు అధ్యక్షతన, తళి యూనియన్‌లో చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

దివ్యాంగులు నిజమైన యోగులు

బనశంకరి: విభిన్నప్రతిభావంతులకు అవకాశం ఇస్తే స్వాభిమానంతో జీవిస్తారని, వారే నిజమైన యోగులని మాజీ సీఎం బసవరాజబొమ్మై తెలిపారు. చామరాజపేటే కువెంపు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విశేషచేతన దక్షిణ ప్రాంత సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని అవయవాలు కలిగిన మనం సంతోషంగా ఉన్నామా? భగవంతుడు ఇచ్చిన అన్ని అవయువాలను సక్రమంగా వినియోగించుకుంటున్నామా అని ప్రశ్నించుకోవాలన్నారు. అవయువలోపం కలిగిన వ్యక్తులు సమాజంలో తలెత్తుకుని జీవిస్తున్నారని ఆయన తెలిపారు.

రెండు చుక్కలతో చిన్నారులకు రక్ష



మైసూరులో చుక్కల మందు వేస్తున్న మంత్రి మహదేవప్ప



చుక్కల మందు వేస్తున్న బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి



తుమకూరులో చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే జ్యోతి గణేష్

మైసూరు : జిల్లా పంచాయతీ, ఆరోగ్యశాఖ మైసూరులోని ఎస్‌ఎంటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో మంత్రి హెచ్.సి.మహదేవప్ప పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. చిన్నారులు భవిష్యత్‌లో వికలత్వం బారిన పడకుండా ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేయించాలన్నారు.

బొమ్మనహళ్లి : హొంగసంద్ర ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేయించి మహమ్మారి పోలియో వ్యాధి రాకుండా కాపాడాలన్నారు. వైద్యాధికారితోపాటు వార్డు అధ్యక్షుడు బాబురెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతి రామచంద్ర పాల్గొన్నారు.

తుమకూరు : తుమకురు నగరంలో తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ చిన్నారులకు చుక్కల మందు వేసి పల్స్‌పోలియోను ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : దేశంలో ఐదేళ్లలో ఎలాంటి పోలియో కేసులు నమోదు కాలేదని, ఐదేళ్లలోపు పిల్లందరికీ చుక్కల మందు వేయించి భావితరాలకు ఆరోగ్యవంత సమాజాన్ని అందించాలని విజయపుర పట్టణ ఆరోగ్య కేంద్రం పరిపాలన వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ అన్నారు. పట్టణంలో ఉన్న ఆరోగ్య సముదాయ కేంద్రంలో రోటరీ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు.

పోలియో చుక్కలతో ఆరోగ్యం

గౌరిబిదనూరు: ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి భవిష్యత్తులో దివ్యాంగులు కాకుండా రక్షించాలని నగరసభ మాజీ అధ్యక్షురాలు రూపా అనంతరాజు తెలిపారు. ఆదివారం 12 వ వార్డులోని అరవింద పాఠశాలలో పల్స్ పోలియో నిర్వహించారు. పోలియో చుక్కలను పిల్లలకు వేయించాలని, తద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో అనంతరాజు, గిరిజ, అంగనవాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణరాజపురం: బెంగళూరు ఉత్తర తాలూకా దొడ్డబనహళ్లిలో చంద్రగిరి అపార్ట్‌మెంటు ఆవరణలో ఆవలహళ్లి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది చిన్నారులకు చుక్కల మందు వేశారు.

మండ్య : మండ్యలో 723 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే మోహన్ తెలిపారు. మండ్యలోని హాలహళ్లిలో ఆదివారం ఆయన చిన్నారులకు చుక్కల మందు వేశారు.

నదీ తీర ప్రాంతాల్లో చిరుత సంచారం



గాయపడిన గొర్రె



సీసీకెమెరా ఫుటేజీలో చిరుత కదలికలు

కెలమంగలం: చిరుత దాడిలో గొర్రెలు గాయపడిన ఘటన డెంకణీకోట తాలూకా తండ్రి పంచాయతీ పరిధిలో జరిగింది. కొద్ది నెలలుగా సంచరిస్తున్న చిరుతను బంధించేందుకు ఇక్కడ అటవీశాఖ బోన్లు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభం కావడంతో శనత్‌కుమార్‌నదీ తీరంలో ఉన్న చెట్లలో ఆకులు రాలి బోసిపోయి కనిపిస్తున్నాయి. పొదలు లేని ప్రాంతంగా మారడంతో చిరుత సంచారం లేదని స్థానిక ప్రజలు ధైర్యంగా పశువులను మేపుతున్నారు. ఆదివారం ఉదయం ఆ ప్రాంతానికెళ్లిన ఓ గొర్రెపై చిరుత దాడి చేసింది. అటవీశాఖ సిబ్బంది చేరుకొని సీసీకెమెరా ఫుటేజీలను పరిశీలించగా చిరుత జాడలు బయటపడ్డాయి. రెండు మూడు రోజుల్లో బంధిస్తామని, స్థానిక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

కుట్రలో భాగంగానే...

మూడు రోజుల కిందట బాబు అనుకూల తోక పత్రికకు అధిపతిగా వ్యవహరిస్తున్న వ్యక్తి నర్రెడ్డి సునీతతో సహా చంద్రబాబును కలిశారు. కడప ఎంపీగా సునీతను పోటీకి దింపటంపై అక్కడ చర్చ జరిగింది. చివరకు సునీతను పోటీ చేయించని పక్షంలో ఆమె చేత విస్తృతంగా ప్రచారం చేయించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రచారమంటే... నియోజకవర్గంలో తిరగటం మాత్రమే కాదు. జాతీయ స్థాయిలో మీడియా సమావేశాలు కూడా. అందులో భాగమే ఢిల్లీలో సునీత ప్రెస్ కాన్ఫరెన్స్. దానికి కొనసాగింపే శనివారం 'హూ కిల్డ్ బాబాయ్' అంటూ బహిరంగ సభలో చంద్రబాబు ఊగిపోవటం. ఇదంతా ఒక స్కెచ్. సూత్రధారి చంద్రబాబు. పాత్రధారులు సునీత నుంచి దస్తగిరి, బీటెక్ రవి వరకూ ఎందరో!!.

? వివేకా హత్యతో లాభమెవరికి?

జాతీయ, అంతర్జాతీయ నేర పరిశోధన ప్రమాణాలు చెప్పేదొకటే..
ఒక నేరం వల్ల ఎవరికి లాభం ఉంటుందో వారే దోషులు, కుట్రదారులు.
అలా చూసినప్పుడు వివేకా హత్యతో లాభమెవరికి?
ఆయన్ను అడ్డు తొలగించుకోవాలనుకున్నది ఎవరు?
ఈ కోణంలో పరిశీలించినప్పుడు వచ్చే సమాధానాలు రెండే.
వివేకా సంపాదించిన ఆస్తులు తమకే దక్కాలని, ఆయన రాజకీయ వారసత్వమూ తమకే ఉండాలని వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి పంతం పట్టారు.
కాకపోతే షమీమ్ అనే మహిళను వివేకా రెండో వివాహం చేసుకున్నారు. అది అందరికీ తెలిసిన విషయమే. ఆమెతో వివేకాకు ఓ కుమారుడు కూడా ఉన్నాడు. ఈ రెండో వివాహంతో వివేకా కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయి.
వివాహాన్ని వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు, చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు.
అప్పటి నుంచి సౌభాగ్యమ్మ పులివెందులలో నివాసం ఉండకుండా హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె సునీత వద్ద ఉంటున్నారు.

? సునీత నర్రెడ్డి

ఆస్తి మొత్తం మాకే దక్కాలి....




వివేకా రెండో వివాహాన్ని ఆయన కుమార్తె సునీత తీవ్రంగా వ్యతిరేకించారు. తన తండ్రి యావదాస్తీ తమకే చెందాలని ఆమె పంతం పట్టారు. కానీ వివేకానందరెడ్డి తన రెండో భార్యకు ఆస్తిలో వాటా ఇస్తానన్నారు. ఓ ఇల్లు ఇచ్చేశారు. హైదరాబాద్‌లోనూ ఒక ఇల్లు కొనుగోలు చేసి తన కుమారుడిని అక్కడే ఉంచి బాగా చదివిస్తానని షమీమ్‌కు మాట ఇచ్చారు. దాన్ని వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత తీవ్రంగా వ్యతిరేకించారు. వాగ్వాదానికి దిగారు. అక్కడితో ఆగకుండా కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనకున్న చెక్ పవర్‌ను రద్దు చేశారు. షమీమ్‌తో సునీత గొడవ పడ్డారు. పరస్పరం దారుణంగా దూషించుకుంటూ వారిద్దరి మధ్య సాగిన వాట్సాప్ చాటింగ్ వివరాలను కూడా దర్యాప్తు సంస్థలు వెలికి తీశాయి. సౌభాగ్యమ్మ, సునీత మొండి పట్టుదల చూశాక వివేకా కాస్త జాగ్రత్తపడ్డారు. తన ఆస్తిలో షమీమ్‌కు వాటా కల్పిస్తూ వీలునామా రాస్తానన్నారు. అందుకోసం స్టాంపు పేపర్లు కూడా తెప్పించుకున్నారు. అదిగో... అలా స్టాంపు పేపర్లు తెచ్చిన రోజుల వ్యవధిలోనే వివేకా హఠాత్తుగా హత్యకు గురయ్యారు. ఆయన్ను హత్య చేశాక దస్తగిరి సహా హంతకులు ఆ ఇంటిలో ఉన్న బీరువాలో ఏవో స్టాంపు పేపర్లు, రౌండ్ సీల్ కోసం వెతికారని ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగయ్య తన వాంగ్మూలంలో పేర్కొనడం ఇక్కడ ప్రస్తావనార్హం. పైపెచ్చు వివేకా హత్య జరిగిన కొన్ని నెలలకే కుటుంబానికి చెందిన భూములు, ఇతర ఆస్తులన్నింటినీ సునీత తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీన్ని బట్టి హత్య వల్ల ఎవరికి లబ్ధి కలిగిందో తెలుస్తోంది కదా!. మరి హత్య చేయించిందెవరో కనుక్కోవటానికి ఇంతకన్నా ఏం కావాలి?

మాటమార్చి... చంద్రబాబు గూటిలోకి


తన తండ్రి వివేకా హత్య వెనుక అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని మంత్రి ఆదినారాయణ రెడ్డి, అప్పటి టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఉన్నారని సునీత 2019 మార్చిలో చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి చివరి వరకూ కృషి చేశారని కూడా చెప్పారు. 2019 మార్చి 21న హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి మరీ ఇవన్నీ చెప్పిన సునీత... 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసి తన తండ్రి కోరిక నెరవేర్చాలని ప్రజలను కోరారు. కానీ 2020లో స్థానిక సంస్థల ఎన్నికల తరువాత ఆమె పూర్తిగా ప్లేటు ఫిరాయించారు. సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి... చంద్రబాబు గుప్పిట్లోకి వెళ్లి టీడీపీ రాజకీయ కుట్రలో భాగస్వాములయ్యారు.

? చంద్రబాబు

రాజకీయ లబ్ధికి ఇదే అదను..



2019 మార్చి 15న వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు అధికారంలో ఉన్నది తెలుగుదేశం పార్టీ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. నిజానికి కడప జిల్లాలోను, పులివెందులలోను టీడీపీకి ప్రధాన అడ్డంకి వైఎస్ వివేకా. ఆయన అడ్డు తొలగింది. వైసీపీ అధిపతి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సన్నిహితంగా ఉండే కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని దీనిలో ఇరికించి దుష్ప్రచారం సాగిస్తే... కడప జిల్లాలో తాము పాగా వేయొచ్చనేది బాబు దురాలోచన. అందుకే... మార్చి 15న వివేకా హత్య విషయం బయటకు వచ్చిన తరవాత బాబు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. తన సొంత మనిషి అయిన అప్పటి రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావును రంగంలోకి దింపారు. ఆయన అందరినీ ప్రభావితం చేస్తూ దర్యాప్తును ఆదిలోనే తప్పుదోవ పట్టించారు. నిజానికి ఈ హత్య విషయంలో సునీత లక్ష్యం ఒక్కటే. హత్య వెనుకనున్న తన భర్త, బావగార్ల పేర్లు బయటకు రాకుండా ఉండటం. బాబు లక్ష్యమేమో తన ప్రత్యర్థులను ఇరికించటం. అందుకే ఈ విజాతి ధ్రువాలు రెండూ ఆకర్షించుకుని... ఒకరి లక్ష్యానికి మరొకరు సాయంగా నిలిచారని... రానురాను కుట్రను మరింత లోతుల్లోకి తీసుకెళుతున్నారని ఈ వ్యవహారాన్ని దగ్గర్నుంచి పరిశీలిస్తున్నవారు చెప్పే మాట. ఎంపీ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలపై సందేహాలు రేకెత్తించేలా పచ్చ మీడియా ద్వారా అభూతకల్పనలతో దుష్ప్రచారం చేయటం... హత్య వెనుక ఉన్న కుట్రదారుల పాత్ర బయటకురాకుండా కేసును సంక్లిష్టంగా మార్చటం... ఇవన్నీ ఇందులో భాగంగానే జరిగిపోయాయి.



వైఎస్ వివేకాను చంపిందెవరు?

చంద్రబాబు గ్యాంగ్‌కు కృతజ్ఞతలతో.. మీ సునీత

బహుశా... నాలుగేళ్లుగా తాము సాగిస్తున్న కుట్రను మరింత పదునెక్కించాలనుకున్నారో, ఇకపై ముందుకు వెళ్లాలంటే ముసుగు తీయక తప్పదని భావించారో గానీ... సునీత ముసుగు తీశారు. రెండ్రోజుల కిందట ఢిల్లీలో బాబు స్క్రిప్టును చదువుతూ... ఆఖరికి టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభికి కూడా కృతజ్ఞతలు చెప్పారంటే టీడీపీ ఏ స్థాయిలో సునీతకు సహకరించిందో... ఈ కుట్ర ఎంత లోతైనదో తెలియకమానదు. వైఎస్సార్‌సీపీ టికెట్టుపై గెలిచి... ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని దూషిస్తూ సమాజంలో వర్గవిభేదాలు సృష్టించేందుకు కుట్రపన్నిన ఎంపీ రఘురామకృష్ణరాజు... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అత్యంత పరుషపదంతో దూషించిన టీడీపీ నేత పట్టాభి... సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతూ అత్యంత వివాదాస్పదుడిగా మారిన టీడీపీ నేత, పి.గన్నవరం అభ్యర్థి మహాసేన రాజేశ్.. తమ పార్టీ విధానాలతో నిమిత్తం లేకుండా చంద్రబాబు కోసమే పనిచేస్తున్న కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, సీపీఐ నారాయణ... బీజేపీలో ఉంటూ బాబు ఎజెండాను అమలు చేస్తున్న సీఎం రమేశ్... బాబు లాయరు సిద్ధార్థ లూత్రా... నిరపరాధులను హింసించి, వేధించి కేసు దర్యాప్తును పక్కదారి పట్టించిన సీబీఐ అధికారి రామ్‌సింగ్... సీఎం వైఎస్ జగన్‌పై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా... వీళ్లందరికీ సునీత కృతజ్ఞతలు తెలిపారు. అంటే తాను ఆ పచ్చ ముఠాలో సభ్యురాలినేనని విస్పష్టంగా ప్రకటించారు. విశేషమేంటంటే వీళ్లందరిలో ఓ ఉమ్మడి లక్షణం ఉంది. అది... తమ వృత్తులు, పార్టీలకు అతీతంగా చంద్రబాబు కోసం పనిచేయటం. వైఎస్ జగన్‌ను తీవ్రంగా వ్యతిరేకించటం. అది చాలదూ... సునీత పాత్రను బయటపెట్టడానికి!!.

ఇంకా వివేకా ఎవరెవరికి అడ్డంకిగా ఉన్నారు? ఆయన హత్యతో ఏ పాత్రధారికి ఎలాంటి లాభం? ఇవన్నీ ఒకసారి చూద్దాం...

? ఆదినారాయణ రెడ్డి

గుండెపోటు అని మొదట చెప్పింది ఈయనే...



వివేకా గుండెపోటుతో చనిపోయారని మీడియా సాక్షిగా బయటకు చెప్పింది నాటి మంత్రి ఆదినారాయణ రెడ్డి. వివేకా బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తనకు ఫోన్ చేసి గుండెపోటుతో వివేకా మరణించారని చెప్పారని, సిగరెట్లు ఎక్కువ తాగుతారు కనక అలా జరిగి ఉండొచ్చని తాను కూడా అన్నానని ఆయన స్వయంగా మీడియాకు వెల్లడించారు. అంతేకాదు.. శివప్రకాశ్ రెడ్డి ఇదే విషయాన్ని ఎన్నికల ప్రచారం కోసం వెళుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డికి చెప్పటంతో... ఆయన తన వాహనాన్ని నిలిపేసి, వెనక్కు తిరిగి వివేకా ఇంటికి వచ్చారు. మరి గుండెపోటు అని ప్రచారం చేయాల్సిందిగా శివప్రకాశ్‌రెడ్డికి చెప్పిందెవరు?

ఆదినారాయణ రెడ్డికి ఆయనే అడ్డంకి...

2014 ఎన్నికల్లో జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆదినారాయణ రెడ్డి... టీడీపీకి అమ్ముడుపోయారు. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా కూడా చేయకుండా అనైతికంగా టీడీపీ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లో ఆయన్ను కడప ఎంపీ అభ్యర్థిగా చంద్రబాబు నిర్ణయించారు. కానీ ఎంపీగా గెలవటానికి వివేకానందరెడ్డి ప్రధాన అడ్డంకిగా నిలిచారు. జిల్లాపై పూర్తి పట్టున్న వివేకా రంగంలో ఉంటే తాను ఎంపీగా గెలవడం అసాధ్యమని ఆది నారాయణ రెడ్డి గుర్తించారు. ఈ నేపథ్యంలో వివేకా హత్యకు గురయ్యారు. వివేకా హత్య ఆదినారాయణరెడ్డికి రాజకీయంగా ప్రయోజనం కలిగించేదే కదా?

? బీటెక్ రవి...

వివేకా ఉంటే ఇక అంతే..



పులివెందుల నియోజకవర్గంలో కనీసస్థాయిలోనైనా పట్టు సాధించాలన్నది టీడీపీ నేత బీటెక్ రవి లక్ష్యం. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో 2019 ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలు సాగించవచ్చనేది ఆయన పన్నాగం. కానీ వివేకా వైఎస్సార్‌సీపీకి పెద్దదిక్కుగా నిలబడటంతో బీటెక్ రవి ఆటలు సాగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను దొంగదెబ్బ తీసిన బీటెక్ రవికి పులివెందుల అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలని వివేకా పంతం పట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన హత్యకు గురయ్యారు. హత్యకు ముందు రోజు కొమ్మారెడ్డి పరమేశ్వర రెడ్డి(ఈయనకు వివేకాతో ఆర్థిక విభేదాలు తలెత్తాయి)తో బీటెక్ రవి రెండుసార్లు సమావేశమయ్యారు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందారు కూడా. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిచ్చేదే.

? నర్రెడ్డి రాజశేఖరరెడ్డి

లేఖను దాచి... గుండె పోటని ప్రచారం చేసి



వివేకా హత్య కేసు దర్యాప్తు పక్కదారి పట్టించడంలో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావగారు నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డిది కీలకపాత్ర. ఎందుకంటే హత్యకు గురైనపుడు వివేకా తన స్వదస్తూరితో రక్తంతో ఓ లేఖను రాశారు. ఆ లేఖను చూసిన ఎవరికైనా... అది మామూలు మరణం కాదని, ముమ్మాటికీ హత్యేనని తెలిసిపోతుంది. అలాంటి లేఖను ఆ రోజు (2019, మార్చి 15) ఉదయం 6.10 గంటలలోపే వివేకా పీఏ కృష్ణారెడ్డి చూశారు. ఆ విషయాన్ని వెంటనే సునీత భర్త రాజశేఖరరెడ్డికి ఫోన్లో చెప్పారు. 'మేం వచ్చే వరకు ఆ లేఖను గానీ, వివేకా సెల్‌ఫోన్‌ను గానీ ఎవరికీ ఇవ్వవద్దు. పోలీసులకు కూడా చెప్పొద్దు' అని వారు పీఏ కృష్ణారెడ్డిని ఆదేశించారు. ఆ లేఖను గనక వెంటనే పోలీసులకు ఇవ్వమని వారు చెప్పి ఉంటే... మొత్తం వ్యవహారం మరోలా ఉండేది. వివేకాది హత్య అని తేలిపోయేది. ఎవరూ మృతదేహం వద్దకు వెళ్లేవారు కాదు. పోలీసులు తమ పని తాము చేసేవారు. కానీ లేఖను ఉద్దేశపూర్వకంగా గోప్యంగా ఉంచటంతో... వ్యవహారం మొత్తం వారు ప్లాన్ చేసినట్టే సాగింది.

? రామ్‌సింగ్

చంద్రబాబు చేతిలో పావు...

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు ఎంతటి సిద్ధహస్తుడో వివేకా కేసులో సీబీఐ తీరే నిరూపిస్తోంది. వాస్తవానికి ఈ కేసులో నిశితమైన దర్యాప్తు జరిగి దోషులు బయటపడాలని మొదటి నుంచీ భావిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... కేసును సీబీఐ దర్యాప్తు కోసం అప్పగించాలని సునీత కోరగానే సరేనన్నారు. సీబీఐకి అప్పగించారు. కాకపోతే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే ముందస్తు కుట్రతో బీజేపీలోకి పంపిన తన మనుషులు సీఎం రమేశ్, సుజనా చౌదరి ద్వారా చంద్రబాబు చక్రం తిప్పటం మొదలెట్టారు. సీబీఐ దర్యాప్తు అధికారిగా నియమితుడైన రామ్ సింగ్ వివాదాస్పద వ్యవహార శైలే అందుకు తార్కాణం. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాల్సిన ఆయన ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చేసినట్టుగా ఎంపీ అవినాశ్ రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలను లక్ష్యంగా చేసుకుని కేసును పక్కదారి పట్టించారు. దస్తగిరిని ఢిల్లీకి తీసుకెళ్లి బెదిరించి... ప్రలోభాలకుగురి చేసి అప్రూవర్‌గా మార్చారు. తాము అనుకున్నది అతని అప్రూవర్ వాంగ్మూలంగా నమోదు చేశారు. పీఏ కృష్ణారెడ్డిని, మరికొందర్ని ఢిల్లీకి తీసుకువెళ్లి తీవ్ర చిత్రహింసలు పెట్టారు. తాను చెప్పిందే చెప్పాలని వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. వైఎస్సార్ జిల్లాలో పలువురిని అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేయడంతో వారి కుటుంబాలు బెంబేలెత్తిపోయాయి. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు రామ్‌సింగ్ స్వయంగా అసత్య ఆరోపణలు చేశారు. కడపలో తాను కార్లో వెళ్తుంటే ఆగంతకులు వచ్చి హత్య చేస్తానని బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించగా ఆయన కారుపై ఎలాంటి దాడి జరగలేదని... ఎవరూ బెదిరించలేదని నిర్ధారణ అయ్యింది. అనేక ఫిర్యాదులు రావటంతో ఇంతటి వివాదాస్పదుడైన రామ్‌సింగ్‌ను న్యాయస్థానం ఆదేశాలతో కేంద్ర హోమ్ శాఖ ఈ కేసు దర్యాప్తు నుంచి తప్పించింది.

? నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి

రాజకీయ వారసత్వం మాకే దక్కాలి..



వివేకానందరెడ్డి రాజకీయ వారసత్వంపై ఆయన అల్లుడు, చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి కన్నేశారు. ఆయన తరువాత రాజకీయ వారసత్వంగా తమకే పదవులు దక్కాలని భావించారు. కానీ వివేకానందరెడ్డి తన రెండో భార్య షమీమ్‌తో తనకు కలిగిన కుమారుడిని రాజకీయ వారసుడిగా ప్రకటించాలని నిర్ణయించారు. దాంతో రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్ రెడ్డి కంగుతిన్నారు. షమీమ్ ఇంటికి వెళ్లి ఆమెను తీవ్రంగా హెచ్చరించారు. ఆమె కుమారుడిని కిడ్నాప్ చేస్తామని కూడా బెదిరించారు. వారిద్దరికి భయపడి ఆమె పులివెందుల నుంచి హైదరాబాద్ వెళ్లిపోయి ఓ అజ్ఞాత ప్రదేశంలో ఉండేవారు. అంటే వివేకానందరెడ్డి రాజకీయ వారసత్వం తమకే దక్కాలని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివ ప్రకాశ్‌రెడ్డి ఎంతకైనా తెగించేందుకు సిద్ధపడ్డారన్నది సుస్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలోనే వివేకానందరెడ్డి 2019 ఎన్నికల ముందు హత్యకు గురయ్యారు.

? దస్తగిరి

హత్య చేసి... హైడ్రామా



తండ్రిని చంపినవారిపై ఎవరికైనా కోపం, కక్ష ఉంటాయి. కానీ వివేకానందరెడ్డిని ఎంత పాశవికంగా హత్య చేసిందీ వెల్లడించిన దస్తగిరితో వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి అత్యంత సన్నిహితంగా ఉండటం విస్మయం కలిగించేదే. వివేకాను హత్య చేసిన నలుగురిలో దస్తగిరి ఉన్నారన్నది నిర్ధారణ అయ్యింది. కానీ అదే దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డిపై నిరాధారణ ఆరోపణలు చేయిస్తున్నారంటే... వెనుక ఎవరున్నారన్నది కీలకం. చంద్రబాబు, ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివ ప్రకాశ్ రెడ్డి...ఇలా అందరూ దస్తగిరికి బహిరంగంగానే సహకరిస్తున్నారు. వివేకా హత్యకు ముందు రూ.500 కు కూడా అప్పులు చేసిన దస్తగిరి ప్రస్తుతం ఓ కాన్వాయ్‌తో కూడిన బొలేరో వాహనాలను కొనుగోలు చేసి దర్జాగా తిరుగుతున్నారు. ఇక దస్తగిరి చేస్తున్న దుష్ప్రచారాన్ని పదే పదే టీడీపీ అనుకూల మీడియా ప్రసారం చేస్తోంది. ఆయన ఇంటర్వ్యూలు ప్రసారం చేస్తోంది. అంటే దస్తగిరి ఇష్టానుసారంగా చెబుతున్న కట్టుకథలు, చేస్తున్న అసత్య ఆరోపణల వెనుక చంద్రబాబు ముఠా, సునీత కుటుంబమే ఉందన్నది స్పష్టమవుతోంది కదా!.

సెల్‌ఫోన్లో డేటా డిలీట్ చేశారెందుకు?

ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డికి వివేకా రాసిన లేఖను, సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి అందజేశారు. వారు ఆ సెల్‌ఫోన్లోని డేటాను డిలీట్ చేశారు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు ఇచ్చారు. ''ఆ రోజు ఉదయం పీఏ కృష్ణా రెడ్డి ఫోన్ చేసి గాయాలతో వివేకా బాత్రూమ్‌లో పడి ఉన్నారని చెప్పారు. మా నాన్నకు గతంలో కూడా గుండె సమస్య ఉన్నందున బాత్రూమ్‌లో పడి తలకు బలమైన గాయం అయి ఉండొచ్చని భావించా. అందుకే పోలీసులకు అలాగే ఫిర్యాదు చేయమని కృష్ణారెడ్డితో చెప్పా'' అని సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో సునీత పేర్కొన్నారు. లేఖను చూశాకైనా... వివేకా మృతదేహాన్ని చూశాకైనా ఒక డాక్టరైన సునీతకు ఎలాంటి అనుమానమూ రాలేదంటే ఏమనుకోవాలి? ఉద్దేశపూర్వకంగా నిజాలు దాటిపెట్టారని భావించనవసరం లేదా?

తండ్రిని ఓడించినా... సునీతకు ఇష్టులే

వివేకానందరెడ్డిని 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే చంద్రబాబు దొంగదెబ్బ తీసి ఓడించారు. 2017లో వైఎస్సార్ జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ వివేకాను పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ వారే కావడంతో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని భావించారు. వివేకా ఎమ్మెల్సీగా ఎన్నికైతే జిల్లాలో టీడీపీకి ఉనికే ఉండదని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురి చేసి వివేకాను కుట్రతో ఓడించారు. అక్రమాలకు పాల్పడి బీటెక్ రవి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ కుట్రలో చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి సర్వంతామై వ్యవహరించారు. కానీ ఆ ముగ్గురూ సునీతకు, ఆమె భర్త, బావగారికిప్పుడు అత్యంత సన్నిహితులైపోవటమే విచిత్రం.

- సాక్షి, అమరావతి

సన్నిధి

మంచిమాట



సాధారణంగా పెంపకం విషయంలో ఆడపిల్లలకి ఎన్నో జాగ్రత్తలు చెప్పటం చూస్తాం. మగపిల్లలకి చెప్పవలసినది ఏమీ లేదని చాలా మంది అభిప్రాయం. ఈ కారణంగానే సమాజంలో ఎన్నో అయోమయ పరిస్థితులు, అలజడులు, అరాచకాలు. ముఖ్యంగా ఆడపిల్లలకి సమాజం మీద ఏవగింపు, కోపం, పురుష ద్వేషం పెరిగి అవాంఛనీయ సంఘటనలకి దారి తీయటం జరుగుతోంది. అమ్మాయిలు విప్లవభావాల పట్ల ఆకర్షించబడటం, పెళ్లి చేసుకోవద్దు అనుకోటం, చేసుకున్నా విడాకులు తీసుకోవటం, కుటుంబాలు విచ్ఛిన్నం కావటం, లేదా అమ్మాయిలనే పెళ్లి చేసుకోవటమో, సహజీవనం చేయటమో జరుగుతోంది. ఇవన్నీ కొంతవరకైనా అదుపులో ఉండి సమాజంలో సమరసత ఉండటానికి మగపిల్లలని సరిగా పెంచటం ప్రధానం.

మగపిల్లల పెంపకం

మన తరువాతి తరం వారికి మనం ఏం నేర్పిస్తున్నాం? అని కాస్త వివేచన చేస్తే ... అమ్మో! ఎంత భయం వేస్తుందో! మన ప్రవర్తన ద్వారా నేర్పే విషయాలే కాదు, మన మాటలు, ఆదేశాలు, ఉపదేశాలు, బోధలు మొదలైనవి కూడా తలుచుకుంటే బాధ కలుగుతుంది. ఆడ, మగ వివక్ష ఇంట్లోనే మొదలవుతుంది. ఆడపిల్ల పుట్టిందనగానే ముందుగా ''అయ్యో!'' అనేది తల్లే. పెంపకంలోనూ తేడా చూపిస్తారు. ఉదాహరణకి ఇంట్లో అమ్మాయిని తల్లే అంటుంది ''ఆడపిల్లవి నీకెందుకు?'' అని. అంటే ఆడపిల్ల కొన్ని విషయాలు పట్టించుకోకూడదు. అవసరం లేదు. కొడుకు కూడా కొన్ని పట్టించుకోకూడదు. కానీ అవి వేరు. అవి ఇంటి విషయాలు, వంటవిషయాలు మొదలైనవి. ఇంక కొన్ని కుటుంబాలలో ఆస్తిపాస్తులు పంచి ఇవ్వటం మాట అటుంచి కూతురిని ఇంటిపని చెయ్యమని, కొడుకుని చదువుకోమని చెప్పేవారు కనపడుతూనే ఉన్నారు.

ఇద్దరినీ సమానంగా చూడటం ఎట్లా కుదురుతుంది? ఆడపిల్లలు కొంచెం నాజూకుగా ఉంటారు, మగపిల్లలు కాస్త మొరటుగా ఉంటారు కదా! అనిపించటం సహజం. సమానత్వం అంటే వారి పట్ల ప్రవర్తించే తీరు సమానంగా ఉండటం. వారికి ఇష్టమయినవి, వారి అభిరుచులకు తగినవి అందించటం. నిజానికి మగపిల్లలైనా ఏ ఇద్దరికీ ఒకే రకమైన అభిరుచులు, లక్ష్యాలు ఉండవు కదా! ఒకరికి ఇంజనీరింగ్ ఇష్టమైతే మరొకరికి వైద్యవృత్తి ఇష్టం, వేరొకరికి వ్యవసాయం మీద మక్కువ ఉండవచ్చు. వారికి తగిన ప్రోత్సాహం ఇవ్వటం తల్లితండ్రుల కర్తవ్యం. అదే ఆడపిల్లల విషయంలో కూడా పాటించాలి. ఇది ప్రోత్సాహం మాత్రమే. అసలు చేయవలసినది మగపిల్లల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు.

> ప్రతి క్షణం ఆడపిల్ల, మగపిల్లవాడు అనే మాటని అని వారికి ఆ సంగతి గుర్తు చేస్తూ ఉండకూడదు. ఇంటి పనులన్నీ ఇద్దరి చేత సమానంగా చేయిస్తూ ఉండాలి. ఎందుకంటే ఈ రోజులలో ఆడ, మగ అందరు ఉద్యోగం చేస్తున్నారు. మగవారి బాధ్యత అయిన సంపాదించటంలో ఆడవారు భాగస్వామ్యం వహిస్తున్నప్పుడు, ఇంటి పనిలో మగవారు కూడా భాగస్వామ్యం వహించాలి అని చిన్నప్పుడే బుర్రకి ఎక్కించాలి. ముందు తిన్నకంచం తీయటం, వంటపనిలో సహాయం చేయటం అలవాటు చేయాలి. లేకపోతే కోడలు అత్తగారి పెంపకాన్ని తప్పు పడుతుంది.

ఆడపిల్లలని గౌరవించటం నేర్పాలి. ఇది తండ్రి ప్రవర్తన వల్ల కలుగుతుంది. తండ్రి తల్లిని గౌరవిస్తూ ఉంటే కొడుకు కూడా తల్లిని, స్త్రీలని గౌరవిస్తాడు. చీటికి మాటికి భార్యని భర్త చులకన చేస్తూ ఉంటే కొడుకుకి ఆడవారిని తక్కువగా చూడటం అలవాటు అవుతుంది. తరువాతి కాలంలో ఈ భావం సరి అవటం కష్టం. ఇటువంటి పెంపకంలో పెరిగిన వారే ఆడపిల్లలని ఏడిపించటం నుండి యాసిడ్ దాడులు, అత్యాచారాలు మొదలైనవి చేస్తూ ఉంటారు. ఏ ఇంట్లో తండ్రి తల్లిని అగౌరవపరచడో, ఆడపిల్లలని బరువుగా భావించ కుండా ఉంటారో ఆ ఇంట్లో పెరిగిన మగపిల్లలు తోటి ఆడపిల్లలతో మర్యాదగా ప్రవర్తిస్తారు. అటువంటి వాళ్ళు ఉన్న సమాజంలో మన ఆడపిల్లలు కూడా భద్రంగా ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

గంగే మాం పాహి



వాగ్గేయకార వైభవం

విష్ణుమూర్తి స్పర్శచేత పరమపావనియైన గంగలో స్నానం చేస్తే సకల పాపాలు పోతాయన్నది సనాతన ధర్మ విశ్వాసం.

అంటే... పాపాలు చేసి గంగలో మునిగి వాటిని పోగొట్టుకోవచ్చని అర్థం చేసుకోకూడదు. తెలిసో తెలియకో ఇప్పటివరకు చేసిన పాపాలు గంగాస్నానంతో పోగొట్టుకుని, ఇక మీదట ఎటువంటి పాపపు పనులు చేయకుండా నన్ను నేను నియంత్రించుకునే శక్తినీయవలసిందిగా భగవంతుని వేడుకోవాలి. అదే ధర్మాచరణం. వద్దన్న పని వదిలి పెట్టడమే ధర్మాచరణ. అది విష్ణువుకు ప్రీతిపాత్రం. ముత్తుస్వామి దీక్షితార్ వారు గంగపై కీర్తన చేస్తూ... ''గంగే మాం పాహి గిరీశ శిర స్థితే/గంభీర కాయే గీత వాద్య ప్రియే/అంగజ తాత ముదే అసి వరుణా మధ్యే /అక్రూర పూజితే అఖిల జనానందే...'' అన్నారు. గంగమ్మ గొప్పదనాన్ని చెబుతూ... అక్రూరపూజితే అని కూడా అన్నారు.

గంగను కీర్తిస్తూ అక్రూరుడి ప్రస్తావన ఎందుకు తెచ్చినట్టు ..? మిగిలిన పురాణాలన్నింటినీ వ్యాస భగవానుడు రాస్తే... విష్ణు పురాణాన్ని పరాశర మహర్షి ఇచ్చాడు. శమంతకోపాఖ్యానం దీనిలోనిదే. అయితే ఇక్కడ గమ్మత్తయిన ఒక విషయం చెప్పుకోవాలి. వినాయక చవితినాడు వ్రత మహాత్మ్యంలో మనం ఒక కథ చదువుకుంటూంటాం. ఒక పసిపిల్ల ఉయ్యాల్లో ఉందనీ, ఆ పిల్లను కృష్ణుడు పెళ్ళి చేసుకున్నాడనీ, ఆమే జాంబవతి అనీ... ఇలా సాగుతుంది.. కానీ నిజానికి విష్ణు పురాణంలో చెప్పింది వేరు. ఉయ్యాల్లో ఉన్నది పసిపిల్లవాడు. దానిని ఊపుతున్న యవ్వని జాంబవతిని కృష్ణపరమాత్మ పెళ్లి చేసుకున్నాడు. వినాయక చవితి రోజున మిగిలిన కథను పూర్తిగా చదివినా చదవకపోయినా...''...తవ హియేషా శమంతకః'' అంటూ ముగిస్తారు.




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నిజానికి శ్రీకృష్ణుడు శమంతక మణివల్ల ఎన్ని కష్టాలుపడాలో అన్ని కష్టాలు పడ్డాడు. అటు సత్యభామకు దూరమయిపోయాడు, ఇటు జాంబవతికీ దూరమయ్యాడు. శమంతక మణిని కృష్ణుడే కాజేసాడని వారిద్దరే కాదు, బలరాముడు, ఇతర బంధువులు, ద్వారకానగరవాసులూ అందరూ అనుమానించారు. ఇంతకూ అసలు శమంతకమణి ఎక్కడుంది? అక్రూరుడి దగ్గర. అక్రూరుడు ఎక్కడున్నాడు? అంటే... ఆ మణికి ఒక నియమం ఉంది. బాహ్యాభ్యంతర శౌచం ఎవరికుంటుందో వారి దగ్గర అది బంగారం పెడుతుంది, దాన్ని దాచుకోకుండా లోకసంక్షేమం కోసం వెచ్చించే పరమ భాగవతోత్తముడి దగ్గర ఉంటుంది. లేకపోతే చంపేస్తుంది. ప్రసేనుడు, సత్రాజిత్తు అలాగే చచ్చిపోయారు. కాబట్టి అది ఉన్నచోట నిత్యాన్నదానాలతో నవ వసంతశోభ ఉంటుంది. అలా కాశీ వెలిగిపోతున్నది కాబట్టి అక్కడ అక్రూరుడు ఉంటాడని భావించి 'అక్కడికి వెళ్ళి అక్రూరుడిని పిలుచుకురండి' అని కృష్ణుడు ఆదేశించాడు. గంగను పూజిస్తూ గంగలో స్నానం చేస్తున్న అక్రూరుడికి కృష్ణుడి సందేశం వినిపించగానే.. అక్రూరుడు వెళ్ళి ఆ శమంతకమణిని ఇవ్వబోతే...'' అంతః శౌచం, బాహ్య శౌచం' నీలో ఉన్నాయి కనుక అది నీవద్దే ఉంచుకో' అని కృష్ణుడు చెప్పాడు. అక్రూరుడు ద్వారకానగరం వదిలి పెట్టాల్సి వచ్చినప్పుడు కాశీవెళ్ళి అక్కడే ఉండిపోయాడు గంగ కోసం. పరమ భక్తితో రోజూ పూజిస్తూ నిత్యం గంగలో స్నానం చేసేవాడు. శాస్త్రాలు చదవకపోయినా గంగానది ఒడ్డున గురువుగారి శుశ్రూషలో ఇన్ని విషయాలు తెలుసుకున్న దీక్షితార్ వారి కీర్తనల్లో అనేక శాస్త్ర రహస్యాలను ప్రస్తావిస్తారు. వాటిలో గంగను స్తుతిస్తూ చేసిన ఈ కీర్తన ఒకటి. ●

ధమ్మపథం

సమ్యక్ దర్శనం



మగధ రాజ్య రాజధాని రాజగృహ సమీపంలోని పక్షి పర్వతం. ఆ పర్వతం చివర విశాలమైన చదును భాగం. ఒకపక్క పెద్ద పెద్ద కొండ రాళ్ళు. ఆ రాళ్ళ సందులో చిన్న గుహ. అది చల్లగా విశ్రాంతి తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. చదును భాగం చుట్టూ పనస చెట్లు దట్టంగా ఉన్నాయి. ఒకరోజు బుద్ధుడు సాయంత్రం వేళ ఆ గుహ ముందున్న రాతిమీద కూర్చొని ఉన్నాడు. ఆ సమయానికి వచ్చాడు దీర్ఘనఖుడు అనే సన్యాసి. అతను అగ్ని ఆరాధకుడు. దీర్ఘనఖుడు వచ్చి, వంగి బుద్ధునికి నమస్కరించాడు. ఒక పక్కన నిలబడ్డాడు.

ఆ రోజుల్లో కొందరు తాపసులు ''మీరు చెప్పేది ఏదీ నాకు సమ్మతం కాదు. దేన్నీ నేను ఒప్పుకోను'' అనేవారు. ఏ విషయాన్ని చెప్పినా, దాన్ని ఏదో ఒక విధంగా విమర్శించేవారు. తప్పులు వెదికేవారు. అంగీకరించేవారు కాదు.

ఇంకొందరున్నారు. వారు ప్రతిదాన్నీ అంగీకరించేవారు. ఆయా విషయాలపై వాదవివాదాలు చేసేవారు కాదు. 'అలాగే... 'అవునవును' అంటూ తలలూపేవారు.

ఇక మూడోరకం ఉన్నారు. వారు ''మాకు కొంత సమ్మతం కాదు'' అనేవారు.

దీర్ఘనఖుడు ఇందులో మొదటి రకం వాడు. ''ఏదీ నాకు సమ్మతం కాదు'' అనేవాడు.

ఆరోజు ఇదే విషయం గురించి చర్చించుకుంటూ....

''దీర్ఘనఖా! ఏదీ నాకు సమ్మతం కాదు' అనేదైనా నీకు సమ్మతమేనా?'' అని అడిగాడు.

''గౌతమా! అది మాత్రం నాకు సమ్మతమే'' అన్నాడు. బుద్ధుడు అతని వైపు తదేకంగా చూశాడు. బుద్ధుని ప్రశాంత దృక్కులు తనని ఏదో ప్రశ్నిస్తున్నట్లు గమనించాడు.

అప్పుడు బుద్ధుడు– ''ఏదీ సమ్మతం కాదు... అనేవారి దృష్టి రాగరహితంగా ఉంటుంది. దేనితో కలవకుండా ఉంటుంది. పొగడ్తలకు, ప్రతి దాన్నీ పొందాలనే భావనకూ దూరంగా ఉంటుంది. దేనినీ పట్టుకుని వేళ్ళాడదు!'' అన్నాడు.

''గౌతమా! మంచిది. మీరు నా దృష్టి కోణాన్ని మెచ్చుకుంటున్నారన్నమాట'' అన్నాడు.

''దీర్ఘనఖా! ఇంకా విను. 'అంతా సమ్మతమే అనేవారు దీనికి భిన్నంగా ఉంటారు. వారి దృష్టి రాగంతో ఉంటుంది. ప్రతి దానితో కలసిపోతుంది. పొగడ్తలను కోరుకుంటుంది. ప్రతి దాన్నీ పొందాలి అనుకుంటుంది. ఇక మూడోరకంవారి దృష్టి ఈ రెండు రకాలనూ కలగలుపుకుని ఉంటుంది. విశేషం ఏమిటంటే.. ఈ మూడు రకాల వారిలో ప్రతి ఒక్కరూ తమ దృష్టే సరైనదనుకుంటారు. ఇతరుల్ని విమర్శిస్తారు. వ్యతిరేకిస్తారు. తమ అనుభవంలో... తాము అనుకునేదానికి భిన్నమైన ఫలితం చూసినా, గ్రహించినా గానీ,,, వీరు మారరు. మూర్ఖంగా తాను అనుకున్నదే సత్యం అనుకుంటారు. సర్వం అదే అని నిర్ణయించుకుంటారు. మిగిలినదంతా మిథ్యే అని భావిస్తారు. దీని వల్ల ప్రజ్ఞని (ఎరుకను) కోల్పోతారు. సత్యాన్ని ఆవిష్కరించలేరు'' అని చెప్పాడు.

బుద్ధుడు అలా మూడురకాల దృష్టి గలవారి గురించి చెప్పాక, తన తప్పు ఏమిటో దీర్ఘనఖునికి అర్థమైంది.

ద్వేషం, క్రోధాలు ఎలా సత్యాన్ని తెలుసుకోడానికి అవరోధాలలో... రాగం మోహం కోరికలు కూడా అలాంటి అవరోధాలే అని గ్రహించాడు. ఇవి తొలగించుకుని సమ్యక్ దర్శనం వల్లనే సత్యాన్ని సత్యంగా.. ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోగలం అని అర్థం చేసుకున్నాడు.

మనస్సుని మాలిన్య రహితం చేసుకోవడం వల్ల సమ్యక్ దృష్టి కలుగుతుందని గ్రహించి... వినమ్రంగా బుద్ధుని పాదాలంటి నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

కల నిజమైంది



● రష్మిక

చిన్ననాటి కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందంటున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. జపాన్‌లోని టోక్యోలో జరిగిన ఎనిమిదో ఎడిషన్ 'క్రంచీ రోల్ అనిమే' అవార్డ్స్ ఫంక్షన్‌కు అతిథిగా వెళ్లారు రష్మిక. విజేతలకు అవార్డులను అందజేశారు. జపాన్‌కు వెళ్లడం పట్ల రష్మికా మందన్నా ఈ విధంగా స్పందించారు.''నా చిన్నతనంలో జపాన్‌కు వెళ్లాలనే కల ఉండేది. అయితే అది అసాధ్యం అనుకున్నాను. కానీ ఇన్నేళ్లుగా జపాన్‌కు వెళ్లాలనే కల మాత్రం అలానే ఉంది. ఇప్పుడు అది సాధ్యమైనందుకు సంతోషంగా ఉంది. కొన్నేళ్ల నా కల నిజమైంది. జపాన్‌లోని ఆహారం, వాతావరణం, ఇక్కడి ప్రజలు నాపై చూపించిన ప్రేమ, ఆదరణ నాకు ఆనందాన్నిచ్చాయి. జపాన్ నాకు ఇప్పుడు చాలా స్పెషల్'' అని 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు రష్మిక. ఇక సినిమాల విషయానికి వస్తే.. అల్లు అర్జున్ 'పుష్ప 2', ధనుష్ 'డీఎన్ఎస్' (వర్కింగ్ టైటిల్), హిందీ 'ఛావా'లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. అలాగే 'ది గాళ్ ఫ్రెండ్', 'రెయిన్ బో' అనే ఉమెన్‌సెంట్రిక్ ఫిల్మ్స్ కూడా చేస్తున్నారు రష్మికా మందన్నా.



● ప్రభాస్

యాక్షన్‌తో స్టార్ట్

'సలార్' రెండో భాగం 'సలార్: శౌర్యంగ పర్వం' షూటింగ్‌కు రెడీ చేస్తున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' గత ఏడాది డిసెంబరులో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో వెంటనే 'సలార్' రెండో భాగం 'సలార్: శౌర్యంగపర్వం' పనులను ఆరంభించారు ప్రశాంత్ నీల్. ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి కావస్తుండటంతో ఏప్రిల్‌లో షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారని తెలిసింది. ముందుగా యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తారట ప్రశాంత్ నీల్. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, బాబీ సింహా, శ్రియా రెడ్డి, ఈశ్వరీ రావు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 చివర్లో విడుదల కానుందని సమాచారం.



నాకు నేనే పరాయిదానిలా...



● ఇన్‌స్టాలో ఇలియానా తాజా ఫొటో

''నేను ఫొటోలు దిగి చాన్నాళ్లయింది. అలాగే ఈ ప్లాట్‌ఫామ్‌లో నా అభిప్రాయాలు షేర్ చేసి కూడా చాలా రోజులైంది. తల్లయ్యాక బిడ్డను చూసుకోవడం, ఇల్లు చక్కబెట్టుకోవడంతోనే సరిపోతోంది. నాకోసం టైమ్ కేటాయించుకోలేకపోతున్నాను'' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పేర్కొన్నారు ఇలియానా. గత ఏడాది ఆగస్టులో ఒక బాబుకి జన్మనిచ్చారు ఇలియానా. ప్రెగ్నెన్సీ తర్వాత సహజంగా కొందరికి ఏర్పడే డిప్రెషన్ లాంటిది ఇలియానాకి కూడా ఏర్పడిందట. సినిమా స్టార్‌గా కొన్నేళ్లు మేకప్‌కి దగ్గరగా ఉన్న ఇలియానాకి ఇప్పుడు మేకప్ బాక్స్ తెరిచే సమయం కూడా లేదు. ఇక హెయిర్ స్టయిల్ అంటారా? గట్టిగా ముడి వేసుకునే ఉంటున్నారట. తల్లయ్యాక వచ్చిన ఆ మార్పులు గురించి ఇలియానా మాట్లాడుతూ – ''మా చిన్నోడి చేతికి జుట్టు దొరికితే అంతే సంగతులు. అందుకే దాదాపు ముడి వేసుకునే ఉంటున్నాను'' అంటూ ఆ ఫొటోను కూడా షేర్ చేశారు. ఇంకా చెబుతూ – ''అమ్మ అయ్యాక నా లైఫ్ స్టయిల్‌లో చాలా మార్పు వచ్చింది. ఇప్పటివరకూ ఒక రకంగా.. ఇప్పుడు ఒక రకంగా. నాకు నేనే పరాయిదానిలా అనిపిస్తున్నాను. తల్లయ్యాక కొంతమంది త్వరగా కోలుకుని, పనిలో (కొందరు హీరోయిన్లు సినిమాలు చేయడం గురించి) పడిపోతారు. కానీ నేను అంత త్వరగా కమ్‌బ్యాక్ కాలేను. అయితే ఎప్పటికైనా రావడం ఖాయం. కాకపోతే త్వర త్వరగా కాకుండా నాకు కుదిరినట్లు మెల్లిగా వర్కవుట్స్ చేసుకుంటూ, పూర్వపు శక్తి తెచ్చుకున్నాకే వస్తాను. ఇలా ఇంటికి, నా బిడ్డకి అంకితం కావడం నాకు ఏమాత్రం బాధగా లేదు. ఎందుకంటే అన్నింటికన్నా నా జీవితంలోకి వచ్చిన ఈ అందమైన చిన్నోడు ముందు నాకు ఏదీ పెద్దగా అనిపించడంలేదు. ఇప్పుడైతే ప్రతి రోజూ ఓ 30 నిమిషాలు వర్కవుట్ చేస్తున్నాను. ఆ తర్వాత జస్ట్ ఓ ఐదు నిమిషాలు స్నానం చేసి, నా ఇంటి పనులతో బిజీ అవుతున్నాను. ఒక్కోసారి వర్కవుట్ చేసే వీలు కుదరడంలేదు. అయినా ఫర్వాలేదు. నేను చెప్పొచ్చేదేంటంటే కచ్చితంగా 'బౌన్స్ బ్యాక్' అవుతా. అయితే కొంత ఆలస్యంగా..'' అన్నారు ఇలియానా. ఇదిలా ఉంటే... గత ఏడాది మైఖేల్ డోలన్‌ని పెళ్లాడారు ఇలియానా. అయితే కొన్నాళ్ల పాటు రహస్యంగా ఉంచారు. కుమారుడు పుట్టాక మైఖేల్ పూర్తి ఫొటోను షేర్ చేశారు ఇలియానా.

మధ్యతరగతి షరతులు

చైతన్యా రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డా. కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకలో హీరో చైతన్యా రావు మాట్లాడుతూ– ''షరతులు వర్తిస్తాయి' ట్రైలర్ మీకు నచ్చిందనే అనుకుంటున్నాను. దిగువ మధ్య తరగతి, మధ్యతరగతి వాళ్ల జీవితాల్లో ఉండే సంతోషాలు, బాధలు, భావోద్వేగాలతో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో చిరంజీవి పాత్రలో నేను, విజయశాంతి పాత్రలో భూమి శెట్టి నటించాం. ప్రేక్షకులందరూ చూడాల్సిన చిత్రం ఇది'' అన్నారు. ''ఓ మంచి పాయింట్‌కు కమర్షియల్ హంగులు జోడించి ఈ సినిమా తీశాం. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన చిత్రం'' అన్నారు కుమారస్వామి. ''ఏషియన్ ఫిలిమ్స్, సురేష్ ప్రొడక్షన్స్ మా సినిమాను రిలీజ్ చేస్తున్నాయి. ఇప్పటికి 60 థియేటర్స్ కన్ఫార్మ్ అయ్యాయి'' అన్నారు డా. కృష్ణకాంత్ చిత్తజల్లు. ''కరీంనగర్ నేపథ్యంలో సాగే ఈ సినిమా కోసం తెలంగాణ యాస నేర్చుకున్నా'' అన్నారు భూమి. నటుడు సంతోష్ యాదవ్ మాట్లాడారు.



● చైతన్యా రావు, భూమి శెట్టి

హిందీకి అరి



● సాయి కుమార్, అనసూయ, శుభలేఖ సుధాకర్, శ్రీకాంత్ అయ్యంగార్

వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. ఆర్వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మించారు. 'పేపర్ బాయ్' చిత్రదర్శకుడు జయశంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ''ఈ చిత్రం విడుదలకు ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానుంది. త్వరలోనే గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. ఈ సినిమా హిందీ రీమేక్‌పై అభిషేక్ బచ్చన్ ఆసక్తిగా ఉన్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. కాగా.. ఈ చిత్రం ప్రివ్యూని అభిషేక్ బచ్చన్‌కి చూపించారట దర్శకుడు జయశంకర్. కాన్సెప్ట్ యూనివర్సల్‌గా ఉందని, హిందీలో రీమేక్ చేస్తే బాగుంటుందని అభిషేక్ బచ్చన్ పేర్కొన్నట్లు సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: కృష్ణ ప్రసాద్.

వెంకటేశ్‌కి జోడీగా...

హీరోయిన్‌గా మీనాక్షీ చౌదరి ప్రస్తుతం ఫుల్‌ఫామ్‌లో ఉన్నారు. తమిళ హీరో విజయ్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్', వరుణ్ తేజ్ 'మట్కా', దుల్కర్ సల్మాన్ 'లక్కీ భాస్కర్', విశ్వక్ సేన్ పదో చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు ఈ యంగ్ బ్యూటీ. కాగా మీనాక్షీకి హీరోయిన్‌గా మరో సూపర్ చాన్స్ వచ్చిందని టాక్. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్–దర్శకుడు అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో ఓ విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీ తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారని సమాచారం. కాగా ఈ సినిమాలో హీరోయిన్‌గా తొలుత త్రిష పేరు వినిపించింది. తాజాగా మీనాక్షీ చౌదరి పేరు తెరపైకి వచ్చింది. వెంకీ వంటి స్టార్ హీరో సినిమా కాబట్టి మీనాక్షీ కూడా ఆల్మోస్ట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసినట్టేనని అంటున్నారు ఫిల్మ్‌నగర్ వాసులు. ఇక ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నారని, 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఇంకా.. కథ రీత్యా ఇందులో ఓ గెస్ట్ రోల్ ఉందని, ఈ పాత్రలో రవితేజ లేదా బాలకృష్ణ కనిపిస్తారని భోగట్టా.



● మీనాక్షీ చౌదరి

విలేజ్‌లో మిస్టరీ

రవితేజ నున్నా, నేహ జురెల్ హీరో హీరోయిన్‌గా నటించిన చిత్రం 'రాజు గారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి'. మణికొండ రంజిత్ సమర్పణలో సత్యరాజు దర్శకత్వంలో ముత్యాల రామదాసు, నున్నా కుమారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సాగే విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీగా ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కమర్షియల్ సబ్జెక్ట్ ఈ చిత్రం. ఎన్నో ఇబ్బందులు పడి ఈ సినిమా పూర్తి చేశాం'' అన్నారు రవితేజ. ''ఈ సినిమాలో హిట్ కళ కనిపిస్తోంది'' అన్నారు ముత్యాల రామదాసు. ''ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు సత్యరాజ్. ఈ చిత్రానికి సంగీతం: రోషన్ సాలూరి.



● నేహ జురెల్, రవితేజ నున్నా



తొలి రౌండ్‌లోనే దీపక్ పరాజయం

పారిస్ ఒలింపిక్స్ వరల్డ్ బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నీలో తొలి రోజు బరిలోకి దిగిన ఇద్దరు భారత బాక్సర్లకు నిరాశే ఎదురైంది. ఆదివారం ఇటలీలో జరిగిన పురుషుల 51 కేజీల విభాగంలో దీపక్... +92 కేజీల విభాగంలో నరేందర్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. నిజాత్ హుసెనోవ్ (అజర్‌బైజాన్)తో జరిగిన బౌట్‌లో దీపక్ 2–3తో... టియాఫాక్ (జర్మనీ)తో జరిగిన బౌట్‌లో నరేందర్ 0–5తో ఓడిపోయారు. హరియాణాకు చెందిన దీపక్ గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు.


ప్రజ్ఞానందకు రెండో విజయం

ప్రాగ్ మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద రెండో విజయం నమోదు చేశాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతితో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద 52 ఎత్తుల్లో గెలిచాడు. డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన గేమ్‌లో భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 61 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఐదో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద, గుకేశ్ 2.5 పాయింట్లతో వరుసగా నాలుగో, ఐదో ర్యాంక్‌లో ఉన్నారు.



‘టాప్’లోకి భారత్

డబ్ల్యూటీసీ ర్యాంకింగ్స్



దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023–2025లో రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో భారత్ గెలుపొందడం ద్వారా పాయింట్ల శాతం (64.58)తో రెండో స్థానాన్ని పటిష్ఠ పర్చుకుంది. అయితే టీమిండియా తాజా డబ్ల్యూటీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌కు ఎగబాకడానికి కారణం... న్యూజిలాండ్ సొంతగడ్డపై జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడటమే! కివీస్ ర్యాంకు దిగజారడంతో భారత్ అగ్రస్థానం చేరుకుంది. ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఐదు గెలిచి రెండింట ఓడిన భారత్ ఒక మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకుంది. ఐదు మ్యాచ్‌లాడిన న్యూజిలాండ్ మూడు గెలిచి, రెండు ఓడింది. దీంతో 60 పాయింట్ల శాతంతో రెండో స్థానానికి పడిపోయింది. ఆసీస్‌తో ఓటమికి ముందు కివీస్ 75 శాతంతో అగ్రస్థానంలో ఉండేది. కానీ 172 పరుగుల భారీతేడాతో ఓడిపోవడంతో టాప్‌ర్యాంకును కోల్పోయింది.

ప్రవీణ్‌కు నిరాశ



గ్లాస్గో (స్కాట్లాండ్): ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత ట్రిపుల్ జంపర్ ప్రవీణ్ చిత్రావెల్ తన అత్యుత్తమ ప్రదర్శన కూడా నమోదు చేయలేకపోయాడు. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో 22 ఏళ్ల ప్రవీణ్ 16.45 మీటర్ల దూరం దూకి 11వ స్థానంలో నిలిచాడు. ఫాబ్రిస్ జాంగో (బుర్కినఫాసో; 17.53 మీటర్లు) స్వర్ణం, యాసిర్ మొహమ్మద్ ట్రికీ (అల్జీరియా; 17.35 మీటర్లు), టియాగో పెరీరా (పోర్చుగల్; 17.08 మీటర్లు) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించాడు. 17.37 మీటర్లతో తన పేరిట ఉన్న జాతీయ రికార్డు ప్రదర్శనను ప్రవీణ్ గ్లాస్గోలో పునరావృతం చేసి ఉంటే అతని ఖాతాలో రజత పతకం చేరేది. గత ఏడాది ఆసియా క్రీడల్లో ప్రవీణ్ (17.68 మీటర్లు) కాంస్య పతకాన్ని సాధించాడు.

ఢిల్లీ ‘హ్యాట్రిక్’...

- మూడో విజయంతో అగ్రస్థానానికి
- రాణించిన మెగ్ లానింగ్, జెస్ జొనాసెన్, రాధా యాదవ్
- వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఓడిన గుజరాత్ జెయింట్స్



మెగ్ లానింగ్

బెంగళూరు: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ ‘హ్యాట్రిక్’ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన పోరులో ఢిల్లీ 25 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. టోర్నీ తొలి మ్యాచ్‌లో ముంబై చేతిలో ఓడిన తర్వాత క్యాపిటల్స్ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. అయితే గుజరాత్ పరిస్థితి మాత్రం మరింత దిగజారింది. ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన టీమ్ ఒక్క గెలుపు కూడా లేకుండా వరుసగా నాలుగో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 163 చేయగా.... జెయింట్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 138 పరుగులకే పరిమితమైంది. ఢిల్లీ కెప్టెన్ మెగ్ లానింగ్ (41 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో తన జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించింది. షఫాలీ వర్మ (13), జెమీమా రోడ్రిగ్స్ (7) విఫలం కావడంతో లానింగ్ ముందుండి నడిపించింది. అలైస్ క్యాప్సీ (17 బంతుల్లో 27; 5 ఫోర్లు)తో రెండో వికెట్‌కు లానింగ్ 26 బంతుల్లో 38 పరుగులు జోడించగా... చివర్లో అనాబెల్ సదర్లాండ్ (12 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని కీలక పరుగులు జత చేసింది. గుజరాత్ పేలవ ఫీల్డింగ్, క్యాచ్‌లు వదిలేయడం కలిసొచ్చినా ఢిల్లీ వాటిని పూర్తిగా వినియోగించుకోలేకపోయింది. ఒకదశలో 105/2తో మెరుగైన స్థితిలో నిలిచిన జట్టు ఆ తర్వాత వేగంగా వికెట్లు కోల్పోయింది. చివరి 5 ఓవర్లలో ఢిల్లీ 33 పరుగులు చేసింది. జెయింట్స్ పేసర్ మేఘనా సింగ్ (4/37) కీలక వికెట్లు తీయగా... గార్డ్‌నర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ తడబడింది. సున్నా స్కోరు వద్దే వాల్‌వార్ట్ (0) వెనుదిరగ్గా... బెత్ మూనీ (12), లిచ్‌ఫీల్డ్ (15), వేద కృష్ణమూర్తి (12) ప్రభావం చూపలేకపోయారు. అయితే యాష్లీ గార్డ్‌నర్ (31 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే పోరాడగలిగింది. అయితే 35 బంతుల్లో 59 పరుగులు చేయాల్సిన స్థితిలో జెస్ జొనాసెన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి గార్డ్‌నర్ స్టంపౌట్ కావడంతో గుజరాత్ ఆశలు కోల్పోయింది. ఆ తర్వాత జట్టు ఇన్నింగ్స్ లాంఛనమే అయింది. ఢిల్లీ బౌలర్లలో రాధా యాదవ్, జెస్ జొనాసెన్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... అరుంధతి రెడ్డి, శిఖా పాండే చెరో వికెట్ తీశారు. నేడు జరిగే మ్యాచ్‌లో బెంగళూరుతో యూపీ వారియర్స్ తలపడుతుంది. లీగ్ దశలో తొలి అర్ధ భాగం మ్యాచ్‌లు (11) నేటితో బెంగళూరులో ముగియనున్నాయి. మంగళవారం నుంచి తర్వాతి 11 మ్యాచ్‌లకు ఢిల్లీ వేదిక కానుంది.



జెస్ జొనాసెన్, రాధా యాదవ్ సంబరం

తొలి కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్

ఆదివారం మ్యాచ్‌లో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. డబ్ల్యూపీఎల్‌లో కన్‌కషన్ సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగిన తొలి ప్లేయర్‌గా గుజరాత్ జెయింట్స్‌కు చెందిన సయాలీ సద్‌గరే గుర్తింపు తెచ్చుకుంది. జెయింట్స్ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో ఢిల్లీ బ్యాటర్ జొనాసెన్ షాట్ కొట్టగా డీప్ మిడ్ వికెట్ వద్ద క్యాచ్‌ను అందుకునే క్రమంలో హేమలత పట్టు తప్పింది. క్యాచ్ చేజారగా... బంతి ఆమె నుదుటికి బలంగా తాకింది. దాంతో కన్‌కషన్‌తో హేమలత మైదానం వీడింది. గుజరాత్ తరఫున పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన సయాలీ 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది.

లయన్‌కు 6 వికెట్లు

తొలి టెస్టులో న్యూజిలాండ్‌పై ఆస్ట్రేలియా ఘనవిజయం

వెలింగ్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. మ్యాచ్ నాలుగో రోజు ఆదివారం ముగిసిన ఈ టెస్టులో ఆసీస్ 172 పరుగుల తేడాతో కివీస్‌పై విజయం సాధించింది. ఆస్ట్రేలియా ఆఫ్ స్పిన్నర్ నాథన్ లయన్ (6/65) ఆరు వికెట్ల అద్భుత బౌలింగ్ ప్రదర్శన ముందు సొంతగడ్డపై న్యూజిలాండ్ నిలవలేకపోయింది. 369 పరుగుల లక్ష్యాన్ని అందుకునే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 111/3తో ఆట కొనసాగించిన కివీస్ 64.4 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. టాప్ స్కోరర్ రచిన్ రవీంద్ర (59) ఏడో ఓవర్లో వెనుదిరగడంతోనే జట్టు పతనం మొదలైంది. బ్లన్‌డెల్ (0), ఫిలిప్స్ (1) విఫలం కాగా స్కాట్ కుగ్‌లీన్ (26) కొద్దిసేపు నిలబడ్డాడు. క్రీజ్‌లో పట్టుదల కనబర్చిన డరైల్ మిచెల్ (38)ను హాజల్‌వుడ్ చివరి వికెట్‌గా అవుట్ చేయడంతో సిరీస్‌లో ఆసీస్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలి ఇన్నింగ్స్‌లో కీలక సెంచరీ సాధించిన కామెరాన్ గ్రీన్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన లయన్ మ్యాచ్‌ను 10/108తో ముగించాడు. లయన్ ఒక ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టడం ఇది 24వసారి కాగా, మ్యాచ్‌లో 10 వికెట్లు తీయడం ఐదోసారి కావడం విశేషం. రెండో టెస్టు శుక్రవారం నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో జరుగుతుంది.



శార్దుల్ శతకం...

- భారీ ఆధిక్యంలో ముంబై
- తమిళనాడుతో రంజీ సెమీస్



శార్దుల్ ఠాకూర్

ముంబై: దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో 41 సార్లు చాంపియన్ అయిన ముంబై రెండో సెమీఫైనల్లో భారీ ఆధిక్యంలోకి దూసుకెళుతోంది. తమిళనాడుతో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లోయర్ ఆర్డర్ బ్యాటర్ శార్దుల్ ఠాకూర్ (105 బంతుల్లో 109; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) అనూహ్యంగా చెలరేగాడు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 100 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది. ప్రస్తుతం ముంబై 207 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 45/2తో ఆట కొనసాగించిన ముంబైని తమిళనాడు స్పిన్నర్ సాయికిశోర్ (6/97) తిప్పేశాడు. ముషీర్ ఖాన్ (131 బంతుల్లో 55; 6 ఫోర్లు) ఒక్కడే రాణించగా... ఒకదశలో 106/7తో పీకల్లోతు కష్టాల్లో పడిన ముంబైని శార్దుల్ అసాధారణ పోరాటంతో ఆదుకున్నాడు. ఎనిమిదో వికెట్‌కు హార్దిక్ తమోర్ (92 బంతుల్లో 35; 3 ఫోర్లు)తో కలిసి 105 పరుగులు... తొమ్మిదో వికెట్‌కు తనుశ్ కొటియన్ (109 బంతుల్లో 74 బ్యాటింగ్; 10 ఫోర్లు)తో కలిసి శార్దుల్ 79 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తొలి శతకం పూర్తి చేసుకున్నాక కుల్దీప్‌సేన్ (2/65) బౌలింగ్‌లో శార్దుల్ నిష్క్రమించాడు. తర్వాత టెయిలెండర్లు తనుశ్, తుషార్ దేశ్‌పాండే (17 బ్యాటింగ్, 2 ఫోర్లు) జట్టు స్కోరును 300 పైచిలుకు తీసుకెళ్లారు. అబేధ్యమైన పదో వికెట్‌కు 63 పరుగులు జోడించారు.

మధ్యప్రదేశ్‌కు ఆధిక్యం



హిమాన్షు

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీలో విదర్భతో జరుగుతున్న మొదటి సెమీఫైనల్లో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 82 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మధ్యప్రదేశ్ 94.3 ఓవర్లలో 252 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ హిమాన్షు మంత్రి (265 బంతుల్లో 126; 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. మిగతా వారిలో సారాంశ్ జైన్ (30; 1 ఫోర్, 1 సిక్స్), హర్ష్ గావ్లీ (25; 3 ఫోర్లు), సాగర్ సోలంకి (26; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. విదర్భ బౌలర్లు ఉమేశ్ యాదవ్, యశ్ ఠాకూర్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో వికెట్ నష్టానికి 13 పరుగులు చేసింది. ధ్రువ్ షోరే (10 బ్యాటింగ్), అక్షయ్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ క్రికెటర్‌కు గాయాలు

ఐపీఎల్ వేలంలో రూ. 3 కోట్ల 60 లక్షలు దక్కించుకున్న రాబిన్ మింజ్



రాంచీ: గతేడాది నిర్వహించిన ఐపీఎల్ మినీ వేలంలో రూ. 3 కోట్ల 60 లక్షలు దక్కించుకున్న యువ వికెట్‌కీపర్ బ్యాటర్ రాబిన్ మింజ్ రోడ్డు ప్రమాదం బారిన పడ్డాడు. 21 ఏళ్ల రాబిన్ అనూహ్య ధరతో అందరికంటా పడ్డాడు. జార్ఖండ్‌కు చెందిన గిరిజన క్రికెటర్‌ను గుజరాత్ టైటాన్స్ కొనుగోలు చేసింది. రాబిన్ ఈనెల 22 నుంచి మొదలయ్యే ఐపీఎల్ సీజన్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. ఇంతలో ప్రమాదానికి గురయ్యాడు. అతను బైక్‌పై వెళ్తుంటే వాహనం ఢీ కొట్టడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదని స్వయంగా క్రికెటర్ తండ్రి ఫ్రాన్సిస్ తెలిపారు. స్వల్పగాయాలైన అతను స్థానిక ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పారు.

‘సచివాలయం తాకట్టు’ అవాస్తవం

- ఈ కథనంపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తాం
- సీఆర్‌డీఏ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టారంటూ వచ్చిన కథనం పూర్తిగా అవాస్తవమని సీఆర్‌డీఏ స్పష్టం చేసింది. సాధారణ పరిపాలనశాఖ నుంచి తమకు దీనికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన రాలేదని వెల్లడించింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర సచివాలయంలోని 5 భవనాలను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు తాకట్టు పెట్టినట్లు వచ్చిన వార్త పూర్తిగా వాస్తవ విరుద్ధమని తెలిపింది. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల నుంచి సీఆర్‌డీఏ ఎలాంటి రుణాన్ని తీసుకోలేదని సీఆర్‌డీఏ అకౌంట్స్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. బ్యాంక్‌ల కన్సార్టియం, హడ్కో నుంచి సీఆర్‌డీఏ గతంలో పొందిన రుణాన్ని మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించినట్లు పేర్కొన్నారు. రాయపూడిలోని ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్స్‌పై 2018 అక్టోబర్ 15న విడుదల చేసిన జీవో ఎంఎస్ నంబర్ 332 ప్రకారం బ్యాంక్‌ల కన్సార్టియం (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్)రూ.2,060 కోట్ల రుణాన్ని మంజూరు చేశాయని..అందులో ఇప్పటివరకు రూ.1,955 కోట్లను సీఆర్‌డీఏకు విడుదల చేశాయని తెలిపారు. 2017లో హడ్కో రూ.1,275 కోట్ల రుణాన్ని మౌలిక సదుపాయాల కోసం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆ రుణాలు తప్ప సచివాలయ భవనాలను తాకట్టు పెట్టి సీఆర్‌డీఏ ఎలాంటి రుణాలు పొందలేదన్నారు. ఇలాంటి నిరాధార కథనాలు ప్రచురించిన సంస్థపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

నలుగురు విద్యార్థుల మృతదేహాలు లభ్యం

మహాబలిపురంలో గల్లంతయిన ఏపీ విద్యార్థుల్లో మొత్తం ఐదుగురు మృతి

సాక్షి, చెన్నై: విహారయాత్ర కోసం మహాబలిపురానికి వచ్చి సముద్రంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన నలుగురు విద్యార్థుల మృతదేహాలు ఆదివారం లభించాయి. చిత్తూరు జిల్లా పలమనేరులోని ఎస్వీసీఆర్ ప్రభుత్వ కాలేజీకి చెందిన 18 మంది, అనంతపురం జిల్లా బోయరెడ్డిపల్లిలోని పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్‌కు చెందిన 22 మంది విద్యార్థులు, నలుగురు ఉద్యోగులు వేర్వేరుగా శనివారం మహాబలిపురం పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. వారిలో సముద్ర స్నానానికి దిగిన పది మంది గల్లంతు కాగా, ఐదుగురిని స్థానిక జాలరులు రక్షించిన విషయం విదితమే. విజయ్ అనే విద్యార్థి మరణించగా, అతని మృతదేహం వెంటనే లభించింది.

ఒక పీకే వల్ల కావట్లేదనే రెండో పీకేను తెచ్చారా?

చంద్రబాబును ఎద్దేవా చేసిన మాజీ మంత్రి పేర్ని నాని

- రాష్ట్రంలో అభివృద్ధి లేకుంటే వ్యవసాయం, పరిశ్రమ, సేవారంగం ఐదేళ్లుగా ఎలా ముందుకు వెళ్లాయి?



సాక్షి, అమరావతి: ఒక పీకే (పవన్ కళ్యాణ్) వల్ల కావడం లేదనే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రెండో పీకే (ప్రశాంత్ కిశోర్)ను తెచ్చుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని(వెంకట్రామయ్య) ఎద్దేవా చేశారు. తాడేపల్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రశాంత్ కిశోర్ బిహార్‌లో ఓడిపోనుండగా రాష్ట్రంలో చంద్రబాబు– పవన్ కళ్యాణ్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని సామాన్యులు సైతం చెబుతున్నారన్నారు. చంద్రబాబే గెలుస్తాడనుకుంటే మేనిఫెస్టోలో సంక్షేమం గురించి ఎడాపెడా హామీలు ఇచ్చేయాలని ఆయనకు ఎందుకు సలహా ఇచ్చారని ప్రశాంత్ కిశోర్‌ను ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్, బీజేపీతో పొత్తు పెట్టుకోమని ఎందుకు సూచించారని నిలదీశారు. ఏపీలో అసలు సర్వే టీమ్‌లే లేని ప్రశాంత్ కిశోర్ డీబీటీకి ప్రజలు ఓట్లు వేయరని ఎలా చెబుతారని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి లేకుంటే వ్యవసాయం, పరిశ్రమ, సేవా రంగం గత ఐదేళ్లుగా ఎలా ముందుకు వెళ్లాయని నిలదీశారు. డీబీటీ, అభివృద్ధి రెండూ చేయని చంద్రబాబుకు ప్రజలు ఓటు వేస్తారని ప్రశాంత్ కిశోర్ చెప్పడానికి కారణం నెల క్రితం నేరుగా చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశమే కదా? అని ప్రశ్నించారు. ఆ తర్వాత ప్రశాంత్ కిశోర్ పలుమార్లు రహస్యంగా చంద్రబాబును కలవడం నిజం కాదా? అని నిలదీశారు. ఒక ప్రకటనతో మొత్తం ప్రజల నాడిని మార్చేయవచ్చని, తాను మహా మాంత్రికుడినని అనుకుంటున్న ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి చివరకు సొంత రాష్ట్రం బిహార్‌లో రాజకీయ భిక్షగాడిగా మారాడని ఎద్దేవా చేశారు. ఇంట గెలవలేని వాడు రచ్చ గెలుస్తాడా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ప్రశాంత్ కిశోర్ ముగ్గురూ పచ్చి అబద్ధాల పోటీల్లో ప్రపంచ ఛాంపియన్లే అని వ్యాఖ్యానించారు.

బిహార్‌లో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా?

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- పీకేను చంద్రబాబు పలుమార్లు రహస్యంగా కలిసారు
- ఒక రోజు క్రితం కూడా హైదరాబాద్‌లో సమావేశమయ్యారు
- ఒక పీకే వల్ల కావడం లేదనే రెండో పీకేని తెచ్చుకున్నారా..?
- మాంత్రికుడనుకుంటున్న ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లో ఎందుకు సున్నా అయ్యాడు?
- సొంత రాష్ట్రం బిహార్‌లో రాజకీయ భిక్షగాడిలా మారాడు
- ఏపీలో సర్వే టీం లేని ఆయన డీబీటీకి ప్రజలు ఓట్లు వేయరని ఎలా చెప్పారు?



సాక్షి, విశాఖపట్నం: ప్రశాంత్ కిశోర్ పార్టీ బిహార్‌లో దిక్కుమొక్కూ లేకుండా చిత్తుగా ఓడిపోనున్న తరహాలోనే చంద్రబాబు–పవన్‌కళ్యాణ్ ఓటమికి సిద్ధంగా ఉన్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పష్టం చేశారు. బిహార్‌లో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా? అని ప్రశాంత్ కిశోర్‌పై విరుచుకుపడ్డారు. డబ్బులు తీసుకుని కన్సల్టెన్సీలో ఒక డైరెక్టర్‌గా ఉండే ప్రశాంత్ కిషోర్ బిహార్‌లో సొంతంగా పార్టీ పెట్టుకున్నాడని, ఇంట గెలవని వాడి మాటలను ఏపీ ప్రజలు నమ్మరని చెప్పారు. ఆదివారం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, ప్రశాంత్ కిశోర్ పలుమార్లు రహస్యంగా భేటీ అవుతున్నారని, అందులో భాగంగానే రెండు రోజుల క్రితం కూడా హైదరాబాద్‌లో ఇద్దరూ రహస్యంగా కలుసుకున్నట్లు పలు పత్రికల్లో వచ్చిందన్నారు. ‘డీబీటీ, అభివృద్ధి రెండూ చేయలేని చంద్రబాబుకు ప్రజలు ఓటు వేస్తారన్నట్లు ప్రశాంత్‌కిశోర్ చెప్పడానికి కారణం నెలరోజులు క్రితం చంద్రబాబు ఇంట్లో జరిగిన సమావేశమే కదా? ఆ తర్వాత రహస్యంగా పలుమార్లు ప్రశాంత్ కిశోర్ చంద్రబాబును కలవడం నిజం కాదా? ఒక పీకే వల్ల కావడంలేదని చంద్రబాబు రెండో పీకేని కూడా తెచ్చుకున్నారు’ అని పేర్కొన్నారు. ఒక స్టేట్‌మెంట్‌తో మొత్తం ప్రజల నాడిని మార్చేయొచ్చని, తాను మహా మాంత్రికుడినని అనుకుంటున్న ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి చివరకు తన సొంత రాష్ట్రం బిహార్‌లో రాజకీయ భిక్షగాడిగా మారాడని ఎద్దేవా చేశారు. పేదలకు మేలు చేస్తూ అవినీతికి తావులేకుండా అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఓట్లు వేయకుంటే చంద్రబాబులా అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేసేవారికి ఓట్లు వేస్తారా? అని ప్రశ్నించారు.

బాబు, పీకే పన్నాగాలు తిప్పికొడతాం..

చంద్రబాబు, చెల్లని రూపాయి ప్రశాంత్ కిషోర్ కొత్త ఎత్తుగడలకు పన్నాగాలు పన్నుతున్నారని, వాటిని ఎన్నికల్లో తిప్పికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా వైఎస్సార్‌సీపీనే గెలుస్తుందని సామాన్యులు సైతం చెబుతున్నారని గుర్తు చేశారు. సామాన్యులు చెప్పేది నెగ్గుతుందా? లేక చెల్లని రూపాయి ప్రశాంత్ కిశోర్ చెప్పేది నెగ్గుతుందా? అనేది మీరే చూస్తారన్నారు. చంద్రబాబే గెలుస్తాడనుకుంటే మేనిఫెస్టోలో సంక్షేమం గురించి అది చేస్తా.. ఇది చేస్తానంటూ ఎడాపెడా హామీలివ్వాలని ప్రశాంత్ కిశోర్ ఎందుకు సలహా ఇచ్చారని ప్రశ్నించారు. ఏపీలో అసలు సర్వే టీం లేని ప్రశాంత్ కిశోర్ డీబీటీకి ప్రజలు ఓట్లు వేయరని ఎలా చెప్పారని ప్రశ్నించారు. అభివృద్ధి లేకుంటే వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం ఐదేళ్లుగా ఎలా పురోగమిస్తాయని సూటిగా నిలదీశారు. బిహార్‌లో చెల్లనికాసులా మారడంతో ఇక్కడ కొన్ని కాసులైనా ఏరుకుందామనే ఉద్దేశంతో చంద్రబాబుతో డీల్ కుదుర్చుకున్నారని చెప్పారు. ఆ డీల్‌లో భాగంగా చేస్తున్న ప్రకటనలను ఏపీలో ఉన్న 5.30 కోట్ల మంది ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల ముందు కూడా టీడీపీ భారీ విజయం సాధించనున్నట్లు లగడపాటి రాజగోపాల్‌తో చంద్రబాబు జోస్యం చెప్పించారని, ఆ తరువాత ఏం జరిగిందో తెలిసిందేనని మంత్రి వ్యాఖ్యానించారు.

బాబు మాటలే... పీకే నోట

అవి కిరాయి పలుకులే: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం

- బెంగాల్ ఎన్నికల తర్వాత వ్యూహకర్తగా తప్పుకున్న ప్రశాంత్ కిశోర్
- బిహార్‌లో చెల్లని కాసులా మారడంతో చంద్రబాబుతో డీల్
- వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యమని టైమ్స్ నౌ, జీ న్యూస్, రిపబ్లిక్ టీవీ లాంటి డజనుకుపైగా మీడియా సంస్థల సర్వేల్లో వెల్లడి
- సీఎం జగన్ సిద్ధం సభలు ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్
- పొత్తులో సీట్ల లెక్క తేలాక చంద్రబాబు, పవన్ నిర్వహించిన తాడేపల్లిగూడెం సభ అట్టర్ ఫ్లాప్
- ఉనికి కాపాడుకోవడానికే పీకేతో తప్పుడు మాటలు మాట్లాడిస్తున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పలుకుతున్న పలుకులన్నీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పలికిస్తున్న చిలుక పలుకులేనని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలనే ఆయన వల్లిస్తుండటాన్ని బట్టి అవన్నీ కిరాయి పలుకులు, కిరాయి ప్రకటనలేనని స్పష్టమవుతోందన్నారు. గతంలో పార్టీలకు వ్యూహకర్తగా డబ్బులు తీసుకున్న ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు ఒక్కో స్టేట్‌మెంట్‌కు లెక్కగట్టి డబ్బులు వసూలు చేసుకుంటున్నారని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బెంగాల్ ఎన్నికల తర్వాత ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయబోనని ప్రశాంత్ కిశోర్ పేర్కొనటాన్ని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆయన బిహార్‌లో రాజకీయ అరంగేట్రంతో పాదయాత్ర చేశారన్నారు. అయితే బిహార్‌లో చెల్లనికాసులా మారడంతో ఇక్కడ కొన్ని కాసులైనా ఏరుకుందామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో ప్రశాంత్ కిశోర్ డీల్ కుదుర్చుకున్నారని వ్యాఖ్యానించారు. లోకేశ్ గతంలో ప్రశాంత్ కిశోర్‌ను వెంటబెట్టుకుని ఉండవల్లిలోని అక్రమ కట్టడంలో చంద్రబాబుతో సమావేశమయ్యారని గుర్తు చేశారు. ఆ సందర్భంగా ప్రశాంత్ కిశోర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ తరఫున పనిచేస్తున్నామని ఐ–ప్యాక్ ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి సర్వే చేసేందుకు అవసరమైన వ్యవస్థ ప్రశాంత్ కిశోర్‌కు లేదన్నది తద్వారా స్పష్టమవుతోందన్నారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోందన్నారు. టైమ్స్‌నౌ, జీన్యూస్, రిపబ్లిక్ టీవీ లాంటి డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ప్రీపోల్ సర్వేల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం ఖాయమని వెల్లడవడమే అందుకు నిదర్శనమన్నారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం కోసం సీఎం వైఎస్ జగన్ భీమిలి, దెందులూరు, రాప్తాడులలో నిర్వహించిన సిద్ధం సభలకు జనం సముద్రంలా పోటెత్తారని, ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు సభ అతి పెద్ద ప్రజాసభగా నిలిచిందని రాజకీయ పరిశీలకులే విశ్లేషించారన్నారు. టీడీపీ–జనసేన పొత్తులో సీట్ల పంపకాలు తేలాక తాడేపల్లిగూడెంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయ్యిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించడం ఖాయమని ఆందోళన చెందుతున్న చంద్రబాబు టీడీపీ ఉనికి కాపాడుకోవడం కోసం ప్రశాంత్ కిశోర్‌తో తనకు అలవాటైన రీతిలో అబద్ధాలను మాట్లాడిస్తున్నారంటూ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు.

సన్యాసానికి పీకే సిద్ధం

‘ఎక్స్’లో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: నాడు లగడపాటి రాజకీయ సన్యాసం తీసుకున్నారు.. ఇప్పుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) సిద్ధంగా ఉన్నాడంటూ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వ్యంగోక్తులు విసిరారు. పీకే అంచనాపై ఎక్స్(ట్విట్టర్) వేదికగా మంత్రి అంబటి స్పందించారు. తప్పుడు సర్వేలతో లగడపాటి ఇప్పటికే సన్యాసం తీసుకోగా పీకే కూడా అదే బాటలో నడవడానికి సిద్ధంగా ఉన్నారంటూ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే ఆరణి సస్పెన్షన్

చిత్తూరు (కార్పొరేషన్): చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం రాత్రి ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో భేటీ కావడాన్ని సీరియస్‌గా తీసుకున్న అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శనివారం ముగింపు)	
సెన్సెక్స్ ▲ 61	నిఫ్టీ ▲ 40
73,806	22,378

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	16,275	▲ 183
డోజోన్స్	39,087	▲ 91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,683	▲ 52
డాక్స్	17,735	0
హాంగ్‌సెంగ్	3,027	▲ 12
నికాయ్	39,940	▲ 751

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	83.49
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.55	106.11
€	యూరో	ఎస్‌బీఐ	88.60	90.95
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.58	55.81
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.07	54.99
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.27	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

తీవ్ర వ్యాధులపై బ్రహ్మాస్త్రం..!





- క్రిటికల్ ఇల్‌నెస్ ఇన్సూరెన్స్
- మారిన జీవనశైలితో వ్యాధుల ముప్పు
- వీటికి మెరుగైన చికిత్సలు
- కానీ, వీటి ఖరీదు ఎక్కువే
- సాధారణ హెల్త్ ప్లాన్ ఒక్కటీ చాలదు
- తీవ్ర వ్యాధి వచ్చినా బతికుంటేనే పరిహారం!

జీవనశైలి వ్యాధుల ముప్పు పెరుగుతోంది. అదే సమయంలో వైద్య శాస్త్రం పురోగతి, అత్యాధునిక టెక్నాలజీ, రోబోటిక్ పుణ్యమా అని మెరుగైన చికిత్సా విధానాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. కనుక ఇప్పుడు ఏదైనా తీవ్ర ఆరోగ్య సమస్య వస్తే, వైద్యుల కృషితో విజయవంతంగా అధిగమించొచ్చు. కానీ, ఇందుకు కావాల్సిందల్లా ముందస్తు సన్నద్ధత. అందుకే ఆరోగ్య బీమా ఎంత అవసరమో.. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ కూడా అంతే ముఖ్యమని తెలుసుకోవాలి. సాధారణ ఆరోగ్య బీమా పాలసీలో.. అనుకోకుండా ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినప్పుడు, ముందస్తుగా అనుకుని ఆస్పత్రిలో చేరి తీసుకునే చికిత్సలకు కవరేజీ వర్తిస్తుంది. కానీ, ఏదైనా క్రిటికల్ ఇల్‌నెస్ (మొండి వ్యాధులు, తీవ్ర అనారోగ్యం) కారణంగా ఎక్కువ రోజుల పాటు చికిత్స అవసరం పడితే ఏంటి పరిస్థితి..? రెగ్యులర్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఉన్న కవరేజీ సరిపోతుందా..? చాలకపోవచ్చు. రెగ్యులర్ ఇండెమ్నిటీ హెల్త్ ఇన్సూరెన్స్ అన్ని రకాల వ్యాధుల్లోనూ గట్టెక్కిస్తుందని అనుకోవద్దు. తీవ్ర వ్యాధుల్లో చికిత్సల ఖరీదు ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తే అప్పుడు ఆదాయం ఆగిపోవచ్చు. ఇలాంటి సందర్భాలను అధిగమించేందుకు క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ ఆదుకుంటుంది.



క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ విడిగా ప్లాన్ రూపంలోనూ లేదంటే రైడర్ రూపంలోనూ తీసుకోవచ్చు. పాలసీలో పేర్కొన్న ఏదైనా వ్యాధి బారిన పడినట్టు తేలితే నిబంధనల మేరకు పరిహారాన్ని బీమా సంస్థలు ఒకే విడత చెల్లించేస్తాయి. ఇండెమ్నిటీ పాలసీలు కేవలం ఆస్పత్రిలో అయ్యే వ్యయాలకే పరిహారాన్ని చెల్లిస్తాయి. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ అలా కాదు. ఏకమొత్తంలో చెల్లింపులు చేస్తాయి. దీంతో ఆయా తీవ్ర వ్యాధుల చికిత్సకు అయ్యే భారీ వ్యయాలను తట్టుకోగలరు. క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ కింద ఏకమొత్తంలో వచ్చిన పరిహారాన్ని దేనికి అయినా వినియోగించుకోవచ్చు. చికిత్స కోసమే వినియోగించాలని లేదు. కనుక రెగ్యులర్ ఇండెమ్నిటీ ఆధారిత ఆరోగ్య బీమా పాలసీ కింద ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, అదనంగా అయ్యే వ్యయాలను క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీతో గట్టెక్కొచ్చు. కానీ, క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీ తీసుకున్న వెంటనే అమల్లోకి రాదు. ఓ చిన్న కొర్రీ ఉంటుంది. అదే సర్వైవల్ పీరియడ్. అలాగే, మరికొన్ని షరతులు కూడా ఉంటాయి. వీటిపై అవగాహనతోనే క్రిటికల్ ఇల్‌నెస్ కవర్ తీసుకోవాలి.

సర్వైవల్ పీరియడ్

క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌ను ఇండివిడ్యువల్ ప్లాన్‌గాను, లేదంటే రైడర్‌గానూ తీసుకోవచ్చు. జీవిత బీమా కంపెనీలు దీన్ని ఎండోమెంట్, టర్మ్ ప్లాన్లకు రైడర్‌గా అందిస్తుంటే.. హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు స్టాండలోన్ పాలసీగా ఆఫర్ చేస్తున్నాయి. వీటిల్లో సర్వైవల్ పీరియడ్ (జీవించి ఉండే కాలం) అనే క్లాజ్ ఉంటుంది. ఏదేనీ క్రిటికల్ ఇల్‌నెస్ (జాబితాలోని) బారిన పడితే పరిహారం అన్నది, వెంటనే రాదు. క్లెయిమ్ చేసుకోవాలంటే, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత నిర్ణీత రోజుల పాటు పాలసీదారు జీవించి ఉండాలి. ఉదాహరణకు 30 రోజుల సర్వైవల్ పీరియడ్ ఉందనుకోండి. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాతి నుంచి 30 రోజుల పాటు జీవించి ఉన్నప్పుడే క్లెయిమ్‌కు అర్హత వస్తుంది. ఈ 30 రోజుల్లోపు మరణించినట్టయితే బీమా సంస్థ నుంచి పరిహారం పొందేందుకు అర్హత లభించదు. ''ఇన్సూరెన్స్ కంపెనీలు సాధారణంగా 30 రోజుల సర్వైవల్ పీరియడ్ అమలు చేస్తుంటాయి. కొన్ని కంపెనీలు ఈ సర్వైవల్ పీరియడ్‌ను తగ్గించుకునే ఆప్షన్ ఇస్తున్నాయి. బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ అయితే 30 రోజుల కాలాన్ని, 15 రోజులకు తగ్గించేందుకు అంగీకరిస్తోంది. ఇందుకు గాను 5 శాతం అదనంగా ప్రీమియంను చార్జ్ చేస్తోంది. మరో 5–10 శాతం అదనపు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు వస్తే, అప్పుడు సర్వైవల్ పీరియడ్ 7 రోజులకు లేదంటే సున్నాకు తగ్గిస్తోంది''అని ప్రమోట్ ఫిన్‌టెక్ సంస్థ సహ వ్యవస్థాపకుడు నిషా సంఘ్వి తెలిపారు.

వెయిటింగ్ పీరియడ్...

పాలసీ కొనుగోలు చేసిన రోజు నుంచి 90–180 రోజుల వరకు క్రిటికల్ ఇల్‌నెస్ బారిన పడినా కానీ, క్లెయిమ్‌కు అర్హత లభించదు. ఈ వెయిటింగ్ పీరియడ్ తర్వాత నుంచి పాలసీ అమలు సమయంలో ఎప్పుడైనా వ్యాధి నిర్ధారణ అయితే క్లెయిమ్ చేసుకోవచ్చు. అంటే పాలసీ తీసుకున్నా కానీ, కవరేజీ లేని కాలంగా దీన్ని పరిగణించాల్సి ఉంటుంది. ప్రముఖ బీమా సంస్థలు ఎక్కువ శాతం 90 రోజుల వెయిటింగ్ పీరియడ్‌ను అమలు చేస్తున్నాయి.

ఎన్నింటికి కవరేజీ..?

క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌లో మొత్తంగా ఎన్ని వ్యాధులకు కవరేజీ వర్తిస్తుందన్నది ముఖ్యంగా చూడాల్సిన అంశాల్లో ఒకటి. ఎందుకంటే నేడు జీవనశైలి వ్యాధుల ముప్పు గణనీయంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు, కేన్సర్ రిస్క్ ఎక్కువగా ఉంటోంది. కొన్ని పాలసీలు లేదా రైడర్లు 10–20 వ్యాధులకు కవరేజీ ఆఫర్ చేస్తున్నాయి. 60 నుంచి 99 వ్యాధుల వరకు కవరేజీనిచ్చేవీ ఉన్నాయి. ఎన్ని ఎక్కువ వ్యాధులకు కవరేజీ ఉంటే, అంత మంచిదనుకుంటారేమో..? కానీ, ఇది తప్పుడు అభిప్రాయం. తీసుకునే ప్లాన్‌లో ముఖ్యమైన వ్యాధులకు, అది కూడా సమగ్రమైన కవరేజీ ఉందా? అన్నదే కీలకం. ''60 లేదా అంతకంటే ఎక్కువ వ్యాధులకు కవరేజీనిచ్చే ప్లాన్, కేన్సర్‌ను పలు దశలుగా వేరు చేసి ఆఫర్ చేయవచ్చు. మరో పాలసీలో కేవలం 25 వ్యాధులకే కవరేజీ ఉండొచ్చు. ఈ ప్లాన్ అన్ని కేన్సర్‌లను ఒక్కటిగానే పరిగణించి, నిర్ధారణ అయిన వెంటనే క్లెయిమ్‌కు అనుమతించొచ్చు''అని ఎలిఫెంట్ డాట్ ఇన్ (అలియన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్) ప్రొడక్ట్ హెడ్ కల్పేష్ చవాన్ పేర్కొన్నారు. నిపుణులు చెబుతున్న దాని ప్రకారం టాప్–5 తీవ్ర వ్యాధులకు సంబంధించి 90% క్లెయిమ్‌లు వస్తున్నాయి. టాప్–10 క్రిటికల్ ఇల్‌నెస్‌లు కాకుండా, ఇతర వ్యాధుల కారణంగా వచ్చే క్లెయిమ్‌లు చాలా తక్కువ. కనుక దాదాపు 60 అంతకంటే ఎక్కువ వ్యాధులకు కవరేజీ ఉందంటే, వాటి బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ ఇక్కడ ఏ ప్లాన్ తీసుకోవాలనే సందేహం రావచ్చు. అధిక వ్యాధులకు కవరేజీ ఇస్తూ, అందులో ఒక్కో వ్యాధి వారీ కవరేజీ పరిమితి లేకపోవడం, ఉన్నా మెరుగైన కవరేజీ, అన్ని కేన్సర్‌లను ఒకటిగానే పరిగణించేట్టు అయితే ఆ ప్లాన్‌ను తీసుకోవచ్చు. లేదంటే ఎలాంటి షరతుల్లేకుండా ఆఫర్ చేసే క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్, అది టాప్ 25–30 వ్యాధులకు కవరేజీ ఇచ్చేది అయినా నిస్సందేహంగా తీసుకోవచ్చు. సంఖ్య కంటే షరతులు, కవరేజీకే ప్రాధాన్యం ఇవ్వాలి.

రైడర్ - స్టాండెలోన్ ప్లాన్

క్రిటికల్ ఇల్‌నెస్‌ను రైడర్‌గా లేదంటే, స్టాండలోన్ పాలసీగా తీసుకుంటే ఏవైనా వ్యత్యాసాలు ఉంటాయా? అన్న సందేహం కలగొచ్చు. రైడర్ రూపంలో అయితే సులభంగా తీసుకోవచ్చు. బీమా పాలసీ తీసుకునే సమయంలోనే ఈ రైడర్‌ను కూడా ఎంపిక చేసుకుంటే, ఒకేసారి వైద్య పరీక్షలు చేస్తారు కనుక, మళ్లీ విడిగా తీసుకోవడాన్ని నివారించొచ్చు. కాకపోతే టర్మ్ ఇన్సూరెన్స్‌తోపాటు తీసుకుంటే కవరేజీ పరంగా పరిమితి ఉంటుంది. జీవిత బీమా కవరేజీ మించి క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ కవరేజీ తీసుకోవడానికి అనుమతించరు. అంటే కోరుకున్నంత కవరేజీ తీసుకోవడానికి ఇక్కడ అవకాశం ఉండదు. జీవిత బీమా ప్లాన్‌తో వచ్చే రైడర్లలో సాధారణంగా వ్యాధి ముదిరిన దశలోనే కవరేజీ అనే షరతు ఉంటుంది. ఉదాహరణకు కేన్సర్ మొదటి దశను ఇవి కవర్ చేయవు. అలాగే, రైడర్లలోనూ రెండు రకాలు ఉన్నాయి. కాంప్రహెన్సివ్ రైడర్ అయితే, బేస్ పాలసీ కవరేజీకి అదనంగా ఉంటుంది. యాక్సిలరేటెడ్ రైడర్ అయితే, బేస్ పాలసీలో భాగంగానే కవరేజీ ఉంటుంది. యాక్సిలరేటెడ్ రైడర్ తీసుకుని ఏదైనా తీవ్ర వ్యాధి బారిన పడి క్లెయిమ్‌కు వెళితే, ఆ మేరకు బేస్ కవరేజీ తగ్గిపోతుంది. స్టాండలోన్ క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌లో కవరేజీ విస్తృతంగా ఉంటుంది. పైగా జీవిత బీమా లేదా టర్మ్ ఇన్సూరెన్స్‌తో తీసుకునే క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ జీవితాంతం పనిచేయదు. జీవిత బీమా ఎంత కాలానికి తీసుకుంటారో? అంత వరకే పరిమితం అవుతుంది. విడిగా తీసుకుంటే మీరు జీవితాంతం రెన్యువల్ చేసుకోవచ్చు. పాలసీ వర్డింగ్స్ డాక్యుమెంట్ సమగ్రంగా చదవడం ద్వారా వేటికి కవరేజీ వస్తుంది, వేటికి రాదు? షరతులు అన్నీ తెలుస్తాయి. స్టాండలోన్ ప్లాన్ ప్రీమియం,



రైడర్‌తో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. స్టాండలోన్ ప్లాన్‌లో ప్రీమియం ప్రతి కొన్నేళ్లకోసారి పెరుగుతూ వెళుతుంది. ఈ పెరుగుదల, రైడర్‌తో పోల్చినప్పుడు అధికంగా ఉంటుంది. రైడర్‌లో కొన్ని అనుకూలతలు ఉన్నప్పటికీ, ప్రతికూలతలను సైతం పరిగణనలోకి తీసుకోవాలి. జీవితాంతం రెన్యువల్‌కు అవకాశం ఉందా? వ్యాధులకు విస్తృతమైన కవరేజీ ఉందా? సర్వైవల్ పీరియడ్ జీరో లేదంటే 7–15 రోజులుగా ఉందా? (వీలైనంత తక్కువ) అని కూడా చూడాలి. అలాగే, విడిగా ఒక్కో వ్యాధికి సంబంధించి కవరేజీ ఎందులో ఎక్కువ ఉంటే, అదే అనుకూలంగా పరిగణించొచ్చు. ఒకవేళ రైడర్ ఆకర్షణీయంగా ఉందని భావిస్తే, అప్పుడు టర్మ్ ఇన్సూరెన్స్‌ను 85–90 ఏళ్ల కాలానికి తీసుకుని, రైడర్‌ను జోడించుకోవడం సరైనది. అప్పుడు జీవితాంతం టర్మ్ ప్లాన్ ప్రీమియం చెల్లింపుల్లో వైఫల్యం లేకుండా చూసుకోవాలి. ఇక ఇప్పటికే జీవిత బీమా పాలసీ తీసుకుని ఉంటే, అటువంటి వారు ఎలాంటి సందేహం లేకుండా స్టాండలోన్ క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్‌ను తీసుకోవడం సరైనది. మరీ ముఖ్యంగా కవరేజీ విస్తృతంగా ఉండాలని చెప్పి, భారీ ప్రీమియంతో కూడిన ప్లాన్ తీసుకుంటే, ఆర్థికంగా భారం అవుతుందేమో ఓసారి ఆలోచించుకోవాలి. భవిష్యత్తులో ఏదైనా వ్యాధి బారిన పడితే, ఆర్థికంగా ఆదుకుంటుందని చెప్పి, ప్రస్తుత బడ్జెట్‌ను భారంగా మార్చుకోరాదు. కనుక తమ పూర్వీకుల ఆరోగ్య చరిత్ర, వ్యాధుల రిస్క్‌ను వైద్య నిపుణుల సూచనతో మదింపు వేసుకుని, అప్పుడు ఎంతకు కవరేజీ తీసుకోవాలనే విషయంలో స్పష్టతకు రావాలి. క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్, సాధారణ అనారోగ్యాలతో ఆస్పత్రి పాలైతే ఆదుకోదు. కనుక రెగ్యులర్ హెల్త్ ప్లాన్ తీసుకోవడం కూడా ఎంతో అవసరం. అందుకే క్రిటికల్ ఇల్‌నెస్‌ను బెనిఫిట్ ప్లాన్‌గా చెబుతారు. రెగ్యులర్ హెల్త్‌ప్లాన్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌ను ఒకే సంస్థ నుంచి తీసుకుంటే కొంత అనుకూలం.



టాప్ క్రిటికల్ ఇల్‌నెస్‌లు / చికిత్సలు

కేన్సర్, యాంజియోప్లాస్టీ(ప్రొసీజర్), హార్ట్‌ఎటాక్, అరోటా సర్జరీ, హార్ట్ వాల్వ్ వైఫల్యం, కార్డియో మయోపతి, ప్రైమరీ పల్మనరీ హైపర్ టెన్షన్, సీఏబీజీ, క్రానిక్ లంగ్ డిసీజ్, క్రానిక్ లివర్ డిసీజ్, కిడ్నీ ఫెయిల్యూర్, కోమ, స్ట్రోక్, అల్జీమర్స్, మస్క్యులర్ డిస్ట్రోఫీ, పార్కిన్సన్స్, బ్రెయిన్ సర్జరీ, పోలియోమైలైటిస్, మోటార్ న్యూరాన్ డిసీజ్, బ్యాక్టీరియల్ మెనింజైటిస, ఎన్‌సెఫలైటిస్, ఎయిడ్స్ (రక్త మార్పిడి వల్ల), థర్డ్ డిగ్రీ కాలిన గాయాలు.

కవరేజీ ఎంత..?

గుండె జబ్బులకు సంబంధించి శస్త్రచికిత్సల ఖరీదు నేడు 2–5 లక్షల మధ్య ఉంది. వైద్య ద్రవ్యోల్బణం 10 శాతం పైనే ఉంటోంది. కనుక భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత చికిత్సల చార్జీలకు ఐదు నుంచి పది రెట్లు అధికంగా కవర్ తీసుకోవాలి. లేదంటే కనీసం నాలుగైదేళ్ల వార్షిక ఆదాయానికి సమానమైన కవర్ తీసుకోవాలి. ఉదాహరణకు వార్షికాదాయం రూ.5 లక్షలు ఉందంటే, కనీసం రూ.25 లక్షలు అవసరం. ఎక్కువ రోజుల పాటు ఆస్పత్రిలో ఉండి, ఇండెమ్నిటీ హెల్త్ కవరేజీ చాలనప్పుడు, అదనంగా అయ్యే వ్యయాలను తట్టుకునేందుకు, ఆ కాలంలో నిలిచిన ఆదాయాన్ని భర్తీ చేసుకునేందుకు ఈ మాత్రమైనా ఉండాల్సిందే.



మహీంద్రా మాన్యులైఫ్ మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్

మహీంద్రా మాన్యులైఫ్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌ను అందిస్తోంది. మార్చి 5 వరకు ఈ ఎన్‌ఎఫ్‌వోలో ఇన్వెస్ట్ చేయొచ్చు. ఒకే పథకం ద్వారా డైవర్సిఫైడ్ సాధనాల్లో (ఈక్విటీ, డెట్.. గోల్డ్/సిల్వర్ ఈటీఎఫ్‌లు మొదలైనవి) ఇన్వెస్ట్ చేసే ప్రయోజనాలను పొందాలనుకునే వారికి ఇది అనువైనదని సంస్థ తెలిపింది. దీని ద్వారా సమీకరించిన నిధుల్లో 35–80 శాతాన్ని ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో, 10–55 శాతాన్ని డెట్..మనీ మార్కెట్ సెక్యూరిటీల్లో, 10–30 శాతాన్ని గోల్డ్–సిల్వర్ ఈటీఎఫ్‌లు మొదలైన వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-3-2024	
విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463–00
విజయవాడ	463–00
రిటైల్ ధర (డజను)	72.00
3-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	466–00
వరంగల్	468–00
రిటైల్ ధర	5.25

ఆర్థిక ప్రభావశీలురు నుంచి రక్షణ ఎలా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

యూట్యూబ్‌లో ఎంతో మంది ఆర్థిక ప్రభావశీలురు (ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్) ఈ మధ్యకాలంలో కనిపిస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి కోర్సులు, శిక్షణను ఆఫర్ చేస్తున్నారు. ఇలాంటి వారిని అనుసరించే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? – యశస్వి పటేల్

ఆర్థిక ప్రభావశీలురకు సంబంధించి ఎలాంటి నియంత్రణలు ప్రస్తుతం అధికారికంగా అమల్లో లేవు. ఈ తరహా వ్యక్తులను సమర్థవంతంగా నియంత్రించేందుకు సెబీ చురుగ్గా సంప్రదింపులు నిర్వహిస్తోంది. వారు ఆఫర్ చేసే మార్గదర్శనం, హామీలకు సంబంధించి వారిని జవాబుదారీ చేయాలని చూస్తోంది. ఆర్థిక ప్రభావశీలురు తప్పకుండా సెబీ వద్ద రిజిస్టర్ చేసుకుని, సోషల్ మీడియా ప్రకటనల్లో రిజిస్ట్రేషన్ నంబర్ ప్రదర్శించాలంటూ భారత ప్రకటన ప్రమాణాల మండలి (ఏఎస్‌సీఐ) ఇటీవలే ఆదేశించింది. బీఎఫ్‌ఎస్‌ఐలో (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్)లో పనిచేసే ప్రతి ఒక్కరికీ ఇది వర్తిస్తుంది. కాకపోతే ఏఎస్‌సీఐ ఆదేశాల అమలుకు కొంత సమయం తీసుకుంటుంది. కనుక వీరి బారి నుంచి అప్పటి వరకు రక్షణ కోరుకునే వారు వారి సూచనలను అనుసరించకపోవడం మంచిది. వినోదం నుంచి ఆర్థిక సలహాలను వేరు చేయడం తప్పనిసరి. యూట్యూబ్ మాదిరి ప్లాట్‌ఫామ్‌లపై వీడియోలను చూస్తున్న సమయంలో సిఫారసులు కనిపిస్తుంటాయి. మార్కెట్ పనితీరు గురించి, ప్రత్యేకంగా కొన్ని స్టాక్స్ గురించి చెబుతూ ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటారు. ఏది ఏమైనా కనిపించేది నిజం కాకపోవచ్చు. రాత్రికి రాత్రే ధనవంతులు అయిపోవచ్చన్న వారి ఆఫర్లు వింటే, విశ్లేషిస్తే.. అలాంటప్పుడు వారంతట వారే స్వయంగా ధనవంతులు అయిపోవచ్చుగా? అన్న సందేహం వస్తుంది. అందుకని ఎవరి సూచన అయినా పరిశీలించే ముందు వారి గతాన్ని, అనుభవాన్ని తప్పకుండా విశ్లేషించుకోవాలి.



ముందుగా రిటైర్ అయితే ఈపీఎఫ్ పరిస్థితి? ఈపీఎఫ్ బ్యాలన్స్‌పై జమ అయ్యే వడ్డీకి పన్ను మినహాయింపు కొనసాగుతుందా? – హర్షవర్ధన్

ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) అనేది ఉద్యోగి మూల వేతనం, డీఏలో 12 శాతానికి సమానమైన మొత్తం చందాగా వెళుతుంది. ఇలా నెలవారీ చేసే చందా మొత్తంపైనా సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ఉంటుంది. ఇలా జమ అయ్యే పొదుపు మొత్తంపై వచ్చే వడ్డీపైనా పన్ను లేదు. అత్యవసర నిధిగా ఈపీఎఫ్ ఉపయోగపడుతుంది. నిజానికి ఉద్యోగుల భవిష్యనిధి అనేది రిటైర్మెంట్ కోసం. రిటైర్మెంట్ తర్వాత ఉపసంహరించుకునే మొత్తంపైనా పన్ను ఉండదు. 58 ఏళ్లు నిండిన వెంటనే ఈపీఎఫ్ సొమ్మును పూర్తిగా ఉపసంహరించుకోవచ్చు. ఒకవేళ ముందుగా పదవీ విరమణ తీసుకుంటే ఏంటి పరిస్థితి? అన్నది చూద్దాం. 58 ఏళ్లలోపు రిటైర్మెంట్ తీసుకున్న వారి ఈపీఎఫ్ ఖాతా, నాటి నుంచి మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ఉదాహరణకు 52 ఏళ్ల వయసులో 2023లో రిటైర్ అయ్యారని అనుకుంటే, 2026 వరకు ఈపీఎఫ్ ఖాతా కార్యకలాపాలకు అందుబాటులో ఉంటుంది. ఈ కాలంలో ఈపీఎఫ్ నిధిపై వడ్డీ జమ అవుతుంటుంది. ప్రతి ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్‌పై వడ్డీ రేటు సవరణకు లోనవుతుంటుంది. కనుక ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన రేటు ప్రకారం వడ్డీ జమ అవుతుందని తెలుసుకోవాలి. ఇలా వచ్చిన వడ్డీపై పన్ను ఉంటుందా? ఉద్యోగి తరఫున యాజమాన్యం ఈపీఎఫ్ చందా జమ చేస్తున్నంత కాలం వడ్డీపై పన్ను రాయితీ కొనసాగుతుంది. ఒక్కసారి రిటైర్మెంట్ తీసుకుంటే, అప్పటి నుంచి జమ అయ్యే వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎంత మేర వడ్డీ జమ అయితే, ఆ మేరకు ఆదాయపన్ను రిటర్నుల్లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక ముందుగా రిటైర్మెంట్ తీసుకున్న వారు, అప్పటి నుంచి మూడేళ్లు ముగిసేలోగా నిధి మొత్తాన్ని ఉపసంహరించుకోవడం మర్చిపోవద్దు. ఎందుకంటే మూడేళ్ల తర్వాత ఖాతా నిలిచిపోతుంది. దాంతో ఆ తర్వాత వడ్డీ జమ కాదు.

సాక్షి స్టాక్స్

ఐసీఐసీఐ బ్యాంక్ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,083 టార్గెట్: రూ. 1,310

ఎందుకంటే: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం మా అంచనాలకంటే 8 శాతం, ప్రొవిజన్లకుముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) 4 శాతం చొప్పున అధికంగా నమోదయ్యాయి. ఇందుకు ప్రధానంగా తక్కువస్థాయిలో నమోదైన నిర్వహణ, రుణ వ్యయాలు ప్రభావం చూపాయి. ఆదాయ వ్యయ(కాస్ట్ టు ఇన్‌కమ్) నిష్పత్తి నిలకడను చూపుతూ 40.6 శాతంగా నమోదైంది. అయితే ఉద్యోగుల జత, డిజిటల్ టెక్నాలజీ వ్యయాల నేపథ్యంలో త్రైమాసికవారీగా 0.30 నీరసించింది. ఏఐఎఫ్ పెట్టుబడులపై 0.22 శాతం ప్రొవిజన్లు చేపట్టినప్పటికీ రుణ వ్యయాలు 0.37 శాతంగా నమోదయ్యాయి. ముందస్తుగా చేపట్టిన అధిక ప్రొవిజన్లను వినియోగించుకోవడం ఇందుకు కలసి వచ్చింది. నిధుల సమీకరణ వ్యయాలు 0.21 శాతం పెరగడంతో నికర వడ్డీ మార్జిన్లు 4.52 శాతానికి చేరాయి. త్రైమాసికవారీగా 0.14 శాతం బలహీనపడ్డాయి. గత మూడు త్రైమాసికాలుగా ఇదేస్థాయిలో కొనసాగుతున్నాయి. కాగా.. వార్షిక ప్రాతిపదికన కాలపరిమితి డిపాజిట్లు 31 శాతం వృద్ధిని అందుకోవడం ద్వారా మొత్తం పురోగతికి కారణంగా నిలుస్తున్నాయి. సమీప ప్రత్యర్థి సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో పోలిస్తే మార్జిన్లు తక్కువేకాగా.. కాలపరిమితి డిపాజిట్ల ధరల(వడ్డీ రేట్లు) సవరణ ప్రభావం చూపుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)వరకూ నిధుల సమీకరణ వ్యయాలు పెరిగే వీలున్నట్లు బ్యాంక్ యాజమాన్యం పేర్కొంటోంది.



ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 171 టార్గెట్: రూ. 200

ఎందుకంటే: మౌలిక దిగ్గజం ఎల్‌అండ్‌టీ గ్రూప్ కంపెనీ ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో అంచనాలకు అనుగుణంగా రూ. 640 కోట్ల నికర లాభం ఆర్జించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో ప్రొవిజన్లకుముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) వార్షికంగా 7 శాతం బలపడి రూ. 1,340 కోట్లను తాకింది. రుణ వ్యయాలు రూ. 510 కోట్లకు చేరడంతో వార్షికంగా రుణ వ్యయాలు 2.5 శాతాన్ని తాకాయి. ఈ ఏడాది క్యూ2(జులై–సెప్టెంబర్)లో ఇవి 2.6 శాతం, క్యూ3లో 2.7 శాతంగా నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) కంపెనీ నికర లాభం 58 శాతం జంప్‌చేసి రూ. 1,770 కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సంస్థ ఆర్‌వోఏ 2.5 శాతం, ఆర్‌వోఈ 11.4 శాతంగా నమోదయ్యాయి. త్రైమాసికవారీగా ఆర్‌వోఏ 0.1 శాతం, ఆర్‌వోఈ 0.55 శాతం చొప్పున మెరుగుపడ్డాయి. రిటైల్ ఆర్‌వోఏ 0.1 శాతం పుంజుకుని 3.4 శాతానికి చేరింది. చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)కల్లా రిటైల్ మిక్స్ 4 శాతం పెరిగి 95 శాతాన్ని తాకే వీలుంది. ఊపందుకున్న హోల్‌సేల్ బుక్ రన్‌డౌన్ ప్రకారం వచ్చే రెండేళ్లలో(2025–2026) కన్సాలిడేటెడ్ రుణ వృద్ధి 18 శాతం, నికర లాభం 34 శాతం చొప్పున పురోగమించవచ్చని అంచనా. వీటిని కన్సాలిడేటెడ్ ఆర్‌వోఈ 2.7 శాతం, ఆర్‌వోఈ 15 శాతం ప్రాతిపదికగా అంచనా వేశాం. కంపెనీ రిటైల్ ఫ్రాంచైజీగా ఆవిర్భవించిన నేపథ్యంలో లాభదాయకతతోపాటు.. ఆర్‌వోఏ సైతం మెరుగుపడే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

చంద్రబాబు మాటలు హాస్యాస్పదం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన చంద్రబాబు కళింగ వైశ్యులను తానే బీసీల్లో చేర్పించానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శిష్టకరణాలు, కళింగ వైశ్యులను బీసీల్లో చేర్చాలని కమిషన్‌కు రికమండ్ చేసింది తానేనని ధర్మాన చెప్పారు. దురదృష్టవశాత్తు టీడీపీ అధికారంలోకి వచ్చాక శిష్టకరణాలను, కళింగ వైశ్యులను బీసీ జాబితాలో చేరుస్తూ ఆ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ మాత్రం దానికి టీడీపీవారు పనంతా తామే చేసినట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. శ్రీకాకుళంలో శిష్టకరణ సంఘ నగర కార్యాలయాన్ని ఆదివారం మంత్రి ధర్మాన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు ఏనాడైనా ఒక్క వెనుకబడిన కులాన్ని గుర్తించి ఆదుకున్నారా... అని ప్రశ్నించారు. బీసీ కులాలకు గుర్తింపు, తగిన ప్రాధాన్యత ఇచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో ఐదేళ్లు పాలిస్తే రాష్ట్రంలో అక్షరాస్యత వంద శాతానికి చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఎంపీ పద్మావతి, శిష్టకరణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఉగ్రవాదులా?: బృందా కారత్



మండ్య: రైతులు ఢిల్లీ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడం, లాఠీచార్జ్, కాల్పులు, భాష్పవాయు గోళాలను ప్రయోగించడం ద్వారా వారిని శత్రువులుగా చూస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఆదివారం కర్ణాటకలో మండ్యలో ఉపాధి హామీ కూలీల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసినా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందనీ, గ్రామీణ ప్రజలు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహిళలపై, మహిళా శక్తి పై కనీస విశ్వాసం లేదనీ, కేవలం వ్యాపారవేత్తలను నమ్ముకొని దేశ సంపదను వారికి దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఆఖరికి ఉపాధి హామీ కార్మికుల డబ్బును కూడా వ్యాపారవేత్తలకు దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.

ప్రేమ పేరుతో బాలికపై అఘాయిత్యం!

బి.కొత్తకోట: ప్రేమ పేరుతో ఓ బాలికపై బాలుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ సూర్యనారాయణ ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం... అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకి చెందిన ఇంటర్ విద్యార్థిని (17) గత నెల 10న తండ్రి పనిచేస్తున్న చోటుకు వెళ్లింది. పుస్తకాలు కావాలని బుక్ షాపునకు వెళ్తున్నట్టు చెప్పింది. ఆ తర్వాత ఇంటికి రాలేదు. బాలిక కోసం తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గత నెల 15న బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించడంతో అదృశ్యం కేసు నమోదు చేశారు. ఓ బాలుడిపై అనుమానం వ్యక్తం చేయడంతో ఆ దిశగా విచారణ మొదలుపెట్టారు. బాలుడు సోషల్ మీడియా కదలికలు ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఉన్నట్టు గుర్తించి అక్కడి నుంచి శనివారం వీరిని రప్పించారు. బాలికను విచారించగా గత నెల 10న ఐటీఐ చదువుతున్న బాలుడు ప్రేమ పేరుతో తనను బైక్‌పై తీసుకెళ్లినట్టు చెప్పింది. శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి బలవంతంగా అఘాయిత్యానికి పాల్పడినట్టు వివరించింది. దీంతో అదృశ్యం కేసును పోక్సో కేసుగా మార్చారు. వైద్య పరీక్షల కోసం బాలికను ఆస్పత్రికి తరలించారు.



ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా పడుగుపాడులో యానాదయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నీలిమ



అమలాపురం ఆసుపత్రిలో దుర్గాప్రసాద్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ గంగాభవాని



గుంటూరు కేవీపీ కాలనీకి చెందిన హుస్సేన్ సాహెబ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రిజ్వాన



విజయనగరం జిల్లా చిన్నయ్యపేటకి చెందిన గౌరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమ



విజయవాడలో షేక్ షరీఫ్‌కు దివ్యాంగ పింఛన్ అందిస్తున్న వలంటీర్ మధు



శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ పేషెంట్ దమయంతికి ఫించన్ అందిస్తున్న వలంటీర్ స్వప్న

62.66 లక్షల మందికి రూ.1,861.40 కోట్లు

ఆదివారం కూడా వలంటీర్ల ఆధ్వర్యంలో కొనసాగిన పింఛన్ల అందజేత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ సెలవు రోజయినా ఆదివారం కూడా కొనసాగింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మరీ పింఛన్ల నగదు అందజేశారు. ఆదివారం సాయంత్రానికి రాష్ట్ర వ్యాప్తంగా 62,66,695 మంది లబ్ధిదారులకు రూ.1,861.40 కోట్ల పంపిణీ పూర్తయినట్టు సెర్ప్ అధికారులు వెల్లడించారు. మొత్తం 65,92,463 మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.1,958.51 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటి వరకు 95.06 శాతం పంపిణీ పూర్తయిందని, మరో రెండు రోజుల్లో మిగిలినవి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.



కర్నూలు ఆసుపత్రిలో గోకారికి పింఛన్ అందిస్తున్న వలంటీరు ప్రశాంత్

ఇదే కదా సుపరిపాలన

ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్ సదస్సులో సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లాం

సాక్షి, విశాఖపట్నం : 'ఈ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.18 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారు. ప్రజలకవసరమైన అన్ని సేవలనూ అందుబాటులోకి తెచ్చారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. నాడు–నేడుతో స్కూళ్ల రూపురేఖలను సమూలంగా మార్చేశారు. విలేజీ/అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేశారు. ఫ్యామిలీ డాక్టర్ సదుపాయాన్ని కల్పించారు. పారిశ్రామికంగానూ ఎంతో అభివృద్ధి చేశారు. ఇవేకాదు.. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు ఇంకెన్నో సంక్షేమ పథకాలను అవినీతికి ఆస్కారంలేకుండా అందజేస్తున్నారు. ఇదేకదా సుపరిపాలన అంటే?'.. అని సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లాం చెప్పారు. విశాఖలోని ఓ హోటల్లో ఆదివారం జరిగిన 'ట్రాన్స్‌ఫార్మింగ్ గవర్నెన్స్' అనే సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక 17 వైద్య కళాశాలలు వస్తే ఇప్పుడు 17 ఏర్పాటుకానున్నాయని.. ఇందులో ఐదింటి నిర్మాణం, అడ్మిషన్లు ఇప్పటికే పూర్తయి క్లాసులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన, చేపట్టిన సంస్కరణలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అజేయ కల్లాం చెప్పారు.



సదస్సులో పాల్గొన్న మేధావులు, వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులు

ప్రభుత్వోద్యోగుల జీతాలు ఇక్కడే ఎక్కువ..

దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ప్రభుత్వోద్యోగుల జీతాలు ఏపీలోనే ఎక్కువని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలతో పోలిస్తే 30 శాతం అధికమని ఆయన తెలిపారు. ఏపీలో 2014లో ప్రభుత్వోద్యోగుల జీతాల చెల్లింపులు రూ.18,709 కోట్లుంటే 2023–24లో అది రూ.57,222 కోట్లకు పెరిగిందన్నారు. ఏపీకంటే రెట్టింపు ఉన్న మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వోద్యోగుల జీతాలు రూ.48 వేల కోట్లేనని చెప్పారు. ఉద్యోగుల అలవెన్సులు, పెండింగ్ క్లియరెన్సుపై ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, రాష్ట్ర విభజన తర్వాత ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారని అజేయ కల్లాం తెలిపారు.

2.18 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు..

ఇక ఈ ఐదేళ్లలో 2.18 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు వచ్చాయని, వీరిలో 1.35 లక్షల మంది సచివాలయాల ఉద్యోగులేనన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 13 వేల మందికే ఉద్యోగ నియామకాలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ ఊరూరా సచివాలయాలను ఏర్పాటుచేసి రాష్ట్రస్థాయి సచివాలయ వ్యవస్థను గ్రామస్థాయికి తీసుకొచ్చారన్నారు. ఈ వ్యవస్థలో జరుగుతున్న అద్భుతాలను చూసి తమిళనాడు, కేరళ సహా మరికొన్ని రాష్ట్రాలు అమలుకు సన్నాహాలు చేస్తున్నాయని.. పాలన వికేంద్రీకరణ కోసం మూడు రాజధానుల ఏర్పాటు జరుగుతోందన్నారు. అలాగే.. సుదీర్ఘకాలంగా ఉన్న భూ వివాదాల పరిష్కారానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అమలుచేస్తున్నారన్నారు. ఇప్పుడు మరో 12 రాష్ట్రాలు దీని అమలుకు ప్రయత్నిస్తున్నాయని అజేయ కల్లాం చెప్పారు. ఈ విషయంలో కొంతమంది న్యాయవాదులు సృష్టిస్తున్న అపోహలను నమ్మొద్దని ఆయన కోరారు.

31లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు..

ఇదిలా ఉంటే.. మరే రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు, పథకాలు అందజేస్తున్న ఘనత ఒక్క మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కొత్త పోర్టులు, హార్బర్లు, ఐటీలు, పరిశ్రమలు వస్తున్నాయని.. మరే రాష్ట్రానికి రాని విధంగా రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీలో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని అజేయ కల్లాం చెప్పారు. ఇలాఅన్నిటా గత ప్రభుత్వాలకంటే ఎన్నో రెట్లు మెరుగైన సుపరిపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో జరుగుతోందని.. ఈ సుపరిపాలనపై ప్రజలే మంచి తీర్పునిస్తారన్నారు. ఈ సదస్సులో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ బాలమోహన్‌దాస్, డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ సుధాకర్, కార్తీక్, పలువురు మేధావులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలే ఆలోచింపజేశాయి

'1997లో ఏపీలో ఏడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వీరి ఆత్మహత్యలకు కారణాలపై అప్పటి ముఖ్య కార్యదర్శి జన్నత్ హుస్సేన్ నేతృత్వంలో జరిపిన దర్యాప్తులో ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రైతు పంట పెట్టుబడికి రూ.10 వేలు అప్పుచేస్తే రూ.3 లక్షలు చెల్లించాల్సి వస్తోందని, అప్పుల భారంతో పిల్లలను చదివించలేకపోతున్నారని, ఆరోగ్య సమస్యలకు రూ.వేలల్లో, పిల్లల పెళ్లిళ్లకు లక్షల్లో అప్పులు చేయాల్సి వస్తోందని, వాటిని తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తేలింది. ఈ వాస్తవాలను మహానేత వైఎస్ గుర్తించారు. సీఎం అయ్యాక దీనిపై ఆలోచించి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్ వంటివి అమలుచేశారు' అని అజేయ కల్లాం వివరించారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుతో సమస్య పరిష్కారం

సీఎం జగన్‌కు బాధితురాలి కృతజ్ఞత



మచిలీపట్నంటౌన్: కులాంతర వివాహం చేసుకున్న ఓ మహిళపై కుటుంబ సభ్యుల వేధింపులు అధికమవడంతో ఆమె 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశారు. దీంతో సమస్య పరిష్కారమైందని బాధితురాలు ఉష తెలిపారు. ఆమె కథనం మేరకు.. అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం, జయనగర్ కాలనీకి చెందిన ఉష, కృష్ణాజిల్లా, మచిలీపట్నానికి చెందిన వైద్యుడిని కులాంతర వివాహం చేసుకున్నారు. ఇది నచ్చని ఉష కుటుంబ సభ్యులు ఆమెను రెండుసార్లు కిడ్నాప్ చేశారు. ఆ తరువాత మచిలీపట్నంలోని ఆమె ఇంటి వద్దకు కిరాయి గూండాలను పంపి హత్యాయత్నం చేశారు. ఈ ఘటనపై సీసీకెమెరా ఫుటేజ్ ఆధారాలతో 'జగనన్నకు చెబుదాం'లో ఉష ఫిర్యాదు చేశారు. కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ స్పందించి పోలీస్ బృందాన్ని కళ్యాణదుర్గం పంపించి 11 మంది నిందితులను మచిలీపట్నం తీసుకొచ్చి బైండోవర్ చేశారు. తనపై ఎలాంటి దాడులకు పాల్పడినా వారిదే బాధ్యతగా చేయడంతో తనకు రక్షణ కల్పించినట్లయిందని ఉష సంతోషం వ్యక్తంచేశారు. తన సమస్యను 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా పరిష్కరించిన సీఎం జగన్‌కు ఉష కృతజ్ఞతలు తెలిపారు.

బాబు, పవన్‌లను ప్రజలే తరిమికొడతారు

ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తోన్న చంద్రబాబు, పవన్‌లను ప్రజలే తరిమికొడతారని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఉమ్మడి సభకు జనం రాకపోవడంతో బాబు, పవన్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమంతో వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయి నుంచి బలమైన పార్టీగా నిలిచిందని చెప్పారు. సీఎం జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే పవన్‌తో చంద్రబాబు పొత్తు పెట్టుకుని జిత్తులమారి వేషాలు వేస్తున్నాడని ఆరోపించారు. 42 ఏళ్ల అనుభవం, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఒకరిపై ఆధారపడి రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల తర్వాత బాబు, పవన్‌లు రాజకీయ సన్యాసం తీసుకుంటారని పేర్కొన్నారు.

దస్తగిరి చెప్పేవన్నీ అబద్ధాలే

- అతనిపట్ల సునీతమ్మకు ఎందుకంత ఆరాటం?
- ఎర్రగంగిరెడ్డి నోరు విప్పితే అసలు నిజాలు
- వివేకా హత్యలో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిది కీలకపాత్ర
- సీబీఐకి చెప్పినా పట్టించుకోలేదు
- రిమాండ్‌లో ఉన్న సునీల్‌యాదవ్ బంధువు భరత్‌యాదవ్ వెల్లడి



పులివెందుల: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి చెప్పేవన్నీ పూర్తి అవాస్తవాలని.. హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న సునీల్‌యాదవ్ సమీప బంధువు భరత్‌యాదవ్ స్పష్టంచేశారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దస్తగిరి తనకు ప్రాణహాని ఉందని చెబుతూ రౌడీయిజం, గూండాయిజం, సెటిల్‌మెంట్లు ఎలా చేస్తున్నాడని ప్రశ్నించారు. అతను చేసిన దుర్మార్గపు పనిని గొప్పగా చెప్పుకుంటూ సమాజంలో రౌడీయిజంతో హల్‌చల్ చేస్తున్నాడన్నారు. ఉన్నతమైన వ్యక్తులను టార్గెట్ చేస్తూ అబద్ధపు మాటలతో సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాడని మండిపడ్డారు. నిజాన్ని కప్పిపుచ్చి దస్తగిరితో వెనుక ఉండి ఎవరు మాట్లాడిస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. గతంలో సునీల్ యాదవ్, దస్తగిరిలు తమ ఆర్థిక లావాదేవీల విషయంలో తనను సంప్రదించేవారని.. అప్పట్లో ఐస్ బండి వ్యాపారం చేస్తూ అప్పులతో ఉన్న దస్తగిరి ఇప్పుడు విలాసవంతమైన జీవితం ఎలా గడుపుతున్నాడని భరత్‌యాదవ్ ప్రశ్నించారు. తనకు కూడా డబ్బులు బాకీ ఉన్న దస్తగిరి తననూ దూషించాడన్నారు. వివేకా రెండో భార్య అయిన షమీమ్‌కు ఆస్తి పోతుందనే ఈ హత్య జరిగి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. ఈ హత్యలో వివేకా అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కీలకపాత్ర పోషించాడన్నారు. అతను వెనుక ఉండి ఎర్రగంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరిల ద్వారా హత్య చేయించాడన్నారు.

ఎర్రగంగిరెడ్డి నోరువిప్పితే అసలు విషయాలు వెల్లడి..

ఈ హత్యలో ఎర్రగంగిరెడ్డి నోరు విప్పితే పూర్తి విషయాలు బయటపడతాయని భరత్‌యాదవ్ చెప్పారు. తనకు సునీల్‌యాదవ్ రూ.16 లక్షలు ఇవ్వాలని, అప్పట్లో తాను డబ్బుల విషయం అడిగితే రాజశేఖర్ సార్ ఇవ్వాలని, డబ్బులు వచ్చిన వెంటనే ఇస్తానని చెప్పేవాడన్నారు. అలాగే, డబ్బుల విషయమై ఒకసారి ఎర్రగంగిరెడ్డి కూడా నీకు రావాల్సిన డబ్బులు ఎక్కడికీ పోవు, త్వరలోనే వస్తాయని తనతో చెప్పేవాడన్నారు. దస్తగిరి, దస్తగిరి భార్య ఎవరితో మాట్లాడుతున్నారో వారికి డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భరత్‌యాదవ్ అభిప్రాయపడ్డారు. అసలు సునీతమ్మ తన తండ్రిని చంపిన దస్తగిరి కోసం ఎందుకు ఆరాటపడుతోందో ఆమెకే తెలియాలన్నారు. గతంలో తనను సీబీఐ ఎంక్వైరీకి పిలిచినప్పుడు అన్ని విషయాలు వారికి తెలిపానని, అయినా కూడా వారు తాను చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఎర్రగంగిరెడ్డి నోరువిప్పితే ఈ కేసులో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాత్ర బయటపడుతుందని భరత్‌యాదవ్ స్పష్టంచేశారు.

దస్తగిరిని బెదిరించారనడం అవాస్తవం

- డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి వెంట జైలు అధికారులు, వైద్యులున్నారు
- నిబంధనలు మేరకు దస్తగిరిని మరొకరు కలిసే అవకాశంలేదు.. మెడికల్ క్యాంపు కోసమే డాక్టర్ చైతన్యరెడ్డి వచ్చారు
- సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్ వెల్లడి

సాక్షి ప్రతినిధి, కడప: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరిని జైల్లో బెదిరించారనడం అవాస్తవమని సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్ స్పష్టం చేశారు. మెడికల్ క్యాంపునకు వెళ్లిన డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి అప్రూవర్ దస్తగిరిని బెదిరించారని రూ.20 కోట్లు ఆఫర్ ఇచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో సమాచార హక్కు చట్టం కింద అందుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను డాక్టర్ చైతన్యరెడ్డి కోరారు. ఈ మేరకు సూపరింటెండెంట్ ప్రకాష్ స్పందించారు. ఆయన పేర్కొన్న విషయాలేమిటంటే.. దస్తగిరి గత ఏడాది అక్టోబరు 31న మా సెంట్రల్ జైలుకు వచ్చారు.



ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అదే ఏడాది నవంబరు 28న సెంట్రల్ జైలులో మెడికల్ క్యాంపు చేపట్టాం. వైద్యులతో కూడిన బృందం ఒకటి జైలుకు వచ్చింది. అందులో డాక్టర్ చైతన్యరెడ్డి ఉన్నారు. ఆ వైద్య బృందం జైలులో ఉన్నంత వరకు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది వారి వెంటే ఉన్నారు. డాక్టర్ చైతన్యరెడ్డి దస్తగిరిని కలవలేదు. అలా కలవడమనేది అసాధ్యం. ఎందుకంటే ఆయన అప్రూవర్‌గా మారినప్పటి నుంచి ఆయన్ను ప్రత్యేక సెల్‌లో ఉంచాం. అలాగే, 24 గంటలూ సీసీటీవీ నిఘా ఏర్పాటుచేశాం. ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ రూల్స్–1979 రూల్ నెంబరు 731 అనుసరించి ఆయనను ప్రత్యేకంగా ఉంచాం. మెడికల్ క్యాంపు సమయంలోగానీ, ఆ తర్వాతగానీ డాక్టర్ చైతన్యరెడ్డి దస్తగిరిని కలిశారనడాన్ని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతున్నాం. డాక్టర్ చైతన్యరెడ్డి అక్కడ ఉన్నంత వరకు ఆయన వెంట సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్, అధికారులు, సిబ్బంది ఉన్నారు. మాతోపాటు మెడికల్ అధికారులు, ప్రత్యక్ష సాక్షులు. దస్తగిరి ఆరోపణల్లో నిజంలేదని వివరించారు.

ఫొటోగ్రాఫర్ దారుణ హత్య

ఈవెంట్ పేరుతో పిలిచి కెమేరాలు, పరికరాలు దొంగిలించి దారుణం

- వారం రోజుల తర్వాత ఘటన వెలుగులోకి..
- ఇద్దరు నిందితుల కోసం పోలీసుల గాలింపు



హతుడు పోతిన సాయి (ఫైల్)

అలమూరు/మధురవాడ/పీఎం పాలెం : సోషల్ మీడియాలో పరిచయం పెంచుకుని ఈవెంట్ చేద్దామని పిలిచి, స్నేహితుడితో కలిసి ఓ ఫొటోగ్రాఫర్‌ను హత్య చేసిన దారుణ ఘటన ఇది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. విశాఖ మధురవాడ సమీపంలోని బక్కన్నపాలేనికి చెందిన పోతిన సాయి(21)కి ఫొటోలు, వీడియోలు తీయడం హాబీ. అతడికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన షణ్ముఖ తేజతో సోషల్ మీడియాలో పరిచయమేర్పడింది. ఈ క్రమంలో సాయి వద్ద రూ.12.70 లక్షల విలువైన కెమేరాలు, ఇతర పరికరాలున్నాయని తేజ గుర్తించాడు. వాటిని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే దుర్బుద్ధి పుట్టడంతో అతడు పన్నాగం పన్నాడు. ఈ క్రమంలో తాను కూడా ఫొటోగ్రాఫర్‌నని, ఏవైనా ఈవెంట్లు ఉంటే కలసి చేద్దామని సాయిని నమ్మించాడు. రాజమహేంద్రవరంలో ఈవెంట్ ఉందని సాయిని తేజ నమ్మించాడు. సాయి గత నెల 26వ తేదీ మధ్యాహ్నం విలువైన కెమేరాలు, పరికరాలతో రైల్లో రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అప్పటికే తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంకకు చెందిన స్నేహితుడు వినోద్‌కుమార్‌తో తేజ రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్నాడు. అద్దెకు తీసుకున్న కారులో సాయిని ఎక్కించుకుని, సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ సాయంత్రానికి వేమగిరి చేరుకున్నారు. పథకం ప్రకారం అక్కడే సాయిని తేజ, వినోద్‌కుమార్‌లు హత్య చేసి మృతదేహాన్ని అదే రోజు అర్ధరాత్రి 216ఎ జాతీయ రహదారిపై ఉన్న జొన్నాడ గ్రామం వరకూ వచ్చి.. అక్కడి గౌతమీ గోదావరి తీరంలో పూడ్చివేశారు.

అనుమానం వచ్చిందేమో!

కారులో తనను ఇష్టానుసారంగా తిప్పడం వల్లో ఏమోగానీ తేజపై సాయికి అనుమానం వచ్చింది. మధ్యలో కారు ఫొటోతో పాటు తేజ ఫోన్ నంబర్‌ను కూడా తన తల్లి రమణమ్మకు వాట్సాప్‌లో పంపాడు. ఈ నేపథ్యంలో మూడు రోజులైనా సాయి ఇంటికి రాకపోవడం, అతడి ఫోన్, తేజ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడంతో సాయి తల్లిదండ్రులు గత నెల 29న విశాఖపట్నం పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి కారు యజమానిని ప్రశ్నించి కొంత సమాచారం రాబట్టారు. కాగా, విశాఖ కంచరపాలేనికి చెందిన యువతితో తేజ చాటింగ్ చేస్తున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. యువతిని విచారించగా.. ఈ హత్యాపన్నాగం బయట పడినట్లు తెలుస్తోంది. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతదేహాన్ని పూడ్చిన ప్రదేశాన్ని గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'వ్యూహం'లో అన్నీ వాస్తవాలే...

- త్వరలో 'వ్యూహం' పార్ట్–2 'శపథం' విడుదల
- డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/తెనాలి: ఎన్నో అడ్డంకులు అధిగమించి వ్యూహం సినిమా థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోందని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ తెలిపారు. ఆయన ఆదివారం విజయవాడ గాంధీనగర్‌లోని జయరాం థియేటర్‌లో సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, హీరో అజ్మల్ మీర్, హీరోయిన్ మానస, యూనిట్ సభ్యులతో కలిసి వ్యూహం చిత్రాన్ని వీక్షించారు. అనంతరం వర్మ మీడియాతో మాట్లాడుతూ వ్యూహం చిత్రంలో వాస్తవాలను మాత్రమే తెరకెక్కించామని స్పష్టంచేశారు. నారా లోకేశ్ వాస్తవంగా ఎలా ఉంటాడో సినిమాలో కూడా అలాగే చూపించామని, జోకర్‌గా చూపలేదని పేర్కొన్నారు. టీడీపీ–జనసేన పొత్తులే ఇతివృత్తంగా వ్యూహం పార్ట్–2గా 'శపథం' సినిమా తెరకెక్కుతోందని వివరించారు. ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి, తనకు ఎటువంటి సంబంధం లేదని వర్మ స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫేవర్‌గానే వ్యూహం చిత్రాన్ని రూపొందించానని చెప్పారు. పవన్ కళ్యాణ్‌ను జోకర్‌లా చూపించలేదని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ 24 సీట్లు ఎలా ఎంచుకున్నారో వ్యూహం పార్ట్–2లో చూపిస్తామన్నారు. లోకేశ్ పేరుతో కేక్ కట్ చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. 23 వారి లక్కీ నంబర్ కాబట్టి 23 సార్లు కత్తితో కేక్ కట్ చేశానని చెప్పారు. అనంతరం వ్యూహం సినిమా హీరో అజ్మల్ మీర్ మాట్లాడుతూ ఆర్జీవీ పక్కన ఉంటే ఎలాంటి క్యారెక్టర్‌కు అయినా ప్రాక్టీస్ అవసరం లేదన్నారు. థియేటర్లలో సక్సెస్ ఫుల్‌గా వ్యూహం చిత్రం దూసుకుపోతోందని నిర్మాత దాసరి కిరణ్ కుమార్ అన్నారు. అభిమానుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోందన్నారు.



విజయవాడ జయరాం థియేటర్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న రాంగోపాల్ వర్మ

తెనాలిలో 'వ్యూహం' యూనిట్ సందడి

తెనాలిలో ఆదివారం రాత్రి వ్యూహం సినిమా యూనిట్ సందడి చేసింది. వ్యూహం సినిమా ప్రదర్శిస్తున్న తెనాలి ప్రియా థియేటర్ కాంప్లెక్స్‌కు దర్శకుడు రాంగోపాల్‌వర్మ, నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, హీరో అజ్మల్, హీరోయిన్ మానస తదితరులు వచ్చారు. వారిని చూసి ప్రేక్షకులు కేకలు వేసి సందడి చేశారు. వర్మ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం, అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి ఎదుగుదల, ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవటం తనకు నచ్చిందన్నారు. చిత్ర యూనిట్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

స్త్రీలకు సమాన హక్కులు



జ్యోతి వెలిగిస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: సధృడ సమాజ నిర్మాణం కోసం పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కులు ఉన్నాయని కిల్లే బ్రహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, సోమవారి పేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య స్వామీజీలు పేర్కొన్నారు. పండిత సిద్ద రామ జంబల దిన్ని రంగ మందిరంలో ఆదివారం జిల్లా వీరశైవ మహిళలు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళ దినోత్సవం, అక్క అవార్డుల పంపిణీ కార్యక్రమంలో మహిళలను సన్మానించి మాట్లాడారు. మహిళలు హక్కులు, విధులు, సమానత్వం, విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. అదే విధంగా స్వేచ్ఛకు హద్దులు ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు భూపాల్ నాడగౌడ, చంద్రశేఖర్, జిల్లావీరశైవ మహిళ సమాజం అధ్యక్షురాలు రేఖ, నిర్మల, సులోచన, సుమతీ శాస్త్రి, విజయ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీకి సిద్ధం



మాట్లాడుతున్న నాయక్

రాయచూరు రూరల్: రాయచూరు-యాదగిరి జిల్లాల నుంచి లోక్‌సభకు పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, మాజీ ఎమ్మెల్యే గంగాధర నాయక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...తనకు రెండు జిల్లాల్లో అభిమానులు, కార్యకర్తలు ఉన్నారని, బీజేపీ అధిష్టానం పోటీకి అవకాశం కల్పిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆ మూడు స్టేషన్లలో రైలు హాల్ట్

రాయచూరు రూరల్: దక్షిణ మధ్య రైల్వే బోర్డు పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం లాతూర్-యశ్వంతపుర రైలు బీదర్ జిల్లాలోని కమలానగర్, బాల్కి, ఉద్గీర్‌లో నిలుపుదల చేస్తున్నట్లు కేంద్రమంత్రి భగవంత ఖూబా తెలిపారు. శనివారం రాత్రి ఆయన బీదర్ జిల్లా కమలానగర రైల్వే స్టేషన్‌లో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. రైలు నంబర్ 16583-16584 ఈ మూడు స్టేషన్లలో రైళ్లను ఆపాలని సుదీర్ఘ విన్నపాల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి బోసురాజ్

రాయచూరు రూరల్: గ్రామీణులకు తాగు, సాగునీటిని అందించడానికి సిద్ధంగా ఉన్న గణేకల్ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజ్ పరిశీలించారు. ఆదివారం సిరవార తాలూకా గణేకల్ (బంగారప్ప) చెరువు వద్ద నూతనంగ నిర్మించిన ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రూ.211 కోట్లతో రూపుదిద్దుకున్న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. మంత్రి వెంట పలువురు అధికారులు ఉన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

రాయచూరు రూరల్: జిల్లాలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతమైంది. ఉదయం నగరంలోని ప్రభుత్వ కేఈబీ ప్రాథమిక పాఠశాలలో మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ చిన్నారులకు చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారం, జిల్లా ఆరోగ్య అధికారి సురేంద్ర బాబు, విద్యాశాఖ అధికారి బడిగేరె, మహిళా శిశు సంక్షేమ అధికారి చేతన్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధాని కావాలి

కంప్లి: ప్రధాని నరేంద్ర మోదీ జనరంజక పాలన అందిస్తున్నారని, ఆయన మరోసారి ప్రధాని అయితే దేశం మరింత ఆర్థికంగా ఎదుగుతుందని మాజీ మంత్రి శ్రీరాములు తెలిపారు. కూడ్లిగి తాలూకాబణవికల్లు గ్రామ శివారున ఏర్పాటు చేసిన విందు భోజన, తాలూకా స్థాయి బీజేపీ కార్యకర్తలు, ప్రముఖులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోదీ ఏ ప్రాంతం నుండి లోక్‌సభకు పోటీ చేసిన అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. తాను కూడా లోక్‌సభకు అవకాశం ఇస్తే గెలిచి చూపుతానన్నారు.

నగరంలో స్వచ్ఛత అభియాన్



చెత్తతో పేరుకుపోయిన కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి పరిసరాలను సంరక్షించాలని యువ స్వచ్ఛ అభియాన్ నేత రవిబోస్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో 20వ వార్డులో స్వచ్ఛత అభియాన్‌కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇళ్ల ముందు శుభ్రతను పాటించాలన్నారు.

సుందర పక్షిధామం అంకసముద్రం



సుదూర ప్రాంతం నుంచి వలస వచ్చిన పక్షి జాతులు



అంకసముద్రంలో సేద తీరుతున్న విహంగాలు



గూళ్లపై అరుదైన పక్షులు

- హంపీ సమీపంలో పర్యాటకులను కనువిందు చేస్తున్న పక్షులు
- సుదూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన 240 పక్షిజాతులు

సాక్షి,బళ్లారి: ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీ, కరిడిధామ, తుంగభద్ర డ్యాం, ప్రముఖ పుణ్యక్షేత్రాలతో ఉమ్మడి బళ్లారి జిల్లా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నేపథ్యంలో జిల్లాలో పక్షులు కాశీగా అంకసముద్రము కూడా చేరిపోవడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

కర్ణాటక రాష్ట్రంలోనే అరుదైన, అపురూపమైన పక్షిధామగా పేరుగాంచిన అంకసముద్రం చెరువులో పెయింటెడ్ స్టార్క్, పెలికాన్, స్పూన్ బిల్లు, ఓపన్ బిల్లు స్టార్క్, గ్రేటర్ కార్మోరేట్, విదేశాలకు చెందిన బ్రాహ్మణీ బాతు, బ్లాక్ టెయిల్డ్, గాడ్ వీట్, మార్స్ స్యాండ్ పైపర్, యూరేపియన్ కర్ లివ్, సైబీరియన్ తదితర 87 జాతులకు చెందిన పక్షులు విచ్చేయడంతో అంకసముద్రం చెరువు పక్షి ప్రేమికులకు మైమరిపిస్తోంది.

ఏడాది పొడవునా ఇక్కడే :

ముఖ్యంగా దేశ, విదేశాల నుంచి 240 రకాలు చెందిన పక్షిజాతులు రావడంతో పక్షి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న అరుదైన నీటి కుక్కలు సందడి చేస్తున్నాయి. జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి తాలూకా అంకసముద్రం గ్రామ సమీపంలో విజయనగర రాజులు కాలంలో కట్టించిన ఈ చెరువు దాదాపు 244 ఎకరాల్లో విస్తరించిన అంకసముద్రం చెరువు పక్షులకు నిలయంగా మారింది. తుంగభద్ర నది నుంచి ఏడాది పొడవునా నీరు సరఫరా చేస్తుండటంతో ఎప్పటి ఈ చెరువు ఖాళీ కాకపోవడం విశేషం. దీంతో దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అరుదైన పక్షులు ఇక్కడ ఏడాది పొడవునా వచ్చి వెళ్లుతుంటాయి. దాదాపు వందలాది రకాలకు పైగా అందమైన పక్షులు రాకతో ప్రముఖ పక్షులు కేంద్రంగా, పక్షిధామగా, పక్షి ప్రేమికులకు నిలయంగా ఈ చెరువు విరాజిల్లుతోంది. హంపీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పర్యాటకులు భారీగా వస్తుంటారు.



అరుదైన నీటి కుక్కలు

పొడవుగా కనిపించే ఈ నీటికుక్కలు అంకసముద్రం చెరువులో పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. మనుషులు కనిపిస్తే ఒకింత సిగ్గు పడుతూ వయ్యారాలు ఒలకబోసి అటు ఇటుగా తిరిగే ఈ నీటికుక్కలు చెరువుల్లో నీటిశుభ్రత చేసే అరుదైనవని గుర్తించారు. భారతదేశంతో పాటు బంగ్లాదేశ్, పాకిస్థాన్, నేపాల్, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా దేశాల్లో మాత్రమే ఈ నీటికుక్కలు కనిపిస్తాయని, చారిత్రాత్మక నేపథ్యం,ప్రపంచ పర్యాటక కేంద్రాలు ఉన్న ఉమ్మడి బళ్లారి జిల్లాకు అంకసముద్రం చెరువు పక్షులకు నిలయంగా మారడంతో ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

హుబ్లీలో భారీ చోరీలు

హుబ్లీ: నగరంలో రెండు చోట్ల దొంగలుపడి దోచుకున్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక విద్యానగర పాటిల్ కాలనీలోని అపార్టుమెంట్‌లో ఉంటున్న ఓ కుటుంబం ఫ్లాట్‌కు తాళం వేసి కుమార్తె ఇంటికి వెళ్లారు. దొంగలు విషయం గుర్తించి ఇంటిలో ఉన్న రూ. లక్షన్నర విలువైన బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో గ్రానైట్ వ్యాపారి ఇంటిలో లక్షలు విలువ చేసే బంగారు దొంగలు ఎత్తుకెళ్లారు. ధార్వాడ సంఘం థియేటర్ వద్ద ఉన్న కెంపగెరిలో ఈ చోరీ జరిగింది. అరుణ బసవరాజ ఉనగుంద కుటుంబ సభ్యులు బంధువుల పెళ్లి కోసం యాదగిరికి వెళ్లగా దొంగలు తమ చేతివాటం చూపారు. ఇంటి తాళాన్ని విరగకొట్టి లోనికి వెళ్లిన దొంగలు ఇంట్లో ఉన్న 250 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చిన వారు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేఆర్‌పీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న లక్ష్మీ అరుణ

బళ్లారి అర్బన్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ గాలి జనార్దన్‌రెడ్డి సారథ్యంలోని కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ నాయకురాలు లక్ష్మీ అరుణ ఆధ్వర్యంలో వనెనూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు కేఆర్‌పీపీ పార్టీలో చేరారు. ఆ పార్టీ ప్రముఖులు వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మీ అరుణ మాట్లాడుతూ... పార్టీ లక్ష్యాలను గుర్తించుకొని లోక్‌సభ ఎన్నికలలోగా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వనెనూరు గ్రామ ప్రముఖులు మహేష్, గులియప్ప, హుండేకర్ రాజేష్, మారెష్‌తో పాటు జిల్లాధ్యక్షుడు దమ్మూరు శేఖర్, గోనాళ్ రాజశేఖర్‌గౌడ, శ్రీనివాస్‌రెడ్డి, అలీఖాన్, ఉమారాజ్, మల్లికార్జున ఆచార్, సునిల్‌రెడ్డి, శ్రీనివాస, శంకర్ గురు, కిరణ్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ఇసుక అక్రమ రవాణా



ఇసుక లోడింగ్ కోసం వచ్చిన టిప్పర్లు

రాయచూరు రూరల్: రాయచూరు, కలబుర్గి, యాదగిరి జిల్లాలో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. జిల్లాలో తుంగభద్ర, కృష్ణనది తీరంలో ఉన్న ప్రాంతాలలో రోజు వందలాది ట్రిప్పర్లు ద్వారా ఇసుకను దోచేస్తున్నారు. జిల్లాలోని మాన్వి, రాయచూరు, దేవదుర్గ, యాదగిరి జిల్లా సురుపుర, యాదగిరి తాలూకాలో అక్రమార్కులు ప్రకృతి వనరును కొల్లగొడుతున్నారు.


పర్యావరణానికి ప్రమాదం :

కాంట్రాక్టర్లు ఇసుకను దొంగతనంగా నిల్వ చేసుకుంటున్నారని సామాజిక కార్యకర్త హనుమంతు ఆరోపిస్తున్నారు. ప్రకృతి వనరును యథేచ్ఛగా దోచేస్తుంటంతో పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్ట పగలే నదిలో బుల్డోజర్లతో తోడేస్తున్నారు. రాయల్టీని రెండు వాహనాలకు మాత్రమే తీసుకుని మిగిలిన వాహనాలకు ఎటువంటి రాయల్టీ లేకుండా ఇసుకను దోచుకుంటున్నారు. దీంతో కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోంది. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారి, ఎస్పీ, రెవెన్యూ అధికారులు మౌనంగా ఉండటంపై జిల్లా వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పంటలకు ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోలారు: సిరిధాన్య పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుమా తెలిపారు. ఆదివారం నగరంలోని టీకల్ రోడ్డులో ఉన్న అంతరగంగ సిరిధాన్య రైతు ఉత్పత్తుల సంస్థ ఆధ్వర్యంలో సిరిధాన్య ఉపయోగాలపై ఉపన్యాస కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిరిధాన్య పంటలను పండించడానికి రైతులకు అధిక ప్రోత్సాహం అందిస్తోంది. వ్యవసాయ, హార్టికల్చర్ శాఖల ద్వారా దీనిపై రైతులను అధికంగా జాగృతం చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే సౌలభ్యాలను పొంది నాణ్యమైన సిరిధాన్య పంటలను పండించాలని తెలిపారు. ఇందుకు ప్రభుత్వ శాఖల సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర విత్తన మండలి డైరెక్టర్ నాగరాజ్ మాట్లాడుతూ సిరిధాన్యాలను సుమారు 50 సంవత్సరాల క్రితమే పండించే వారు. అయితే ఆనాడు అది పేదల ఆహారం అయి ఉండేది, ఆపితే అదే ఇప్పుడు పౌష్టిక ఆహారం అయిందన్నారు. నేడు రైతులు పండించే ప్రతి పంటలోను రసాయనిక ఎరువులను ఉపయోగిస్తున్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్పరిణామం కలుగుతోంది.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి



చుక్కల మందు వేస్తున్న మంత్రి నాగేంద్ర



పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ శ్వేత

బళ్లారి అర్బన్: పిల్లల్లో అంగవైకల్యం నివారించే దిశలో తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా పోలియో టీకాలు వేయించాలని కార్పొరేషన్ మేయర్ శ్వేత పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ... మహమ్మారి పోలియో నివారణకు కేవలం రెండు చుక్కల టీకా అత్యవసరం అన్నారు. ప్రజలందరూ తప్పకుండా 5 ఏళ్ల లోపు పిల్లలందరికి టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఓ డాక్టర్.రమేష్‌బాబు, జిల్లా సర్జన్ డాక్టర్.బసిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేసిన మంత్రి

బళ్లారి అర్బన్: స్థానిక గాంధీ నగర్‌లోని సముదాయ ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర మంత్రి బీ.నాగేంద్ర చిన్నారులకు పోలియో టీకాలు వేశారు. అంతేగాక ఆయన ప్రేమతో టీకా కోసం వచ్చిన పిల్లలందరికి చాకెట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సురేఖ మల్లన్నగౌడ, డీహెచ్ఓ రమేష్‌బాబు, అధికారులు అనిల్‌కుమార్, ఈశ్వర్ దాసనప్పనవర తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరిస్తున్న బీజేపీ నేతలు

బళ్లారి అర్బన్: నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా రైతు మోర్చా బీజేపీ అధ్యక్షుడిగా ఐనాథ్‌రెడ్డితో పాటు పదాధికారులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లాధ్యక్షులు అనిల్‌కుమార్ మోకా, ఉపాధ్యక్షుడు గాలి శంకరప్ప, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌గౌడ, రైతు మోర్చా సహ ఇన్‌చార్జిగా సుమారెడ్డి, బీఎస్ శంకర, శరణగౌడ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రైతు మోర్చా బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఐనాథరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో రైతు సమస్యలపై పోరాటం చేస్తానని, రైతు ఆత్మహత్యలు జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రాజు (ఫైల్)

బళ్లారిఅర్బన్: బళ్లారి తాలూకాలోని మోకా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు శనివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ రుద్రప్ప తెలిపారు. శనివారం సాయంత్రం మోకా గ్రామంలోని జయ మల్లేశ్వర స్వామి రథోత్సవం సందర్భంగా కర్నూల్ జిల్లా ఆలూరు తాలూకా అద్దిగేరి గ్రామానికి చెందిన చక్రపాణి కుమారుడు చాకలి రాజు (23) జాతరకు వస్తుండగా మోకా ఫారెస్ట్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని విమ్స్ మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయి విక్రేతల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

కెజీఎఫ్: గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన అండర్‌సన్ పేట పోలీసులు వారి వద్ద నుంచి 33 కిలోల గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి అండర్‌సన్ పేట పోలీస్ సరిహద్దులోని కెంపాపుర గ్రామ చెక్‌పోస్టు నుంచి వెళుతున్న ఆటోను అడ్డుకుని తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ఇద్దరిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చేతన్‌కుమార్ తెలిపారు.

5న ఎస్సీ, ఎస్టీ నౌకర్ల సమావేశం

కోలారు : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ నౌకర్ల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని బెంగుళూరులో ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయ తెలిపారు. ఆదివారం నగరంలోని నచికేత నిలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సమావేశానికి పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ నౌకరులు పాల్గొనడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నౌకర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు జి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి ఎస్ ముకుంద పాల్గొన్నారు.

ఎండుమిర్చి లారీ దగ్ధం



కాలిపోతున్న ఎండుమిర్చి లారీ

కంప్లి: కురుగోడు తాలూకాలోని సిద్ధమనహళ్లి గ్రామంలో ఎండుమిర్చి లోడుతో వెళ్తున్న లారీ కాలి బూడిదైన ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన రైతుల నుంచి 408 బస్తాల ఎండు మిర్చితో బయలుదేరిన లారీ సిద్ధమనహళ్లి గ్రామంలోకి రాగానే విద్యుత్‌వైర్లు తగిలి లారీతో పాటు సరుకు మొత్తం కాలిపోయింది.

చుక్కల మందు కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం

- కేఫ్ బాంబు నిందితుడిని త్వరలో అరెస్ట్ చేస్తాం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సీఎం

హొసపేట: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం నేపథ్యంలో ఆదివారం తాలూకాలోని కమలాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య చిన్నారులకు పోలియో చుక్కలు వేసి రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుళ్ల సమస్య సంబంధించిన కేసులో రెండు, మూడు రోజుల్లో అరెస్ట్ చేస్తామని చెప్పారు. ఈ విషయంపై పోలీసులకు క్లూ దొరికిందని పోలీసులు నిందితులను అరెస్టు చేసే పనులు ప్రారంభించారని తెలిపారు. అరెస్ట్ పై ఇంకా తనకు సమాచారం రాలేదని తెలిపారు. కేసును సీసీబీకి అప్పగించామని తెలిపారు. విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ ప్రకటన కేసుపై ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఇంకా దర్యాప్తులో ఉందని అయితే నివేదిక ఇంకా అందుబాటులో రాలేదన్నారు. ఈ విషయంపై తాను కూడా సీరియస్‌గా ఉన్నానని చట్టం ప్రకారం తగిన శిక్ష పడాలన్నారు. హంపీ కన్నడ విశ్వవిద్యాయానికి మౌలిక కల్పనలో తమ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మీడియా అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య విసుగు చెందిన ప్రశ్నకు బదులు చెప్పకుండా వెళ్లిపోయారు. మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే, ఎమ్మెల్యే గవియప్ప, కేఎంఎఫ్ అధ్యక్షులు భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పోలియో కనుమరుగు



చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే రూపాశశిధర్

కేజీఎఫ్: దేశంలో పోలియో మహమ్మరి పూర్తిగా కనుమరుగైందని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పల్స్ పోలియో చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడిన ఎమ్మెల్యే పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ఐదేళ్లలోపు పిల్లలందరికి చుక్కల మందును వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయంతం చేయాలి

కోలారు: ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 1,61,868 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేసే లక్ష్యం కలిగి ఉన్నట్లు తెలిపారు. తాలూకా వైద్యాధికారి డాక్టర్ నారాయణస్వామి, ఆర్‌సి హెచ్‌ఓ అధికారి డాక్టర్ విజయకుమారి, డాక్టర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి



చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే

మాలూరు: ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పల్స్ పోలియో చుక్కలను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తాలూకా పాలనాధికారి డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ... ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంతో పాటు ఫిర్కా స్థాయిలో కూడా పల్స్ పోలియో చుక్కలను వేస్తున్నారని, పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కృషిక సమాజ అధ్యక్షుడు ఆనేపుర హనుమంతప్ప, పురసభ సభ్యుడు మురళీధర్, భవ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

కోలారు: హత్యకేసులో నిందితుడుకి జీవితఖైదు శిక్షను విధిస్తూ ముళబాగిలు సెషన్స్ కోర్టు శనివారం తీర్పును వెలువరించింది. ముళబాగిలు నగరానికి చెందిన సుప్రీత్ (25) నిందితుడు. 2020లో సుప్రీత్, అతని స్నేహితుడు గొర్రెల వ్యాపారం చేసే నెపంతో వెళ్లి గొర్రెల యజమాని మునిస్వామి గౌడను హత్య చేశారు. ఘటనపై మునిస్వామి గౌడ కుమారుడు చంద్రు ముళబాగిలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సుప్రీత్‌ను అరెస్టు చేసి కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. సుదీర్ఘ విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి దేవమానె నిందితుడు సుప్రీత్‌కు జీవితఖైదును విధిస్తూ తీర్పు చెప్పారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

పేదోడి పెద్ద మనసు



సైకిళ్లు అందజేసిన ఆంజనేయులు

రాయచూరు రూరల్: దానం, ధర్మం చేయడానికి ఉదార స్వభావం ఉండాలి. ఇందులో ధనిక, పేద అనే తేడా ఉండదు. అలాంటి కోవకు చెందిన ఓ కార్మికుడు పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను కొనిచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవదుర్గ తాలూకాలోని మల్కందిన్ని నుండి హేమనూరు ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. అక్కడి పేద విద్యార్థులు కాలినడనక పాఠశాలకు వెళ్లడాన్ని గమనించిన ఆంజనేయులు 11 మందికి రూ. 66 వేలు ఖర్చు పెట్టి సైకిళ్లను కొనిచ్చి తన దాతృత్వాన్ని చాటాడు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవరాజ్, తాలూకా విద్యాశాఖ అధికారి సుఖదేవ్, అధికారి శివరాజ్ పూజారి, గ్రామస్థులు వెంకటేష్, సూగప్పగౌడ తదితరులు ఆంజనేయులను అభినందించారు.

వేడుకగా పట్టాభిషేకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు

కంప్లి: స్వాముల మఠాలు చీల్చే వారు కారని సమాజ సేవకులని కొట్టూరు ముప్పిన బసలింగ స్వామి అన్నారు. గరగ నాగలాపుర శ్రీ గురు ఒప్పత్తేశ్వర విరక్త మఠంలో పూజ్యశ్రీ నిరంజన ప్రభు దేశీకర నిరంజన పట్టాభిషేక మహోత్సవంలో ఏర్పాటు చేసిన శ్రీ యడెయూరు సిద్దలింగేశ్వర పురాణ ప్రవచన ప్రారంభోత్సవం, ఒప్పత్తేశ్వర సముదాయ భవన ప్రారంభోత్సవంలో పాల్గొని భక్తులను ఆశీర్వదించి మాట్లాడారు.

వైభవంగా రథోత్సవం



కంప్లి: సండూరు తాలూకా చిక్క కెరెయాణినహళ్లి గ్రామంలో శనివారం సాయంత్రం శ్రీ బేవినహళ్లి దుర్గమ్మ దేవి జాతర సందర్భంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలంకరించిన రథంలో దేవి ఉత్సవమూర్తిని అధిష్టించి రథోత్సవం నిర్వహించారు.